www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 31-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 123 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 3.56 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రోహిణి ఉ. 10.13 తదుపరి మృగశిర వర్జ్యం: మ. 3.51-5.28; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.46; అమృతఘడియలు: ఉ. 7.02-8.35, రా. 1.31-3.08; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.44 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 31 జూలై 2024

ఫ్యాషన్

భలే బెస్పోక్

రెడీమేడ్ జ్యువెలరీకి రోజులు చెల్లి కస్టమ్ మేడ్ జ్యువెలరీ వాడుకలోకొస్తే, తాజాగా 'బెస్పోక్' జ్యువెలరీ ట్రెండ్ ఊపందుకుంటోంది. అనంత్ అంబానీ పెళ్లికి నీతా అంబానీ ధరించిన 'గార్డెన్ ఆఫ్ లవ్' జ్యువెలరీ ఆ కోవకు చెందినదే! ఈ జ్యువెలరీ స్టైల్స్ మీకోసం...



కస్టమ్ మేడ్‌కూ బెస్పోక్‌కూ తేడా ఉంది. అప్పటికే అందుబాటులో ఉన్న నగను తమకు నచ్చినట్టు తయారు చేయించుకోవడం కోసం, నగ లోహం లేదా రాళ్లను మార్చుకోవడాన్ని కస్టమ్ మేడ్ అంటారు. బెస్పోక్ జ్యువెలరీలో డిజైనర్‌తో కలిసి పూర్తిగా, ప్రత్యేకంగా తమ కోసమే నగను సృష్టించుకుంటారు. ఇందుకోసం నగలో ఉపయోగించే లోహం బదులు, జాతి రాళ్లు, నగిషీలు అన్నీ ప్రత్యేకంగానే ఉంటాయి. తాజాగా నీతా అంబానీ ధరించిన బెస్పోక్ జ్యువెలరీ గార్డెన్ ఆఫ్ లవ్ కోసం అరుదైన గులాబీ, నీలం, ఆకుపచ్చ, నారింజ వజ్రాలను పూల తోటను మరిపించేలా ఒక క్రమపద్ధతిలో అలంకరించారు. ఈ నగ తయారీకి అవసరమైన జాతి రాళ్ల సేకరణకు ఏకంగా మూడేళ్ల సమయం పట్టడంతో పాటు, ఒక్కొక వజ్రాన్నీ మలచడానికి కళాకారులకు 4000 గంటల సమయం పట్టడం చెప్పుకోదగిన విశేషం. నగ మధ్యలోని హృదయాకారపు నీలం వజ్రం చుట్టూరా పోర్ట్రెయిట్ కట్ వజ్రాలను పొదిగారు. నెక్లెస్‌లోని ఒక్కొక పువ్వు చుట్టూరా అమర్చిన పోర్ట్రెయిట్ కట్ డైమండ్స్ పువ్వు కోసం ఎంచుకున్న జాతి రాళ్ల రంగులను నలుదిక్కులా వెదజల్లుతూ మిరుమిట్లుగొలిపేలా ఉండడం విశేషం.

మిస్‌మ్యాచ్ ఇయర్ రింగ్స్

రెండు చెవులకూ ఒకే రకమైన స్టడ్స్ మాత్రమే ఎందుకు ధరించాలి? ప్రత్యేకంగా కనిపించడం కోసం వినూత్నమైన స్టైల్‌ను అనుసరించాలనుకున్న నీతా గార్డెన్ ఆఫ్ లవ్ నెక్లెస్‌కు మ్యాచింగ్‌గా ఒక చెవికి పచ్చల స్టడ్, మరో చెవికి వజ్రాల స్టడ్ పెట్టుకుని అవాక్కనిపించింది. 'అదేంటి రెండు రకాల స్టడ్స్ పెట్టుకున్నారు?' అంటూ ఆ స్టైల్ గురించి సోషల్ మీడియాలో అభిమాని అడిగిన ఒక ప్రశ్నకు, 'ఎందుకు పెట్టుకోకూడదు?' అని ఎదురు ప్రశ్నించి ఆలోచనలో పడేలా చేసింది నీతా. నిజానికి ఆమె పెట్టుకున్న నెక్లెస్‌కు, మిస్‌మ్యాచ్ స్టైల్ ఎంతో బాగా సూటయింది.



మెనోపాజ్ మహిళల జీవితంలో సర్వసాధారణమైన దశ. సాధారణంగా నలభైల వయసులో నెలసరి క్రమం తప్పడంతో మొదలై... పూర్తిగా ఆగిపోయేవరకూ కొనసాగే దశను 'పెరిమెనోపాజ్' అంటారు. "పెరిమెనోపాజ్, మెనోపాజ్... ఇవి ప్రతి మహిళ జీవితాన్ని రూపాంతరీకరించే దశలు. భావోద్వేగపరంగానూ, శారీరకంగానూ ఇవి ఎన్నో సవాళ్లు విసురుతూ ఉంటాయి. అత్యంత సహజమైన వీటి గురించి బహిరంగంగా చర్చించడానికి చాలామంది మహిళలు ఇష్టపడరు. యవ్వనాన్ని గొప్పగా, ఆరాధనీయంగా చూస్తూ, పునరుత్పాదక సామర్థ్యాలు, భౌతిక స్వరూపం ద్వారా మహిళలకు గుర్తింపునిచ్చే ధోరణులు దీనికి ప్రధాన కారణం" అంటారు ఢిల్లీకి చెందిన పోషకాహార నిపుణురాలు, 'న్యూట్రిస్టైల్ బై చాహత్' సంస్థ వ్యవస్థాపకురాలు చాహత్ వాసుదేవ్. అయితే ఈ పరిస్థితుల్లో ఇప్పుడు మార్పు కనిపిస్తోంది. తమ మెనోపాజ్ అనుభవాలను పంచుకుంటూ, తోటి మహిళల్లో అవగాహన పెంచడానికి భారతీయ సెలబ్రిటీలు ముందుకు వస్తున్నారు. వారిలో కొందరు ఏం చెబుతున్నారంటే...

దాపరికం వద్దు

మార్పులను ఆమోదించాల్సిందే...

నాలుగు పదుల వయసు దాటాక హార్మోన్లలో సమతుల్యం లోపించడం, శారీరకమైన మార్పులు అనివార్యం. చర్మం ముడతలు పడడం, బరువు పెరగడం, నియంత్రించుకోలేని ఉద్వేగాలు కలగడం... అన్నిటినీ మనం ఆమోదించాల్సిందే. ఇది మాట్లాడకూడని విషయం కాదు. మెనోపాజ్‌వల్ల జీవితం నిస్సారం అవుతుందనే వాదనను నేను అంగీకరించను. అయితే మహిళలు మరింత ఎక్కువ ఇబ్బంది పడే దశగా దీన్ని పరిగణించాలి. దీన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. ఎక్కువసేపు నడవాలి. వ్యాయామం చేయాలి. ఆరోగ్యంగా ఉండాలి. మెనోపాజ్ చుట్టూ ఉన్న మూస ఆలోచనలకూ, మూఢ నమ్మకాలకూ దూరంగా ఉండాలి.



- సుధామూర్తి (73)
రాజ్యసభ సభ్యురాలు

ఇప్పటికీ నిర్లక్ష్యమే...

ఒక్క మెనోపాజ్ గురించే కాదు, మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు గురించి కూడా చర్చ చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. విషాదం ఏమిటంటే, దేశంలో చాలామంది మహిళలకు గర్భధారణకు ముందు, గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవించే సమయంలో, బాలింతగా ఉన్నప్పుడు... ఇలాంటి కీలక సందర్భాల్లో మాత్రమే కాదు... సాధారణ వైద్య, ఆరోగ్య సమస్యలకు కూడా సదుపాయాలు అందుబాటులో లేవు. ఇక మెనోపాజ్ సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహిళలకు ఇది ఎంతో ప్రాధాన్యమైన అంశం. కానీ ఈ విషయంలో ఇప్పటికీ నిర్లక్ష్య ధోరణే. ఇది మహిళల సమస్య. కాబట్టి మనం దీని గురించి తప్పనిసరిగా మాట్లాడాలి. అవగాహన కల్పించాలి.



- లారా దత్తా (46), నటి

సంకోచించకండి...

పెరిమెనోపాజ్ దశలో నేను పెద్ద యుద్ధమే చేశాను. పీరియడ్స్ మధ్య విరామం ఎక్కువగా ఉండేది. ఒక్కోసారి పీరియడ్స్ వచ్చినప్పుడు కూర్చోవడం చాలా కష్టంగా ఉండేది. హిమోగ్లోబిన్ బాగా తగ్గిపోవడంతో ఐదు నెలల పాటు ఇంజక్షన్లు చేయించుకున్నాను. అందరికీ ఇవే సమస్యలు ఉంటాయా? అంటే చెప్పలేం. ప్రతి వ్యక్తికీ భిన్నమైన ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే భయపడనక్కర్లేదు. మన కుటుంబాల్లో, స్నేహితుల్లో ఈ దశను దాటిన మహిళలుంటారు. వారితో మాట్లాడితే పరిష్కారాలు దొరకవచ్చు. అవసరమైతే వైద్యులను సంప్రదించడానికి సంకోచించకూడదు.



- నమితా థాపర్ (47)
ఈడీ, ఎమ్‌క్యూర్ ఫార్మా

ధైర్యంగా ఎదుర్కొందాం..

మెనోపాజ్ సమయంలో మహిళలు ఐడెంటిటీ క్రైసిస్‌కు గురవుతారు. స్త్రీత్వం అంటే పునరుత్పాదక సామర్థ్యం అనేది సామాజికంగా స్థిరపడిన నిర్వచనం కాబట్టి... చాలా దగ్గర వాళ్లతో కూడా మెనోపాజ్ గురించి మాట్లాడ డానికి ఇష్టపడరు. కాలక్రమేణా ఎన్నో మార్పులు వస్తున్నాయి. మహిళలు అనేక బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోంది. సమాజంలో తమదైన స్థానాన్ని వారు సంపాదించడానికి కష్టపడు తున్నారు. కానీ. మీరు పుట్టగానే తల్లి కాదు, భార్య కాదు, కూతురు, సోదరి కూడా కాదు. మీరు మీరే అని గుర్తుంచుకోవాలి. మీకు మీరు ప్రాధాన్యాన్ని ఇచ్చుకోవాలి. మీ శ్రేయస్సు, మీ ఆరోగ్యం... ఇవే ముఖ్యం. మెనోపాజ్ మనం ధైర్యంగా ఎదుర్కోవాల్సిన దశ. ఇందులో దాచిపెట్టుకోవడానికేం లేదు.



- టిస్కా చోప్రా (50)
నటి, రచయిత్రి



అవి పాటిస్తే మంచిది

ఆరోగ్యం పట్ల నాకు శ్రద్ధ ఎక్కువ. వర్కవుట్స్ చేస్తాను, డైట్ కచ్చితంగా ఫాలో అవుతాను. కానీ ఏడాదిన్నర క్రితం బరువు పెరగడం ప్రారంభించాను. ఎందుకనేది నాకు అర్థం కాలేదు. డాక్టర్ దగ్గిరికి వెళ్తే... "పెరిమెనోపాజ్‌లో ఉన్నావు" అని నిర్ధారించారు. ఆ తరువాత దాని గురించి వీడియోలు చూసి, ఆర్టికల్స్ చదివి మరింత తెలుసుకున్నాను. నా స్నేహితురాళ్లతో, సిస్టర్స్‌తో మాట్లాడాను. ఇక వర్కవుట్స్ చెయ్యడం కష్టం కావడం, ఒత్తిడికి గురవడం లాంటి ఇబ్బందులెన్నో ఎదుర్కొన్నా. మహిళలకు చెప్పేదేంటంటే... అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోండి. విటమిన్ స్థాయిలు సరిగ్గా ఉండేలా చూసుకోండి. వ్యాయామాలు చేయండి. ఒత్తిడిని తగ్గించుకోండి.



- షమితా శెట్టి (45)
నటి, ఇంటీరియర్ డిజైనర్

---

150 టన్నుల బంగారం



- గత 3 నెలల్లో అమ్ముడుపోయిన పసిడి ఇది
- వార్షిక ప్రాతిపదికన 5 శాతం తగ్గిన గిరాకీ
- అధిక ధరలే కారణమన్న డబ్ల్యూజీసీ

ముంబై: ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయంగా పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి అమ్ముడైన 158.1 టన్నులతో పోలిస్తే మాత్రం ఈసారి డిమాండ్ 5 శాతం తగ్గింది. అధిక ధరల కారణంగా స్వర్ణాభరణాల విక్రయాలు మందగించడమే ఇందుకు ప్రధాన కారణమని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక వెల్లడించింది. రిపోర్టులోని మరిన్ని ముఖ్యాంశాలు..

- బంగారం విలువపరంగా, గడిచిన మూడు నెలల్లో విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 17 శాతం పెరిగి రూ.93,850 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాదిలో ఇదే సమయానికి నమోదైన పసిడి గిరాకీ రూ.82,530 కోట్లుగా ఉంది.
- ఈ ఏప్రిల్-జూన్ క్వార్టర్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రిటైల్ ధర రూ.74,000 దాటింది. గత మూడు నెలలకు దేశీయంగా మేలిమి బంగారం సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహాయించి) రూ.62,700గా నమోదు కాగా.. 2023లో ఇదే సమయానికి సగటు రేటు రూ.52,191గా ఉంది. గత 3 నెలలకు అమెరికన్ కరెన్సీలో ఔన్స్ (31.10 గ్రాములు) సగటు ధర 2,338.2 డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాదిలో ఇదే కాలానికి రేటు 1,975.9 డాలర్లుగా ఉంది.
- ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆభరణాల గిరాకీ వార్షిక ప్రాతిపదికన 17 శాతం తగ్గి 106.5 టన్నులకు పరిమితమైంది. పసిడిలో పెట్టుబడుల డిమాండ్ మాత్రం 46 శాతం వృద్ధితో 43.1 టన్నులకు పెరిగింది. గోల్డ్ రీసైక్లింగ్ 39 శాతం తగ్గి 23 టన్నులుగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో దేశంలోకి మొత్తం 196.9 టన్నుల బంగారం దిగుమతైంది. 2023లో ఇదే సమయంతో పోలిస్తే దిగుమతులు 8 శాతం పెరిగాయి.
- ఈ ఏప్రిల్-జూన్ కాలానికి ప్రపంచవ్యాప్త పసిడి గిరాకీ వార్షిక ప్రాతిపదికన 4.16 శాతం పెరిగి 1,258.2 టన్నులకు చేరుకుంది. ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) లావాదేవీల్లో ఆరోగ్యకరమైన వృద్ధి ఇందుకు దోహదపడింది.

ఈ ఏడాది గిరాకీ 700-750 టన్నులు

ఈసారి బడ్జెట్లో పసిడిపై సుంకాన్ని 6 శాతానికి తగ్గించిన నేపథ్యంలో జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో ఆభరణాల విక్రయాలు మళ్లీ పుంజుకోవచ్చని భావిస్తున్నాం. సెప్టెంబరు నుంచి పండగల సీజన్ ప్రారంభం కానుండటం, ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవడమూ బంగారం అమ్మకాల వృద్ధికి దోహదపడగలవని ఆశిస్తున్నాం. బలమైన జీడీపీ వృద్ధి, గ్రామీణ మార్కెట్ పునరుద్ధరణ వంటి అంశాలు ఈ ఏడాది ద్వితీయార్ధంలో పసిడి డిమాండ్‌కు మద్దతివ్వగలవు. ఈ ఏడాది మొత్తానికి దేశీయంగా పసిడి గిరాకీ 700-750 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అంచనా వేస్తున్నాం.

- సచిన్ జైన్, డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ, ఇండియా

బిజినెస్

బీఈ ఓరల్ పోలియో వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్ఓ ఓకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తాము తయారు చేసిన నోవెల్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ టైప్ 2కు (ఎన్ఓపీవీ2) ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రీ క్వాలిఫికేషన్ హోదా ఇచ్చిందని బయోలాజికల్-ఈ (బీఈ) లిమిటెడ్ ప్రకటించింది. బీఈ నుంచి ప్రీ క్వాలిఫైడ్ హోదా పొందిన 10వ వ్యాక్సిన్ ఇది. వ్యాక్సిన్ల ద్వారా సంక్రమించే పెరాలిటిక్ పోలియో (వీఏపీపీ) రిస్క్‌ను తగ్గించడం లక్ష్యంగా ఎన్ఓపీవీ2ని తయారుచేశారు. ఇది వ్యాక్సిన్ ద్వారా సంక్రమించే పోలియో వైరస్ 2 (సీవీడీపీవీ2) వ్యాప్తిని అరికడుతుందని బీఈ తెలిపింది. గతంలో తయారుచేసిన సాబిన్ పోలియో వైరస్ టైప్2 (ఎంఓపీవీ2) వ్యాక్సిన్‌తో పోల్చితే ఇందులో జన్యుపరమైన స్థిరత్వం కల్పించిన కారణంగా తక్కువ రోగనిరోధక శక్తి గల ప్రాంతాల్లో సీవీడీపీవీ2 వ్యాప్తిని అరికడుతుందని పేర్కొంది.

గ్రాన్యూల్స్ లాభంలో మూడింతల వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రాన్యూల్స్ ఇండియా.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో రూ.135 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.48 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా మూడింతలు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.985 కోట్ల నుంచి రూ.1,180 కోట్లకు పెరిగింది. గత ఏడాది కొన్ని ఆటంకాలు ఎదురయ్యాయని, ఈ ఏడాది వాటిని అధిగమించటంతో మెరుగైన ఫలితాలను నమోదు చేసినట్లు గ్రాన్యూల్స్ సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

డెరివేటివ్స్ ట్రేడింగ్‌తో ఏటా 60,000 కోట్ల నష్టాలు

సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ-డెరివేటివ్స్) ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక స్పెక్యులేషన్‌తో కూడిన ఈ ట్రేడింగ్‌తో వ్యక్తిగత మదుపరులు ఏటా ఎంత లేదన్నా రూ.50,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్ల వరకు నష్టపోతున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. ఇంత భారీ నష్టాలు కలిగిస్తున్న డెరివేటివ్స్ ట్రేడింగ్‌ను గతంలోలా పెద్ద సమస్యగా చూడకపోవడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇవే నిధులను మదుపరులు మంచి పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ), మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో మదుపు చేస్తే, మంచి లాభాలు ఆర్జిస్తారని బుచ్ అన్నారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్).. డెరివేటివ్స్‌కు ప్రత్యామ్నాయం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈటీఎఫ్‌ల్లో లిక్విడిటీ, లెవరేజింగ్ పెద్ద సమస్యలన్నారు.

ఇండెక్స్ డెరివేటివ్స్ కట్టడి

మరోవైపు ఇండెక్స్ డెరివేటివ్స్ కట్టడి కోసం సెబీ కొన్ని చర్యలు ప్రతిపాదించింది. ఇందుకోసం లాట్ల కనీస కాంట్రాక్టు పరిమాణం పెంచడం, ఆప్షన్ ప్రీమియంను ముందే వసూలు చేయాలని సూచించింది. ఈ చర్యలతో ఇండెక్స్ డెరివేటివ్స్ స్పెక్యులేషన్‌ను చాలా వరకు కట్టడి చేయవచ్చని తెలిపింది. ఇందుకు సంబంధించి సెబీ ఒక కన్సల్టేషన్ పేపర్‌ను విడుదల చేసింది. ఇందులో వీక్లీ ఇండెక్స్ ఉత్పత్తుల క్రమబద్ధీకరణ, ఇంట్రాడే పొజిషన్ లిమిట్స్ పర్యవేక్షణ, స్ట్రైక్ ప్రైసెస్ క్రమబద్ధీకరణ, సమీప కాంట్రాక్ట్ ఎక్స్‌పైరీ మార్జిన్ పెంపు వంటి అంశాలపై పలు ప్రతిపాదనలు చేసింది. వీటిపై ఆగస్టు 20 వరకు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా ప్రజలను సెబీ కోరింది. మరోవైపు అక్టోబరు 1 నుంచి ఎఫ్ అండ్ ఓ లావాదేవీలపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) ప్రభుత్వం పెంచుతున్న సంగతి తెలిసిందే. దీనికి తోడు సెబీ తాజాగా ఈ చర్యలను ప్రతిపాదించడం విశేషం. డెరివేటివ్స్ ట్రేడింగ్ చేసే ప్రతి 10 మంది రిటైల్ మదుపరుల్లో తొమ్మిది మంది నష్టపోతున్నట్టు సెబీ ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఈ ట్రేడింగ్‌ను వీలైనంత మేర కట్టడి చేయాలని సెబీ భావిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ఉండే ఆటుపోట్లు, నష్టభయాలపై మదుపరులకు అవగాహన కల్పించేందుకు సెబీ గత ఐదేళ్లలో రూ.62 కోట్లు ఖర్చు చేసింది.

క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ద్వారా రూ.98,681 కోట్లు

లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) కేంద్ర ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలోనే సమకూర్చి పెడుతోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ పన్ను ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.98,681 కోట్లు సమకూరాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15 శాతం ఎక్కువ.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	68,950 ▼	63,200 ▼	89,000 ▼
ముంబై	68,680 ▼	62,911 ▼	81,350 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	513	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	103
కరీంనగర్	94	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	100
కర్నూలు	94	నెల్లూరు	100
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

జాగిల్ లాభం రూ.17 కోట్లు

సాస్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్.. జూన్ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.252.20 కోట్ల ఆదాయంపై రూ.16.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ లాభం 2.05 కోట్లుగా ఉంది.

బెస్ట్‌వాంటేజ్‌తో బార్‌ట్రానిక్స్ జట్టు

ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సంస్థ బెస్ట్‌వాంటేజ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు బార్‌ట్రానిక్స్ ఇండియా వెల్లడించింది. ఒప్పందంలో భాగంగా ఫిన్‌టెక్, బీమా రంగాల్లో వ్యూహాత్మకంగా సేవలను విస్తరించటంతో పాటు అవసరమైన కొనుగోళ్లు చేపట్టే అవకాశాలపై దృష్టి సారించే వీలు కలుగుతుందని బార్‌ట్రానిక్స్ తెలిపింది. అంతేకాకుండా ఈ ఒప్పందంతో కంపెనీ టర్నోవర్ రూ.66 కోట్లకు చేరే వీలుందని పేర్కొంది.

ఫిలాటెక్స్‌కు రూ.293 కోట్ల ఆర్డర్

ఆఫ్రికాలోని బ్లూమ్‌ఫ్లోరా వెంచర్స్ నుంచి రూ.293 కోట్ల ఎగుమతి ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఫిలాటెక్స్ ఫ్యాషన్స్ లిమిటెడ్..ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా ఆఫ్రికాలో బ్లూమ్‌ఫోరా ఏర్పాటు చేస్తున్న 54 హాస్పిటల్స్‌కు 2,97,388 మెట్రిక్ టన్నుల వైట్ మార్బుల్‌ను సరఫరా చేయాల్సి ఉంటుంది.

ఎస్‌బీఐ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్.. ఎస్‌బీఐ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత విభాగాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఆగస్టు 12.

- స్పెషాలిటీ కెమికల్స్ తయారీ సంస్థ లూబ్రిజోల్.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో రూ.1,670కోట్ల (20 కోట్ల డాలర్లు)తో ప్లాంట్ ఏర్పా టు చేస్తోంది. 120 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌కు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

రూ.460 లక్షల కోట్లు

- ఆల్‌టైం రికార్డు స్థాయికి మార్కెట్ సంపద

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ అద్యంతం తీవ్ర ఒడుదుడుకులకు లోనైనప్పటికీ, చివరికి 99.56 పాయింట్ల లాభంతో 81,455.40 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఒక దశలో సూచీ 459.43 పాయింట్ల వృద్ధితో 81,815.27 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఇంట్రాడేలో 136 పాయింట్ల వరకు పెరిగినప్పటికీ, చివరికి 21.20 పాయింట్ల లాభంతో 24,857.30 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.460.91 లక్షల కోట్ల (5.50 లక్షల కోట్ల డాలర్లు)కు చేరుకుంది.

ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓకు సెబీ ఓకే: హైదరాబాద్‌కు చెందిన సోలార్ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది.

సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓ పత్రాలు వెనక్కి: హైదరాబాద్ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ ఐపీఓకు వచ్చేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సెబీ తిప్పిపంపింది. సెబీ ఐసీడీఆర్ నిబంధనలు, 2018లోని 7(1) నిబంధనను పాటించని కారణంగా కంపెనీ డీఆర్‌హెచ్‌పీని వెనక్కి పంపినట్లు స్పష్టం చేసింది.

ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పని పట్టండి

- బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల కట్టడి కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరో చర్య తీసుకుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ తీసుకున్న రుణాన్ని మొండి బకాయి (ఎన్‌పీఏ)గా ప్రకటించిన ఆరు నెలల లోపు.. అది ఉద్దేశపూర్వక ఎగవేతా? లేక నిజంగానే చెల్లించలేక ఎగవేశారా? అనే విషయాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తేల్చాలని కోరింది. రూ.25 లక్షలు లేదా అంతకు మించిన అన్ని ఎన్‌పీఏలకు ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఒక మాస్టర్ డైరెక్షన్ విడుదల చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నిర్వచనానికి సంబంధించి ఎలాంటి విచక్షణ లేకుండా నిర్దిష్ట విధానం రూపొందించుకోవాలని కూడా ఆర్‌బీఐ కోరింది.

ఫొటోల ప్రచురణ: ఇక ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పేర్లు అందరికీ తెలిసేలా వారి ఫొటోల ప్రచురణ కోసం కూడా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు నిర్దిష్ట విధానం అనుసరించాలని ఆర్‌బీఐ కోరింది. ఈ విధానం కూడా ఆయా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బోర్డుల ఆమోదం పొంది ఉండాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి లేదా సంస్థను ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ప్రకటించాక వారి పేర్లను ఆ జాబితా నుంచి తొలగించే వరకు.. వారికి ఏ బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ అదనపు రుణాలు ఇవ్వకుండా కట్టడి చేయాలని కోరింది. మూడు నెలల్లో ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

పంచాయతీ స్థాయిలో రోజువారీ

వాతావరణ సూచనలు!

దేశవ్యాప్తంగా 2.69 లక్షల స్థానిక సంస్థలకు 'వాతావరణ' బాధ్యతలు 12

రైతులకు మరింత మేలు: కేంద్రం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 31-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 123

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 3.56 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రోహిణి ఉ. 10.13 తదుపరి మృగశిర వర్జ్యం: మ. 3.51-5.28; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.46; అమృతఘడియలు: ఉ. 7.02-8.35, రా. 1.31-3.08; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.44

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కాంస్యం గెలుచుకున్న అనంతరం మనుతో కలిసి స్వర్ణ, రజత పతక విజేతలతో సెల్ఫీ తీసుకుంటున్న సరబ్‌జోత్‌సింగ్

అద్వితీయ మను

యువ షూటర్ మను బాకర్ ఖాతాలో రెండో పతకం

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సరబ్‌జోత్‌తో కలిసి కాంస్యం

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన భారత తొలి అథ్లెట్‌గా ఘనత

యువ షూటర్ మను మళ్లీ అద్భుతం చేసింది. రెండోసారి ఆమె 'గురి' అదిరింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు రెండో పతకాన్ని తానే అందించింది. ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలుచుకున్న మను, అదే ఈవెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ సత్తాచాటింది. సహచర షూటర్ సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్యం సాధించింది. స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా మను రికార్డు సృష్టించింది. 1900వ సంవత్సరంలో పారిస్ వేదికగానే జరిగిన విశ్వక్రీడల్లో ఆంగ్లో ఇండియన్ నార్మన్ ప్రిచార్డ్ 200 మీటర్ల స్ప్రింట్, 200 మీటర్ల హర్డిల్స్‌లో రెండు రజత పతకాలు గెలిచాడు. ఇప్పటికే రెండు పతకాలతో ఊపు మీదున్న మను.. మూడో ఈవెంట్‌ను ఆగస్టు 2న ఆడనుంది. పారిస్‌లో నాలుగోరోజు పోటీల్లో మను-సరబ్‌జోత్ కాంస్య పతకంతో చరిత్ర సృష్టిస్తే.. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఫేవరెట్ జోడీ సాత్విక్-చిరాగ్ మరో విజయంతో తమ గ్రూపులో టాపర్‌గా నిలిచింది. మన హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని అందుకోగా.. టేబుల్ టెన్నిస్‌లో మనికా బాత్రా ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించి పతకానికి చేరువైంది.

7



త్రివర్ణ పతాకంతో సరబ్‌జోత్ సింగ్, మను బాకర్







సహాయక చర్యల్లో సిబ్బంది

మృత్యు విలయం

విరిగిపడిన కొండచరియలు.. వరద బీభత్సం.. వయనాడ్‌లో 133 మంది దుర్మరణం

65 కుటుంబాలు భూస్థాపితం!

వందలాది మందికి గాయాలు.. శిథిలాల కింద ఇంకా 250 మంది!

చలియార్ నదిలో కొట్టుకొచ్చిన మృతదేహాలు

శవాల దిబ్బగా చురల్‌మల?

టీ-ఎస్టేట్‌లో 600 మంది అసోం, పశ్చిమ బెంగాల్ కార్మికుల గల్లంతు

ఓ రిసార్ట్‌లో చిక్కుకున్న 100 మంది

మదర్సా, మసీదుల్లో వైద్య శిబిరాలు

సహాయక చర్యల్లో త్రివిధ దళాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్

ఇంతటి విషాదాన్ని ఎన్నడూ చూడలేదు: కేరళ సీఎం పినరయి

ప్రధాని మోదీ, రాహుల్ దిగ్భ్రాంతి

వయనాడ్, జూలై 30: 'గాడ్స్ ఓన్ కంట్రీ' కేరళ.. ప్రకృతి ప్రకోపానికి గురైంది.! పశ్చిమ కనుమల నడుమ.. తేనీటి తోటలు, ఏపుగా పెరిగే రబ్బరు చెట్లు, చూపరులను ఆకట్టుకునే కొబ్బరి చెట్లతో ఆహ్లాదంగా ఉండే వయనాడ్‌పై విపత్తు విరుచుకుపడింది.! తెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలు.. బురదతో కూడిన వరద.. విరిగిపడ్డ కొండ చరియలు.. వెరసి సోమవారం అర్ధరాత్రి వయనాడ్‌కు కాళరాత్రిగా మారింది. పదుల సంఖ్యలో ఇళ్లు కొండ చరియల ధాటికి నేలమట్టమయ్యాయి. నిద్రలోనే 133 మంది పౌరుల ప్రాణాలు తిరిగి రాని అనంతలోకాలకు చేరుకున్నాయి. మరో 128 మంది క్షతగాత్రులయ్యారు. కొండ చరియల బీభత్సం ఒకవైపు.. వరదతో ఉప్పొంగిన నదులు మరోవైపు.. వరద ఉధృతికి శరీర భాగాలు తెగిపడి కిలోమీటర్ల దూరానికి కొట్టుకుపోతున్న మృతదేహాలు ఇంకోవైపు..! మృత్యుదేవత కరాళ నృత్యం చేస్తోందా? అన్నట్లు ఎక్కడ చూసినా మృతదేహాలు.. హాహాకారాలు.. ఆస్పత్రుల్లో బంధుమిత్రుల ఆర్తనాదాలు..! ఈ విపత్తులో వందల మంది గల్లంతయ్యారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదముందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. సహాయక చర్యల కోసం త్రివిధ దళాలు రంగంలోకి దిగాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, పారామిలటరీ, స్వచ్ఛంద సేవకులు రంగంలోకి దిగారు. ఈ విపత్తుపై రాజకీయ పార్టీలకు అతీతంగా యావత్ భారతం స్పందించింది. ప్రధాని నరేంద్ర మోదీ కేరళ సీఎం పినరయి విజయన్‌కు ఫోన్ చేసి, ధైర్యం చెప్పారు. కేరళ సర్కారు రెండ్రోజులపాటు సంతాపదినాలను ప్రకటించింది. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు

మిగతా 10వ పేజీలో...

కాపాడండి ప్లీజ్

శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్

బ్లడ్ బ్యాంకుల వద్ద బారులు తీరిన దాతలు

10

కేరళ పాలిట చీకటి మాసాలు

జూలై, ఆగస్టు నెలల్లో అతి పెద్ద విపత్తులు

అరేబియా సముద్రం వేడెక్కడం, భూతాపం, పర్యావరణ మార్పులే కారణం



హెలికాప్టర్ ద్వారా బాధితుడి తరలింపు..



వరదలో కొట్టుకొచ్చిన జీపు

ఎన్నికలు లేకున్నా..

రుణమాఫీ!

ఒకేసారి 31 వేల కోట్లు.. దేశంలోనే రికార్డు

రైతులకు అండగా ఉన్నామని చెప్పేందుకే.. వారి ప్రయోజనాలకే ప్రాధాన్యం

12 రోజుల్లో రూ.12500 కోట్ల మాఫీ.. ఆగస్టులో పూర్తి రుణవిముక్తుల్ని చేస్తాం

సోనియా, రాహుల్ మాటను నిలబెడుతున్నాం.. ఇది మా నిబద్ధత: రేవంత్

రెండో విడత రుణమాఫీని ప్రారంభించిన ముఖ్యమంత్రి



అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు సాధారణంగా ప్రజలను ఓట్లు అడిగేటప్పుడు రైతు రుణమాఫీ వంటి వాటిపై నిర్ణయాలు తీసుకుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయ ప్రయోజనం లేకుండా.. కేవలం రైతు ప్రయోజనం కోసం ఇలాంటి నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోలేదని తెలిపారు. కానీ, తమ ప్రభుత్వం మాత్రం ప్రస్తుతం ఏ ఎన్నికలూ లేకపోయినా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రైతుకు ప్రభుత్వం అండగా ఉందన్న విశ్వాసం కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రైతు ప్రయోజనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. మంగళవారం శాసన సభ విరామ సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండో విడత రైతు రుణమాఫీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్

మిగతా 11వ పేజీలో...

మూడో విడత రుణమాఫీ.. రెండు దఫాల్లో!

రూ.2 లక్షల వరకు బకాయిలు ఒకేసారి మాఫీ

అంతకుమించి అప్పున్న వారికి మరో దఫాలో..

రూ.15 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా

11

రేపు స్కిల్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన

11


విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్‌గా

జస్టిస్ మదన్ బీ లోకూర్

నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నివేదిక ఇవ్వడానికి మూడు నెలల గడువు

11



పట్టాలు తప్పిన

హౌరా-ముంబై రైలు

ఇద్దరి మృతి..

22 మందికి గాయాలు

ఝార్ఖండ్‌లో ఘటన

12

కదులుతున్న ప్రైవేటు బస్సులో

మహిళపై అత్యాచారం!

నిందితుడు ఆ బస్సు అదనపు డ్రైవరే

నిర్మల్ నుంచి 35 మంది ప్రయాణికులతో ప్రకాశం జిల్లాకు.. అర్ధరాత్రి అఘాయిత్యం

బస్సును ఛేజ్ చేసి హైదరాబాద్‌లోని తార్నాకలో పట్టుకున్న పోలీసులు

ఇద్దరు డ్రైవర్ల అరెస్టు.. బస్సు సీజ్

12

హైదరాబాద్‌లో గ్యాంగ్ రేప్!

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై స్నేహితుడి అఘాయిత్యం

మద్యం తాగించి అపస్మారక స్థితిలో ఉండగా..

ఆపై అతని స్నేహితుడిని పిలిపించి కిరాతకం

ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు

12



ఎమ్మెల్యే యూటర్న్

తిరిగి బీఆర్‌ఎస్‌లోకి గద్వాల శాసనసభ్యుడు కృష్ణమోహన్‌రెడ్డి

కేటీఆర్‌ను కలిసి 'ఘర్ వాపసీ' ప్రకటన

అదే దారిలో మరికొందరు ఎమ్మెల్యేలు?

ప్రచారాన్ని ఖండించిన తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య

11

గ్రామీణ వైద్యులకు

బంపర్ ఆఫర్

బేసిక్‌పై 70% మేర పెంపునకు సర్కారు యోచన

పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏహెచ్ ఆస్పత్రుల పెంపు


నిర్ణీత దూరాల్లో ఆస్పత్రులు ఉండేలా చర్యలు

4 చోట్ల కొత్తగా మొబైల్ కేన్సర్ పరీక్షా కేంద్రాలు

విప్లవాత్మక సంస్కరణలు: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మకమైన సంస్కరణలకు రేవంత్ సర్కారు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల వేతనాలు భారీగా పెంచాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. మూల వేతనంపై 70 శాతం మేరకు జీతాలు పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం

మిగతా 12వ పేజీలో...



పది గేట్ల ద్వారా శ్రీశైలం నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీశైలంలో తెరుచుకున్న 10 గేట్లు

నాగార్జునసాగర్ దిశగా 2.79 లక్షల క్యూసెక్కులు

ఆగస్టు 2న ఖరీఫ్ కోసం ఎడమ కాల్వకు నీరు విడుదల చేయనున్న మంత్రి ఉత్తమ్

9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇది సరికాదు...!

గతకాలపు ప్రణాళికాసంఘం మీద కూడా అప్పట్లో రాజకీయ విమర్శలు రాకపోలేదు కానీ, దానిని చరిత్రలో కలిపేసి నీతి ఆయోగ్ తెచ్చిన తరువాత దీని చుట్టూ సాగుతున్న రాజకీయం మరీ భరించలేనంతగా ఉంది. శనివారం నాటి నీతి ఆయోగ్ సమావేశానికి పదిరాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతంనుంచి ప్రాతినిధ్యం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. రాష్ట్రాల అభివృద్ధి, కేటాయింపులు, కోటాలూ వాటాలూ ఇత్యాది కీలకమైన అంశాలను నిర్ణయించే ఓ ముఖ్యమైన సమావేశానికి విపక్షపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలా గైర్హాజరు కావడానికి వారు చెబుతున్న ప్రధాన కారణం ఇటీవలి బడ్జెట్ కేటాయింపుల్లో తమకు ఉద్దేశపూర్వకంగా తీరని అన్యాయం చేశారని. మిగతావారిలాగా కాక మమతాబెనర్జీ ఈ సమావేశానికి హాజరైనారు కానీ, ఆ తరువాత బాయ్ కాట్ చేశారు. తనను ఐదునిముషాలు మాత్రమే మాట్లాడనిచ్చారని, బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని చెప్పబోతుండగా మైక్ కట్‌చేశారని ఆమె ఆరోపించారు. నీతి ఆయోగ్ సమావేశాలను విపక్షాలు రాజకీయం చేస్తున్నాయన్న బీజేపీ విమర్శ పూర్తిగా కొట్టిపారేయలేనిది. మమత మాదిరిగానే ఆ సమావేశానికి హాజరై కూడా వారు తమ ఆగ్రహాన్నో, అసమ్మతినో వ్యక్తపరిస్తే సరిపోయేది. అది జరగకపోగా, విపక్షపార్టీకి చెందిన ఒకే ఒక్క నాయకురాలు సమావేశానికి హాజరై తాను మాట్లాడుతూంటే మైక్ కట్‌చేశారని ఆరోపించడం ఆశ్చర్యకరమైన విషయం. లోపల ఏమి జరిగిందో తెలియదుకానీ, ఆమె చేసిన పలు ఆరోపణలను ఖండిస్తూ ఓ పూర్తిభిన్నమైన వివరణ ఒకటి ఆ తరువాత ప్రభుత్వం నుంచి వెలువడింది. నీతి ఆయోగ్ ను రద్దుచేసి, ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని మమత ఎందుకు డిమాండ్ చేశారన్నది అటుంచితే, ఈ రాజకీయ వైరంలో ఈ సంస్థ ప్రతిష్ఠ క్రమంగా దిగజారిపోతున్నమాట నిజం.

పశ్చిమబెంగాల్ ఉత్తరప్రాంతాలను ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ పరిధిలోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, కేంద్రమంత్రి సుకాంత ముజుందార్ ఇటీవల చేసిన ప్రతిపాదన తృణమూల్‌కు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ప్రతీకారంగా మమత ఈ సమావేశానికి హాజరై ఏకంగా నీతి ఆయోగ్ రద్దునే డిమాండ్ చేశారని అంటారు. బెంగాల్ ఉత్తరాది ప్రాంతాలకు ఈశాన్యంతో చాలా సామీప్యం ఉంటుందని, అవి అభివృద్ధి చెందాలంటే కేంద్రప్రభుత్వ అధీనంలోని తన మంత్రిత్వశాఖలోకి రావాలని ఆ బీజేపీ నాయకుడు ప్రధానికి స్వయంగా ప్రతిపాదించడం సహజంగానే వివాదాన్ని రేపింది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సగానికి సగం సీట్లను గెల్చుకున్నది ఉత్తర బెంగాల్ నుంచే. దానిని రాష్ట్రంగానో, కేంద్రపాలిత ప్రాంతంగానో చేయాలని బీజేపీ నాయకులు అప్పుడప్పుడు డిమాండ్ చేస్తూ, తమకు అనాదిగా అన్ని విధాలా అన్యాయం జరుగుతున్నదన్న ఆ ప్రాంతవాసుల భావనను సజీవంగా ఉంచుతూ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తుంటారు. మమతను గద్దెదించడం అసాధ్యమని తేలిపోవడంతో రాష్ట్రాన్ని నిలువునా చీల్చే దిశగా బీజేపీ కుట్రపన్నుతోందని టీఎంసీ దీనితో భగ్గుమన్నది. రాష్ట్రాన్ని చీల్చే ఆలోచన మాకు లేదు కానీ, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఉత్తరబెంగాల్‌కు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నమాట వాస్తవమని సువేందు అధికారి ఓ వివరణ ఇచ్చారు. పశ్చిమబెంగాల్‌కు కేంద్ర బడ్జెట్లో ఎంత అన్యాయం జరిగిందో చెప్పి, మీ రాజకీయం కోసం మా రాష్ట్రాన్ని చీల్చుతారా అని హెచ్చరించేందుకు నీతి ఆయోగ్ సమావేశాన్ని మమత ఉపయోగించుకున్నారు.

గతకాలపు ప్రణాళికా సంఘంలో లోపాలు లేవని ఎవరూ అనడం లేదు. కానీ, రాష్ట్రాలతో సంప్రదింపులు, వివిధరకాల కేటాయింపుల విషయంలో దాని నిర్ణయాలకు, సూచనలకు ఎంతోకొంత విలువ ఉండేది. ఇప్పుడు పెత్తనమంతా ఆర్థికశాఖదే కనుక, నీతి ఆయోగ్ ఓ సలహాసంఘంగా మిగిలిపోయింది. సహకార సమాఖ్య విధానానికి దారులు పరుస్తుందని తెచ్చిన వ్యవస్థ కేంద్ర సర్కారు చేతులో కీలుబొమ్మని విమర్శలు ఎదుర్కొంటోంది. నీతి ఆయోగ్‌ను రద్దుచేసి, ప్రణాళికాసంఘాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్ ఎలాగూ ఇప్పట్లో నెరవేరేది కాదు కానీ, దాని పనిపద్ధతులను మెరుగుపరచి, రాష్ట్రాలతో విస్తృతమైన సంప్రదింపులతో, వాటి అధికభాగస్వామ్యంతో దానిని తీర్చిదిద్దడం ముఖ్యం. బీజేపీ, విపక్షాలు తమ రాజకీయ యుద్ధాన్ని ఇక్కడివరకూ తేవడం సముచితం కాదు. రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించకుండా రాజకీయ ప్రయోజనాలకు వేదికగా ఉపయోగించుకోవడం ప్రజలు హర్షించరు.

బహుజన దిక్సూచి సత్తయ్య

"నేను తీసుకెళ్తున్న చైతన్య రథాన్ని వీలైతే మీరూ ముందుకు తీసుకెళ్లండి. లేకుంటే అక్కడే వదిలేయండి. కానీ వెనక్కి మాత్రం లాగొద్దు" ఇది బాబా సాహేబ్ అంబేద్కర్ చెప్పిన మాట. రాజకీయంగా, సామాజిక ఉద్యమాల పరంగా అంబేద్కర్ ఇచ్చిన చైతన్యాన్ని అందిపుచ్చుకుని కొందరు కొన్ని ప్రయోగాలు చేశారు. కానీ తాము ఏమీ ఆశించకుండా కేవలం అబేద్కర్, పూలే ఆలోచననే యావత్ దేశానికి విస్తరింపచేస్తున్నవారు అక్కడక్కడా కొందరున్నారు. అందులో అగ్రశ్రేణికి చెందినవారు కొల్లూరి సత్తయ్య. ఆయనేదో పెద్ద పెద్ద చదువుల అధ్యాపకులు కాదు. పేరు మోసిన రాజకీయ నాయకుడు అంతకన్నా కాదు. బిహెచ్‌ఈఎల్‌లో శానిటేషన్ వర్కర్. జూలై 24వ తేదీన ఉద్యోగ విమరణ చేసిన సత్తయ్య గురించి వివిధ రాష్ట్రాల్లోని చాలామందికి తెలుసు.

సత్తయ్యది సంగారెడ్డి జిల్లా, తెల్లాపూర్ గ్రామం. అంటరాని కులంలో పుట్టారు. చిన్నతనంలో బర్లు కాసే పనికి కుదురుకున్నారు. అప్పట్లో నెలకు పది రూపాయల జీతం ఇచ్చేవారు. వాళ్ల అమ్మ మంత్రసానిగా ఉండేది. ఊళ్లో పురుళ్లు అయితే చాటలో అన్నం తెచ్చేవారు. దానితోనే కడుపు నిండేది. తల్లి వృత్తే ఇంటిల్లిపాదికి జీవనాధారం. ఇట్లాంటి ఆర్థిక, సామాజిక స్థితితో ఆయన చదువు సాగలేదు. పైగా కులపీడన ఇంకో వైపు. ఆ తర్వాత బిహెచ్‌ఈఎల్‌లో శానిటేషన్ వర్కరుగా పనిలో కుదురుకున్నారు. పోరాటాలు చేసిన తర్వాత పర్మినెంట్ అయ్యారు. క్రమంగా కార్మిక సంఘ నాయకునిగా ఎదిగారు. అప్పటికే గద్దర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్యతో పరిచయం ఏర్పడింది. సమాజానికి ఏదో మంచి చేయాలనే తలంపు ఆయనలో బలపడింది. సంపాదనలో కొంత భాగాన్ని సమాజహితానికి ఖర్చు చేయాలని భావించారు. తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన రెండున్నర ఎకరాల భూమిలో అనాథాశ్రమం ఏర్పాటు చేశారు. కరోనా కలంలో అది మూతపడింది. ఆ తర్వాత అక్కడో విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. అదే 'పూలే, అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలసాఫికల్ అండ్ ఇంగ్లీషు ట్రైనింగ్ సంస్థ'. ఇందులో పనిసంస్కృతి దాని ప్రత్యేకత. ఇక్కడ భారత రాజ్యాంగం వంటి అంశాలతో పాటు ఇంగ్లీషును కూడా బోధిస్తారు. అమ్మాయిలు, అబ్బాయిలు ఉండేందుకు విడివిడిగా వసతి సౌకర్యాలున్నాయి. వారికి నాణ్యమైన భోజనం అందిస్తారు. వారంలో రెండుసార్లు మటన్, చికెన్ ఇస్తారు. మిల్లెట్ భోజనం ఉంటుంది. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు యాక్టివిటీ ఉంటుంది. కుల, మత ప్రసక్తి లేకుండా ఇక్కడ విద్యార్థులు చదువు చేర్చుకుంటారు. ఇక్కడికి మన దేశంలోనే పేరు పొందిన విశ్వ విద్యాలయాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. నెల రోజుల శిక్షణలో అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. ఈ వ్యవస్థ అంతా ఉచితంగానే నడుస్తుంది. ఈ తరం వారు సాటి మనుష్యులను గౌరవించే సంస్కృతిని నేర్చుకోవాలనే తలంపుతోనే తానీ పనికి పూనుకున్నట్లు చెప్తారు సత్తయ్య. "సమాజం మనకు చాలా ఇచ్చింది. మనం కూడా తిరిగి ఇవ్వాలి" అన్నదే తన సిద్ధాంతం అని అంటారు. అంబేద్కర్, పూలే మార్గదర్శనంలో జీవిస్తానని చెప్తారు.



'పూలే, అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలసాఫికల్ అండ్ ఇంగ్లీషు ట్రైనింగ్ సంస్థ'లో ఇప్పటివరకు సుమారు ఆరు వందలమందికి పైగా విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ సంస్థ సత్తయ్య చేతిలో ఊపిరి పోసుకుని రెండేళ్లు అవుతున్నది.

సత్తయ్య స్థాపించి నిర్వహిస్తున్న ఈ సంస్థ ముఖ ద్వారం సాంచి స్థూపంతో అలంకరించి ఉంటుంది. బుద్ధుని, అశోకుని ఆలోచనలకు ఇక్కడ ఆయువు పోస్తున్నారని సులభంగా అర్థం అవుతుంది. తాము మరిచిపోయిన తమ కల్చర్‌కు పునరుజ్జీవం పోస్తున్నామని అక్కడ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ సుదర్శన్ అంటున్నారు. జై భీం చెప్పడంతో వారి దినచర్య ప్రారంభం అవుతుంది. కొత్తవారు వచ్చినా జై భీం అని మొదట చెప్పిన తర్వాతనే తమను పరిచయం చేసుకుంటారు. ఇట్లా అంబేద్కర్, పూలే దంపతుల ఆలోచనలకు ఆచరణాత్మక నిర్మాణం జరుగుతున్నదిక్కడ. సివిల్స్ ప్రిపేర్ అయ్యేవారికి ఇది బెస్ట్ ప్లేస్. మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తరాఖండ్, యూపీ, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, అరుణాచల్‌ప్రదేశ్, ముంబయి తదితర 25కు పైగా రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ ఇప్పటికే శిక్షణ పొందారు. వీరంతా సరికొత్త ఆలోచలను, సర్వమానవ సమానత్వ భావనను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దీని గురించి తెలుసుకున్న తర్వాత ఇక్కడికి రావాలని, శిక్షణ పొందాలని వేలమంది విద్యార్థులు కోరుకుంటున్నారు. ఇప్పటివరకు సుమారు ఆరు వందలమందికి పైగా విద్యార్థులిక్కడ శిక్షణ పొందారు. ఈ సంస్థ సత్తయ్య చేతిలో ఊపిరి పోసుకుని రెండేళ్లు అవుతున్నది.

ఆయన చేస్తున్న సామాజిక చైతన్య కార్యాచరణలో 'బువ్వబండి' మరొకటి. దేశంలోని వివిధ రాష్ట్రాల కార్మికులు తెల్లాపూర్ ప్రాంతంలో పని చేయటానికి వస్తున్నారు. కరోనా కాలంలో నిర్మాణం కోసం వారిని తీసుకొచ్చినవారు ఈ కూలి జీవులను పట్టించుకోకుండా వదిలేశారు. కార్మికుల గోస చూడలేక వారి కోసం బువ్వ బండిని ఏర్పాటు చేశారు సత్తయ్య. ఇక్కడ కూలీలకు మిల్లెట్‌తో కూడిన భోజనం అందిస్తారు. తెల్లాపూర్ చౌరస్తాలో ప్రతీ రోజూ ఉదయం ఎనిమిది గంటలకు బువ్వ బండి వస్తుంది. సుమారు ఐదు వందల మంది అక్కడ భోజనం చేస్తారు. కార్మికులు బలంగా ఉండాలన్న ఉద్దేశంతో తానీ ఏర్పాటు చేశానని అంటారు సత్తయ్య. విద్యాసంస్థ కోసం, బువ్వ బండి కోసం ఆయన నెలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తన సతీమణి అమృతమ్మ, కుమారుడు భరత్ తన ఆలోచనకు సంపూర్ణంగా సహకరిస్తున్నారని చెప్తారు సత్తయ్య. చేస్తున్న ఉద్యోగం పెద్దదా, చిన్నదా అనేది కాదు, కార్యదీక్ష ముఖ్యం అని నిరూపించిన సత్తయ్య సార్ మరింతగా బలంగా సామాజిక చైతన్య కార్యక్రమాలు కొనసాగించాలని కోరుకుందాం.

• గోర్ల బుచ్చన్న
జర్నలిస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

రుణ భారంతో భారత్ వికసితమయ్యేనా?

భారతదేశం దృష్టి ఇప్పుడు కేంద్ర స్థాయి నుంచి రాష్ట్రాలపైకి మళ్లింది. లోక్‌సభ ఎన్నికల్లో బిహార్, ఏపీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, గుజరాత్‌లో వచ్చిన ఫలితాలు కేంద్రంలో రాజకీయ సమీకరణాలను మార్చాయి. బిహార్, ఏపీలో వచ్చిన ఫలితాల ఆధారంగానే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. మధ్యప్రదేశ్‌తో పాటు ఒకటి రెండు రాష్ట్రాల్లోనే గత ఎన్నికల ఫలితాలను బీజేపీ పునరావృతం చేయగలిగింది. లోక్‌సభ ఎన్నికలు జరిగిన కొద్ది రోజుల్లోనే వివిధ రాష్ట్రాల్లో 13 అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని తేలింది. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరాఖండ్, హిమాచల్‌లో మొత్తం సీట్లు గెలుచుకున్న బీజేపీ అసెంబ్లీ ఉపఎన్నికల వరకు వచ్చేసరికి నాలుగు సీట్లు కోల్పోయింది. ఇక ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలు, వచ్చే ఏడాది జరిగే ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గట్టి పోరాటమే జరపాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ దేశంలో ఏ ఎన్నికలు జరిగినా తానొక్కడే అన్నట్లుగా ముందుండి నిలిచి ప్రచారం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీపైనే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాల్సిన గురుతర బాధ్యత ఉన్నది.

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కంటే 59 సీట్లు తక్కువ గెలుచుకున్న ఇండియా కూటమిలో రోజురోజుకూ ఉత్సాహం పెరుగుతున్నదనడంలో సందేహం లేదు. ఎన్డీఏ కూటమితో పోలిస్తే 1.9 శాతం మాత్రమే తక్కువ ఓట్లు గెలుచుకున్న ఇండియా కూటమి నేతలు పార్లమెంట్‌లోనూ, వెలుపలా సంఘటిత కార్యాచరణను ప్రదర్శిస్తున్నారు. తొలి సమావేశాల్లోనే ఇండియా కూటమి సంఘటితంగా రాహుల్‌గాంధీని లోక్‌సభా పక్ష నేతగా ఎన్నుకోవడం, కలిసికట్టుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని అడ్డుకోవడం, ఇటీవల నీతిఆయోగ్ సమావేశాలను బహిష్కరించడం కీలక పరిణామాలు. ఇక ద్వితీయ సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఇదే దూకుడును ప్రదర్శించాయి. సమయం దొరికితే చాలు ప్రజల మధ్యకు వెళుతున్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీలో కొత్త ఉత్సాహం కనపడుతోంది. గతంలో అరుదుగా లోక్‌సభకు వచ్చి మాట్లాడే రాహుల్‌గాంధీ ఇప్పుడు సమయం దొరికితే చాలు సభలో ప్రతిస్పందిస్తున్నారు. తాజాగా మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, అజిత్ దోవల్, అదానీ, అంబానీ ఈ ఆరుగురినీ ఆయన కౌరవ నేతలుగా పోల్చి వారు రచించిన పద్మవ్యూహంలో దళితులు, బీసీలు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, రైతులు, మధ్యతరగతి తదితరులంతా అభిమన్యుల్లా చిక్కుకున్నారని రాహుల్ అభివర్ణించడం లోక్‌సభలో సంచలనం సృష్టించింది. ఉద్దేశపూర్వకంగానే ఆయన బీజేపీని సంపన్నులు, అగ్రవర్ణాల అనుకూల ప్రతినిధిగా, ఇండియా కూటమిని సామాన్యుల, మధ్యతరగతి వర్గాల ప్రతినిధిగా అభివర్ణించి తమ రాజకీయ పోరును సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు సమర్థంగా ప్రయత్నించారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ లోక్‌సభ ఫలితాల తర్వాత అనేకమంది దృష్టి రాహుల్‌గాంధీపై మళ్లిందనడంలో అతిశయోక్తి లేదు. రాహుల్ రెండు ప్రసంగాలకూ సోషల్ మీడియాలో అత్యంత ప్రాచుర్యం లభించింది. ఆయన ప్రసంగాలపై టీవీల్లో ప్రైమ్ టైమ్‌లో చర్చలు సాగుతున్నాయి. లోక్‌సభలో రాహుల్ లేచి నిలబడ్డప్పుడల్లా



కేంద్ర ప్రభుత్వ అప్పు రూ. 185.27 లక్షల కోట్లు దాటింది. అది జీడీపీలో దాదాపు 57 శాతానికి చేరుకున్నదని తాజా బడ్జెట్ పత్రాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బిహార్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో 20 శాతానికి మించి అప్పులు చేశాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వివరించింది. ఆర్థిక లోటు, రుణాల విషయంలో రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం.

బీజేపీ నేతలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి కనపడుతోంది. ఒకప్పుడు నరేంద్రమోదీని ఆకాశానికెత్తిన చేతన్ భగత్ లాంటి రచయితలు కూడా రాహుల్‌గాంధీని ప్రశంసించడం మొదలుపెట్టారు. రాహుల్ వ్యక్తిత్వంలో, హావభావాల్లో, ప్రసంగాల్లో పరిపూర్ణ పరివర్తన కనపడుతోందని, ప్రజలు ఆయన చెప్పేది వింటున్నారని, బీజేపీ స్వయంకృతాపరాధాల వల్లే రాహుల్‌కు ప్రజాదరణ పెరుగుతోందని చేతన్ భగత్ విశ్లేషించారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

చేతన్ భగత్ భావిస్తున్నట్లు రాహుల్ ఇదే విధంగా సరైన ఎత్తుగడలు వేస్తే తన లక్ష్యాన్ని సాధించే అవకాశాలున్నాయి కాని అందుకు చాలా దూరం ఉన్నది. కాని ఇండియా కూటమి టేకాఫ్ మూడ్‌లో ఉందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇక 2029 వరకు జరిగే ఎన్డీఏ ప్రతి అడుగూ ఆచితూచి వేయాల్సి ఉంటుంది. ఇండియా కూటమి నేతలే కాదు, బీజేపీ నేతలు కూడా మోదీ కదలికలను ఆసక్తితో గమనిస్తున్నారని చెప్పక తప్పదు.

ఈ పరిస్థితుల్లో 2047 కల్లా దేశాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించడం ద్వారా మోదీ సర్కార్ ఈ రాజకీయ పోరునుంచి ప్రజల దృష్టి మళ్లించగలదా అన్నది అనుమానమే. నేతలు భావి లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలను, కార్యాచరణను నిర్దేశించుకోవడంలో తప్పేమీ లేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇలాంటి లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయడంలో అందరికన్నా ముందున్నారు. ఆయన 1998లోనే విజన్–2020 పేరిట లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దాని ఫలితాలు కూడా కనపడ్డాయి.

ఇప్పటి వరకూ నరేంద్రమోదీ ప్రసంగాలు, ప్రకటనలు, హావభావాలు ఎంతో చర్చనీయాంశాలయ్యాయి. అయితే దేశంలో మారుతున్న పరిస్థితుల్లో వికసిత్ భారత్–2047 లక్ష్య నిర్దేశాన్ని ప్రజలు ఎంత సీరియస్‌గా తీసుకుంటారన్నది చర్చనీయాంశం. 2023 ఆగస్టు 15న ఎర్రకోటపై మోదీ ప్రసంగించే నాటికి దేశంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని ఎవరూ ఊహించలేదు. ఆయన తన స్వంత మనుగడకోసం ప్రయత్నిస్తూనే తాను ఏర్పర్చుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం దీర్ఘకాలిక లక్ష్యాలతో పాటు స్వల్పకాలిక లక్ష్యాలను కూడా విధించుకోవల్సి ఉంటుంది. కాని స్వల్పకాలిక లక్ష్యాలే నెరవేర్చలేనప్పుడు దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించగలమా అన్నది ప్రశ్న. ఉదాహరణకు 2022 కల్లా అందరికీ ఇళ్లు నిర్మిస్తామని 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. కాని ఇప్పటికీ ప్రభుత్వం ఈ లక్ష్యానికి చేరువలో కూడా రాలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు బిహార్, ఈశాన్య రాష్ట్రాలు ఇళ్ల నిర్మాణంలో 50 శాతం లక్ష్యాన్ని కూడా సాధించలేకపోయాయి. ఐక్యరాజ్యసమితి దశాబ్దంన్నర క్రితం నిర్ణయించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల విషయంలో కూడా భారతదేశం 167 దేశాల్లో 109వ శ్రేణిలో ఉందని ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి రెండు రోజుల క్రితం పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు.

అందువల్ల ఏ లక్ష్యాన్ని విధించుకున్నా అది ప్రసంగాల వల్ల సాధ్యం కాదు. ముఖ్యమంత్రుల సమావేశం కోసం నీతిఆయోగ్ ప్రకటించిన ఆధారపత్రం కేంద్రం, రాష్ట్రాలు సమిష్టిగా పనిచేస్తేకానీ వికసిత్ భారత్ లక్ష్యం పూర్తి కాదని స్పష్టం చేసింది. ప్రధానంగా మూలధన పెట్టుబడులు రాష్ట్రాల్లోనే పెరగాలని ఈ పత్రం తెలిపింది. 2047 కల్లా 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏర్పడాలంటే ఇప్పుడున్న 3.36 ట్రిలియన్ డాలర్ల కంటే 9 రెట్లు జీడీపీ పెరగాలని, ఇప్పుడున్న 2392 డాలర్ల తలసరి వార్షికాదాయం 8 రెట్లు పెరగాలని ఈ పత్రం ప్రకటించింది. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయానికీ, మన దేశ తలసరి ఆదాయానికి హస్తిమశకాంతరం ఉన్నది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ – ఈ 8 రాష్ట్రాలే భవిష్యత్తులో ఎంతో కొంత లక్ష్యాన్ని సాధించగలవే కాని మిగతా రాష్ట్రాలు సమీప దూరంలో కూడా లేవని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

పేదరికాన్ని తగ్గించడం కాదు, అసలు పేదరికమే లేకుండా చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నీతిఆయోగ్ సమావేశంలో ప్రకటించడం వినసొంపుగానే ఉంది. జీ–20 దేశాల్లోనూ, బ్రిక్స్ దేశాల్లోనూ అతి పేద దేశంగా ఉన్న భారత్ ఈ లక్ష్యం సాధించాలంటే అసమానతలు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అతి వేగంగా చర్యలు తీసుకోవాలని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పారు. భారత్‌లో 15–24 ఏళ్ల మధ్య వయసులో ఉన్న ప్రతి అయిదుగురిలో ఒకరు నిరుద్యోగి అని అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకటించింది. అందువల్ల అభివృద్ధి వేగాన్ని పెంచడమే కాదు, ఈ అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా ఉండాలని, అధిక సంఖ్యలో ఉపాధి కల్పన జరగాలని 14వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు గోవింద్‌రావు అభిప్రాయపడ్డారు. దేశంలో 44 శాతం మంది వ్యవసాయంపై, 42 శాతం మంది చిన్నా చితక సంస్థలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడం కూడా ఒక సవాలే.

ఆర్థిక లోటు, జీడీపీలో రుణ శాతం తగ్గించడం అతి పెద్ద సవాలు. మొత్తం కేంద్ర ప్రభుత్వ అప్పు రూ. 185.27 లక్షల కోట్లు దాటగా, అది జీడీపీలో దాదాపు 57 శాతానికి చేరుకున్నదని తాజా బడ్జెట్ పత్రాలు సూచిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, బిహార్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తిలో 20 శాతానికి మించి అప్పులు చేశాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ వివరించింది. ఆర్థిక లోటు, రుణాల విషయంలో రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకపోతే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యం.

అందరికీ నాణ్యమైన ఇళ్లతో పాటు నాణ్యమైన సేవలు, 24 గంటలు స్వచ్ఛమైన నీరు, విద్యుత్ సరఫరా, హై స్పీడ్ బ్రాడ్ బ్యాండ్, బ్యాంకింగ్ సౌకర్యాలు, అందరికీ భరించదగ్గ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు, అర్థవంతమైన విద్య, అందరికీ నైపుణ్యం, అందరికీ పుష్కలంగా ఉపాధి, యాజమాన్య అవకాశాలు, పట్టణ ప్రాంతాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన జీవన ప్రమాణాలు, నగరాల్లో ప్రపంచ స్థాయి వ్యాపార, ఆర్థిక కేంద్రాలు, ఉత్పత్తి, సేవలు, లాభసాటి వ్యవసాయంతో పాటు అసలు పేదరికమే లేని దేశంగా మారినప్పుడే వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించినట్లవుతుందని నీతిఆయోగ్ స్వయంగా పేర్కొంది. గతంలో అసాధ్యమైన కలల ప్రపంచాన్ని తలపించే ఉటోపియన్ సోషలిజం గురించి మాట్లాడేవారు. ఇప్పుడు ఉటోపియన్ కాపిటలిజం గురించి మన నేతలు మాట్లాడడంలో ఆశ్చర్యం లేదు. ప్రజలను స్వప్నాల్లో ఉంచినప్పుడే కదా వారు విజయవంతం అయ్యేది! అయితే అసలు వాస్తవాలు సామాన్యుడి జీవితాల్లో ప్రతిబింబిస్తాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు రూ. 9,200 కోట్లేనా?

ప్రజల అభివృద్ధి కోసం ఏర్పడిన ప్రభుత్వంలో జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు 9200 కోట్లు మాత్రమే కేటాయించడం వారికి తీరని అన్యాయం తలపెట్టడమే. దీంతో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసేందుకే వాగ్దానాలను చేసినట్టు తేలిపోయింది. 17 శాతం ఉన్న ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు, ఏడు శాతం ఉన్న ఎస్సీ సంక్షేమానికి రూ.33,124 కోట్లు, ఐదు శాతం ఉన్న మైనార్టీ సంక్షేమానికి రూ.3,003 కోట్లు... ఈ బడ్జెట్ కేటాయింపులు అసమగ్రం అయినా, వీరికి ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

అన్ని రకాల రంగాలకు బడ్జెట్ రూపకల్పన నెల రోజుల నుండి జరుగుతుంది. ఈ ప్రజాప్రతినిధులు అప్పటి నుండి ఏమి చేస్తున్నారు? రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు సరిపడా కేటాయింపులను చేయించుకోలేని, బీసీల అభివృద్ధిని అడ్డుకుంటున్న ఆధిపత్య కుల స్వభావం ఎలా వుండిందో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి తమ సామాజిక వర్గానికి రూ.33,124 కోట్లు కేటాయింపులను చేయించడంలో సక్సెస్ అయ్యారు (ఇది సమగ్రమైన పంపిణీ కాదు, ఇక్కడ ఏ సామాజిక వర్గానికి బీసీ సమాజం వ్యతిరేకం కాదు.) కానీ, బీసీలకు నాయకత్వం వహించిన మంత్రులు, ఎమ్మెల్యేలు వారికి అన్యాయం చేశారు. పదవుల కోసం ఉద్యమాలు చేసి, అతితెలివి తేటలను ప్రదర్శించడంలో అగ్రకులాలను మించిపోయిన వీరు, తమ సమాజాన్నే మోసం చేస్తున్నారు. బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగినందున ఆ కేటాయింపులకు నైతికంగా బాధ్యత వహించి బీసీ ప్రజాప్రతినిధులు అందరు మూకుమ్మడిగా రాజీనామా చేయాల్సిన అవసరం ఉంది. లేదా బడ్జెట్ కేటాయింపులలో సవరణలు చేయించి, ఆ కేటాయింపులను పెంచేలా చేసి వారివారి నియోజకవర్గాల్లోకి రావాలని డిమాండ్ చేస్తున్నాం.

– పాపని నాగరాజు
అధ్యక్షులు, కుల నిర్మూలన వేదిక (కెఎన్‌వి)

రైతుబిడ్డ రేవంత్‌కు సాగు కష్టం తెలుసు!

భారతదేశంలో రైతు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనే మరణిస్తున్నాడు అని బ్రిటిష పరిశోధకుడు, ఐసీఎస్ అధికారి మాల్కం డార్లింగ్ 1932లో తాను రాసిన ద పంజాబ్ పీజెంట్ ప్రాస్పారిటీ అండ్ డెబ్ట్ అనే గ్రంథంలో రాశారు. 90 ఏళ్లు దాటినా ఆ వ్యాఖ్యానంలో పెద్దగా మార్పు రాలేదు. భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, హరిత విప్లవం, క్షీర విప్లవం వచ్చి దేశ వ్యాప్తంగా సాగునీటి వసతులు మెరుగుపడి పంట, పాడి ఉత్పత్తులు పెరిగినా ఎప్పటికప్పుడు సాగు రంగం కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. పంట పెట్టుబడులు అధికం అవడం, ప్రపంచీకరణతో ఇతర దేశాల నుంచి భారీ మొత్తంలో పంట ఉత్పత్తుల దిగుబడులతో మన పంటలకు ధరలు పడిపోవడం, తరాలు మారుతున్న కొద్ది సాగుభూములు విభజనకు గురై రెండెకరాల్లోపు భూమి మాత్రమే సగటున రైతు కుటుంబాలకు దక్కుతుండడంతో సాగులో మిగులుబాటు కష్టమైపోతోంది. ఫలితంగా రైతు కుటుంబాలు నిరంతరం అప్పుల్లో కునారిల్లుతున్నాయి.

అప్పుల ఊబి నుంచి రైతు కుటుంబాలకు విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు ఉన్న అప్పులు మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు జూలై 18న రూ.లక్ష వరకు రుణాలున్న 11,50,193 మంది రైతుల ఖాతాల్లో రూ.6,098.93కోట్లు జమ చేశారు. వారందరినీ ఒక్కసారిగా రుణ విముక్తులను చేశారు. తాజాగా రూ.1.50లక్షల వరకు రుణాలున్న 6.40లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,198కోట్లు జమ చేశారు. మొత్తంగా 12 రోజుల వ్యవధిలోనే సుమారు 18 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.12,296 కోట్ల మేర రుణాలను పూర్తిగా మాఫీ చేశారు. రూ.2లక్షల వరకు రుణమాఫీని ఆగస్టులో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పటికే చెల్లించిన రూ.12 వేల కోట్లకుపైగా నిధులకు మరో రూ.19 వేల కోట్లను కలిపి రుణ మాఫీకి ప్రజా ప్రభుత్వం వెచ్చించనుంది. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలోనే ఇది సువర్ణాక్షరాలతో లిఖించే చరిత్ర.

సాగును బాగు చేస్తామంటూ, తమ పాలనా కాలం స్వర్ణయుగం అని చెప్పుకుంటున్న ప్రస్తుత ప్రతిపక్ష నేతలు, నిన్నటి పాలకులు అప్పుల ఊబి నుంచి రైతును బయటకు తీసుకొచ్చేందుకు చేసింది శూన్యం. రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ హామీతో 2014లో ప్రత్యేక రాష్ట్రంలో బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) అధికారంలోకి వచ్చింది. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన రాష్ట్రం కావడంతో ఒకేసారి రుణమాఫీ చేస్తారని అన్నదాతలు ఎంతగానో ఆశించారు. వారి ఆశలను ఆడియాశలు చేస్తూ నాలుగేళ్ల పాటు విడతల వారీగా రుణమాఫీ ప్రక్రియను సాగించారు. 2018లోనూ మరోసారి రూ.లక్ష రుణమాఫీ ప్రకటించిన నాటి ప్రభుత్వం తొలిసారే మాదిరి మళ్లీ నాలుగు విడతలుగా రుణమాఫీని చేసింది. తొలి దఫా రూ.16 వేల కోట్లు, మలి దఫా రూ.12వేల కోట్లను రుణమాఫీకి కేటాయించారు. ఈ నిధులను ఏక కాలంలో కేటాయించకపోవడం, విడతలవారీగా కేటాయించడంతో రైతులు వడ్డీలు, వడ్డీలకు వడ్డీలు కట్టాల్సి వచ్చింది. ఫలితంగా లక్షలాది మంది రైతులు రుణ విముక్తులు కాకుండానే మిగిలిపోయారు. తమ పదేళ్ల పాలనా కాలంలో ఏనాడూ ఏకకాలంలో రుణమాఫీ చేయలేనివారు, ఒకే దఫా రుణమాఫీ చేస్తున్న ప్రజా ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనా విమర్శలు చేయడం హాస్యాస్పదం!

జడ్పీటీసీ సభ్యుని నుంచి ముఖ్యమంత్రి వరకు ఎదిగిన రైతు బిడ్డ రేవంత్ రెడ్డికి క్షేత్ర స్థాయి పరిస్థితులపై గట్టి పట్టు ఉంది. పాదయాత్ర సమయంలో రైతుల రుణభారంపై పూర్తి స్పష్టత వచ్చింది. ఆ అవగాహన నుంచి వచ్చిన ఆలోచనతోనే రుణమాఫీకి హామీ ఇచ్చారు. ఎన్ని అడ్డంకులున్నా వాటిని అధిగమించి రుణమాఫీ చేసి చూపించారు.



దేశంలో రైతు రుణమాఫీ చరిత్రను చూసుకుంటే ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఎదుర్కొంటున్నన్ని ప్రతికూలతలను మరే ప్రభుత్వం ఎదుర్కొలేదు. 1987లో దేశంలో తొలిసారి హర్యానాలో నాటి ముఖ్యమంత్రి దేవీలాల్ రుణమాఫీ చేశారు. ఆ మొత్తం రూ.227 కోట్లు మాత్రమే. 1990లో నాటి ప్రధానమంత్రి వి.పి.సింగ్ రైతులు ఎదుర్కొంటున్న రుణభారం నుంచి ఉపశమనం కల్గించేందుకు రూ.10వేల చొప్పున రుణమాఫీ చేశారు. నాడు దేశవ్యాప్తంగా చేసిన రుణమాఫీ రూ.7,825 కోట్లు మాత్రమే. తర్వాత 2008లో యూపీఏ–1 హయాంలో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దేశవ్యాప్తంగా రూ.60 వేల కోట్లు రుణమాఫీ చేశారు. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రుణమాఫీ జరిగింది. నాడు ఉమ్మడి రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు రూ.11,100 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. తెలంగాణ వరకు చూసుకుంటే రూ.5వేల కోట్లకు మించవు. ఆ రెండుసార్లు కేంద్ర ప్రభుత్వమే రుణమాఫీ చేయడంతో రాష్ట్రాలపై భారం పడలేదు. 2008లో రుణమాఫీ సమయంలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రభుత్వమే ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఉపశమనం కలిగింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు నాటి ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీకి హామీ ఇచ్చింది. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన నూతన రాష్ట్రంలో ఏక కాలంలో ఆ హామీ నెరవేర్చడానికి పెద్దగా ఇబ్బంది లేదు. అయినప్పటికీ రైతులను రుణ విముక్తులను చేసేందుకు నాటి ప్రభుత్వ పెద్దలకు మనసొప్పలేదు. రెండు దఫాలు అధికారం చేపట్టినా ఎప్పుడూ ఏకకాలంలో రుణమాఫీ చేయలేదు. రెండో దఫా పాలనా కాలంలో ఆలస్యం చేస్తూ చివరకు రూ.8వేల కోట్ల రుణాలను మాఫీ చేయనేలేదు. మొత్తంగా పదేళ్లలో ఎనిమిది విడతలుగా రుణమాఫీ చేయడంతో వడ్డీల భారం పెరిగిపోయి రైతుల అప్పులు తీరనేలేదు. అప్పుల భారంతో పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ప్రస్తుతం అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. గత పాలకుని పదేళ్ల పాలన తర్వాత రూ.ఏడు లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రం మిగిలింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం నుంచే సంక్షేమ కార్యక్రమాల అమలు మొదలైంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసాను ప్రభుత్వం అందజేసింది. ఏడు నెలల పాలనా కాలంలోనే రూ.30 వేల కోట్ల సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసినా ఒక్కో పైసా కూడబెట్టి అన్నదాతపై అప్పు భారం తీర్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టి పట్టుపట్టారు. ఫలితంగానే పన్నెండు రోజుల వ్యవధిలోనే సుమారు 18 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.12,296కోట్ల అప్పులు తీరిపోయాయి. ఆగస్టులో మరో 15 లక్షల మంది రైతులు రుణ విముక్తులు కానున్నారు. వారికి చెందిన సుమారు రూ.19వేల కోట్లకు పైగా రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయనుంది. జీతాలు ఇవ్వలేని దుస్థితిలో పాలన పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే రైతులపై తనకున్న ప్రేమ, అంకుఠిత దీక్షతో పట్టుపట్టి రుణమాఫీ చేశారు. లక్షలాది రైతు కుటుంబాలకు పెద్ద కొడుకుగా మారారు.

రైతు బిడ్డగా జీవితాన్ని ప్రారంభించిన రేవంత్‌రెడ్డికి రైతు సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉంది. జడ్పీటీసీ సభ్యుని నుంచి ముఖ్యమంత్రి వరకు ఎదిగిన ఆయనకు క్షేత్ర స్థాయి పరిస్థితులపై గట్టి పట్టు ఉంది. పాదయాత్ర సమయంలో రైతుల రుణభారంపై పూర్తి స్పష్టత వచ్చింది. ఆ అవగాహన నుంచి వచ్చిన ఆలోచనతోనే రుణమాఫీకి హామీ ఇచ్చారు. ఎన్ని అడ్డంకులున్నా వాటిని అధిగమించి రుణమాఫీ చేసి చూపించారు. ఇప్పటి వరకు రైతు నేతలుగా గుర్తింపు పొందిన వారంతా రైతు సమస్యల పరిష్కారానికి పోరాడారు. కొంతమేర తీర్చగలిగారు. కానీ రేవంత్ రెడ్డి అంతకు మించి ఒక్కసారిగా రైతుల రుణభారాన్ని సంపూర్ణంగా తొలగించారు. ప్రతి రైతు కుటుంబపు దిగులును తొలగించారు. జాతిపిత మహాత్మాగాంధీ చెప్పిన భారతీయ ఆత్మను పూర్తిగా సంతోషపెట్టారు.

■ దూదిపాళ్ల విజయకుమార్
ముఖ్యమంత్రి ప్రజా సంబంధాల అధికారి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
బుధవారం 31 జూలై 2024



పల్లెల్లో 'పంచాయతీ' సందడి

స్థానిక ఎన్నికల్లో పోటీకి ఆశావహుల సై

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ సందడి ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో భాగంగా ఆగస్టు నెలలో పంచాయతీ పోరుకు నోటిఫికేషన్ ఇచ్చి ఆనెల చివరి వారంలో ఎన్నికలు నిర్వహించే దిశగా కసరత్తు జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పంచాయతీ ఎన్నికలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సూత్రప్రాయంగా వెల్లడించారు. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలలు స్థానిక ఎన్నికలతో సందడిగా మారనున్నాయి. ఇక పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న వారంతా అవకాశం కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వేషన్ల అంశంపై స్పష్టత కోసం ఎదురుచూస్తుండగా.. ఈ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఐదునెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న గ్రామ పంచాయతీలకు త్వరలోనే కొత్త సర్పంచులు కొలువు దీరనున్నారు.

- మద్దతుదారులతో మంతనాలు
- అవకాశం కల్పించాలంటూ నేతల చుట్టూ ప్రదక్షిణలు
- రిజర్వేషన్లపై స్పష్టత కోసం ఎదురుచూపు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు
- ఓటర్ల జాబితా సవరణకు కసరత్తు

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలపై తాజా ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం వెల్లువెత్తుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. తమ మద్దతుదారులతో సమాలోచనలు చేయడంతోపాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల ముఖ్యనేతలను ఆశ్రయిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన నాయకులు.. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయాలనే లక్ష్యంతో ఉన్నారు. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రాకుంటే భార్యలను లేదంటే కుటుంబ సభ్యులను పోటీలోకి దించేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కష్టపడి పని చేశామని, తమకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని వేడుకుంటున్నారు.

రిజర్వేషన్లపై గుబులు

సర్పంచ్, వార్డు పదవులకు 2018లో ఎన్నికలు జరిగాయి. వారి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఓటర్ల జాబితా పూర్తయిన వెంటనే గడువులోగా బీసీ రిజర్వేషన్ల వివరాలు పంపించాలని బీసీ కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ నివేదిక ఆధారంగా పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. ఇప్పుడున్న పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరుగుతాయా? అనే దానిపై నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ విధానం ఉండేలా గత ఎన్నికల్లోనే నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత విధానాన్నే కొనసాగిస్తారా? ఏవైనా మార్పులు చేర్పు లు చేస్తారా? అనే అంశంపై స్పష్టత రావలసి ఉంది. బీసీ ఓటర్ల సంఖ్య పెరగడంతో రిజర్వేషన్లలో మార్పు లు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే బీసీ గణన నిర్వహణకు సమయం లేదు. పంచాయతీల గడువు ముగిసిన ఆరు నెలల్లో ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. లేకుంటే కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులు ఆగిపోతాయి. బీసీ గణనను కనుక చేపడితే ఆ ప్రక్రియ పూర్తికావడానికి సమయం పడుతుంది. దీంతో ఎన్నికల నిర్వహణలో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనుక పాత విధానాన్నే కొనసాగించే వీలుంటుందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

గతంలోనే ఏర్పాట్లు

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలకు గతంలోనే ఏర్పాట్లు జరిగాయి. గతేడాది డిసెంబరులోనే సర్పంచ్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీ ఎన్నికల్లో 200 మంది ఓటర్లకు ప్రిసైడింగ్ అధికారితో పాటు పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650 వరకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించడానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల అధికారుల నియామకం తదితర ఏర్పాట్ల దృష్టి సారించారు.

ఓటర్ల జాబితా సవరణ

సర్పంచుల ఎన్నికలు నిర్వహించేందుకు మొదట ఓటరు జాబితా సవరణపై అధికారులు దృష్టి సారించనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోని ఓటర్ల జాబితాను గ్రామంలో వార్డుల వారీగా విభజిస్తారు. ఆ తర్వాత ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఆగస్టు మొదటి వారంలోగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై అధికారిక ఉత్తర్వులు త్వరలోనే రానున్నాయి.

పంచాయతీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,688 గ్రామ పంచాయతీలున్నాయి. హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలున్నాయి. ఈ మొత్తం 1,688 పంచాయతీల్లో 83 మేజర్ గ్రామ పంచాయతీలు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పునర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకు ముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగాయి. హనుమకొండ జిల్లాలో పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.

బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉంటారు. అంతమందికి ప్రస్తుతం ఉన్న ఈవీఎంలు సరిపోవు. పైగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా పార్టీ గుర్తులు ఉండవు. అందుకనే పంచాయతీ ఎన్నికల్లో మొదటి నుంచి బ్యాలెట్



బాక్సులనే ఉపయోగిస్తున్నారు. ఈ దృష్ట్యా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి? ఇంకా అదనంగా ఎన్ని బాక్సులు అవసరమవుతాయి? ప్రస్తుతం ఉన్న బ్యాలెట్ బాక్సుల్లో సక్రమంగా ఉన్నవి ఎన్ని? వీటిలో మరమ్మతు చేయాల్సినవి ఎన్ని? తదితర వివరాలు పంపాల్సిందిగా ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను కోరారు. అలాగే పోలింగ్ సిబ్బందికి ఆర్‌వో బుక్‌లు ఏ మేరకు అవసరం అవుతాయో కూడా వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ సిబ్బందితోపాటు ఆర్‌వో బుక్‌లు సైతం ఎక్కువ సంఖ్యలోనే అవసరమవుతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఆరు జిల్లాల డీపీవోలు గతంలోనే ఈ వివరాలను పంపినప్పటికీ తాజాగా మరో సారి తాజాగా సమాచారాన్ని సేకరించి పంపే పనిలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బ్యాలెట్ బాక్సులు సరిపడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి..

- వివరాలను ట్రాఫిక్ పోలీసులకు అందజేయాలి
- పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా


ఆటోలో మరిచిపోయిన వస్తువులను తిరిగి అందజేసిన డ్రైవర్‌కు సీపీ సన్మానం

హనుమకొండ టౌన్, జూలై 30: నగరంలో తిరిగే ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రైసిటీలో ఆటోడ్రైవర్లకు మంగళవారం ములుగు రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ.. ఖాకీ యూనిఫామ్ ధరించే పోలీసు, ఆటో డ్రైవర్లు ఇద్దరూ ప్రజలకు సేవలందించేవారేనని అన్నారు. నగరంలో చాలా మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎలాంటి బీమా వర్తించదన్నారు. ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో అలాంటి వారికి లైసెన్స్‌లు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ట్రైసిటీకి వచ్చే ప్రయాణికులతో పాటు అర్ధరాత్రి ఆటోల్లో ప్రయాణించే వారిని క్షేమంగా వారి గమ్యస్థానాలకు తీసుకుపోవాలని సూచించారు. ఆటోడ్రైవర్లు రోడ్లపై ఇతర వాహనదారులను ఇబ్బంది పెట్టేవిధంగా ఆటోలను నడపడం, నిలపడం చేయొద్దని సూచించారు. ఆటో వెనుక భాగంలో పోస్టర్లను అతికించడం, ఆటోల్లో సౌండ్ బాక్స్‌లు పెట్టి న్యూసెన్స్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం మానుకోవాలన్నారు. ఆటోడ్రైవర్లు చేసే చిన్న చిన్న పొరపాట్లవల్ల ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల వివరాలను సంబంధిత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో అందజేసే విధంగా ఆటో యూనియన్లు బాధ్యత తీసుకోవాలని సీపీ కోరారు.

ఈ సందర్భంగా ఆటోల్లో మరిచిపోయిన ఖరీదైన వస్తువులను తిరిగి అందజేసిన ఆటోడ్రైవర్లను సీపీ సత్కరించారు. ఆటోడ్రైవర్లు రోడ్లపై ఏ విధంగా డ్రైవింగ్ చేయాలనే దానిపై ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌టీవో అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ , షూకూర్, నాగబాబు, ఆర్‌టీవో అధికారులు రమేశ్ రాథోడ్, జైపాల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సైలు రామారావు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా శక్తి యూనిట్లు పూర్తి చేయాలి

- ఉత్పత్తులపై బ్రాండింగ్ ఉండాలి
- కొత్త యూనిట్లను త్వరగా ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై30: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయాల్సిన యూనిట్లు త్వరగా వర్తింప చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మహిళా శక్తి కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసే ఉత్పత్తులపై బ్రాండింగ్ (గుర్తింపు) ఉండాలని, సభ్యులకు ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. టీం లీడర్లు సభ్యులు తయారుచేసే ఉత్పత్తులపై పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే కొత్త యూనిట్లను త్వరగా ఏర్పాటు చేసి ప్రారంభించిన యూనిట్లు సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నతరహా పరిశ్రమలు, కుట్టు కేంద్రాలు, పాలిచ్చే గేదెలు ఇచ్చిన సభ్యుల ఆదాయం పెరిగేటట్టు చూడటం, కోళ్ల ఫారాలు, వాహనాల ద్వారా చేపల అమ్మకం, పాల కేంద్రాలు, ఎంఎస్ఎం ఈ(మీ సేవా కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆహార తయారీ కేంద్రాలపై ఈ సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు.

క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

ఆగస్టు 10వ తేదీలోగా హనుమకొండలోని మెటర్నిటీ హాస్పిటల్, జీడబ్ల్యూఎంసీలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. రంగంపేటలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ కేంద్రం, హసన్‌పర్తిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రూపులలో కొత్త సభ్యులను చేర్పించే కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, మహిళా శక్తి యూనిట్లు త్వరగా నెలకొల్పేందుకు బ్యాంకు రుణాలు మంజూరయ్యేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌వో గణేష్, డీఆర్‌డీఏ పీడీ నాగ పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

- రుణమాఫీ చేస్తామని వరంగల్‌లో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు
- రైతులు సంబరాలు జరుపుకోవడం గర్వంగా ఉంది
- రెండో విడత రుణమాఫీపై వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం, పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 30: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ వరంగల్ ఆర్ట్స్ కళాశాల జరిగిన సభలో రైతులకు రుణమాఫీపై ఇచ్చిన మాట నిలుపుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతులకు రూ.1.50లక్షల రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం అసెంబ్లీ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ జిల్లాలోని రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందన్నారు. రుణమాఫీ పొందిన రైతులు తమ తమ ఇళ్లల్లో సంబరాలు జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. రైతులు తమ పంటల పెట్టుబడికోసం తెచ్చుకున్న రుణాన్ని సకాలంలో పంటలు పండక రైతులు ఆత్మహత్యలు పాల్పడుతున్న సందర్భాలలో వచ్చిన ఆలోచనే రైతు రుణమాఫీ అన్నారు. ఆనాడు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రైతులకు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట మరువలేదని, ఇప్పుడు రైతులకు రుణమాఫీ చేసి రాహుల్‌గాంధీ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు బట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు మాట్లాడారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో 25వేల మంది రైతులకు రూ.142కోట్ల రుణమాఫీ జరిగిందని, అలాగే ప్రస్తుతం రెండో విడతగా 14,700మంది రైతులకు రూ.143.83కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వలన 300మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, వీరికికూడా త్వరలోనే రుణమాఫీ జరుగుతుందన్నారు. బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రుణమాఫీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ అయ్యేటట్లు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మూడో విడత రూ.2 లక్షలలోపు రుణమాఫీ 10నుంచి 15 రోజుల్లో జరుగుతుందన్నారు. ప్రతీ మండల కేంద్రంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని, ప్రతీ బ్యాంకు ముందు గ్రీవెన్స్ సెల్‌ఫోన్ నెంబర్లను ప్రదర్శిస్తున్నామని, రైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం రుణమాఫీ జరిగిన కొంతమంది రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఐదుగురు రైతులకు రుణమాఫీ చెక్కును కలెక్టర్ ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డిలు అందజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌తోపాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద బీజేపీ నిరసన

హనుమకొండ కలెక్టరేట్, జూలై30: రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్‌కు ఈ బడ్జెలో నిధులు కేటాయించి అమలుపరచాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 శాతంపైగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో రూ.9,200కోట్లు మాత్రమే కేటాయించడం బీసీలను మోసం చేయడమే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు బీసీలను కూడా


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

మోసం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. వెంటనే బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని, లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అనంతరం బీజేపీ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

జీఎస్టీ స్కామ్ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- అవినీతిలో సోమేశ్ కుమార్ కేసీఆర్‌కు పెద్దకొడుకు
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

బాలసముద్రం, జూలై 30: రూ.1400 కోట్ల జీఎస్టీ స్కామ్‌పై పూర్తిస్థాయిలో విచారణ చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాల యంలో జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావులతో కలిసి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. సీఎస్‌గా, కేసీఆర్ ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన సోమేష్‌కుమార్ వేల కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. అవినీతిలో కేసీఆర్‌కు సోమేశ్ కుమార్ పెద్దకొడుకు లాంటివాడని అన్నారు. సోమేశ్‌కుమార్ అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో ధరణిలో అక్రమాలు జరిగాయని, కాళేశ్వరం, మేడిగడ్డ, ప్రాజెక్టులలో విద్యుత్ ప్లాంట్ల విషయంలో వేలకోట్ల అవినీతి జరిగిందన్నారు. రాష్ట్రంలో సర్వే నెంబర్ల వారీగా సమగ్రంగా సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇండియా కూటమిలోని ప్రభుత్వాలపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని వెంకట్‌రెడ్డి అన్నారు. బడ్జెట్ కేటాయింపులలో రాష్ట్రానికి అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం బీజేపీ ఎంపీలు కేంద్రంపై పోరాడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని వెంకట్‌రెడ్డి సూచించారు.

కాగా, ఆగస్టు 22, 23, 24 తేదీల్లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించనున్నట్లు చాడా తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణపై ఈ సమావేశాలకు చర్చిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, (మహబూబాబాద్ జిల్లా), జూలై 30 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా గంజాయి తరలిస్తున్నారు. డోర్నకల్‌లో 2021 జూలై 7న అప్పటి డోర్నకల్ ఎస్సై భద్రునాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండా అనుమానస్పదంగా వస్తున్న ఆ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రాలీకింద ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 150 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉండగా 150 ప్యాకెట్లలో 3 క్వింటాళ్ల గంజాయి ఉంది. సుమారు దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులైన కిరణ్‌కుమార్, సూర్యను అదుపులోకి తీసుకుని అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్ సాక్షాన్ని ఆధారంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నిందితులైన బానోత్ కిరణ్‌కుమార్, బాదావత్ సూర్యకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తరిగొప్పుల పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కేసు వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు ఎన్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పందంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 1.565 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ ఆలియాస్ రమ్మీ, జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌ను విచారించగా భూక్య రమేష్ కరీంనగర్ నుంచి గంజాయి తీసుకువచ్చి జలీల్‌కు విక్రయిస్తుండగా జలీల్ తరిగొప్పుల చుట్టుప్రక్కల గ్రామాల యువకులకు ప్యాకెట్ల రూపంలో రూ. 100 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నాడని తేలింది. ఈ విషయమై వరంగల్ సీపీ అంబర్ కిషోర్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఎస్సై శ్వేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారధి, నర్మెట సీఐ సాయిరమణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో నిందితులను చూపిస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన



డాక్టర్ బి.కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన ఆయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు



డాక్టర్ రమేశ్

వరంగల్ మెడికల్, జూలై 30: న్యూరో సైన్స్, అల్జిమర్స్ వ్యాధులపై పరిశోధనలు జరిపిన వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన నాసా సైంటిస్ట్ అవార్డు ప్రదానం చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ రమేశ్ గతంలో కేఎంసీలో కూడా పనిచేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి పదేళ్ల అక్కడి మెమోరీ యూనివర్సిటీలో హెల్త్ సైన్సెస్ విభాగంలో అనేక పరిశోధనలు చేశారు. న్యూరో సైన్స్ విభాగంతోపాటు అల్జిమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనలకు గాను ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ఈ వ్యాధులపై పరిశోధన చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల్లో ఇద్దరు ఉండగా, భారతదేశం నుంచి డాక్టర్ రమేశ్ ఆస్థానాన్ని దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట అమెరికా నాసా సైంటిస్ట్ అవార్డును రమేశ్‌కు ప్రకటించింది.

ఎలక్ట్రిక్ లోకో పీవోహెచ్‌పై ఆశలు

● ఎంపీలు చొరవ చూపి కాజీపేటలో నిర్మిస్తే 10 వేలమందికి ఉపాధి ● సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారుల పరిశీలన



కాజీపేట ఎలక్ట్రికల్ లోకోషెడ్

కాజీపేట, జూలై 30 : దక్షిణ భారత రైల్వేలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం కాజీపేటలోఉన్న ఎలక్ట్రికల్ లోకోషెడ్ దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో ఇంజన్ల నిర్వహణ, మరమ్మతులు చేసే ఒక మోటివ్ పవర్ డిపో.. దీనికి అనుసంధానంగా పీవోహెచ్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) కాజీపేటలోనే నిర్మాణం జరుగుతోంది. కాజీపేటలో నిర్మాణం జరిగితే ఇక్కడి రూపురేఖలు మారుతాయని రైల్వే ఉద్యోగాల సంఘాలు అంటున్నాయి.. ఈ పీవోహెచ్ కాజీపేటకు తీసుకురాగలిగితే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి పెద్దగా ప్రయాసపడాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికే కాజీపేటలో వ్యాగన్ మ్యానుప్యాక్చరింగ్ వ్యాగన్ ఓవరాలింగ్ పరిశ్రమ నిర్మాణపనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్‌లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రికల్ పీవోహెచ్ నిర్మిస్తే కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడుతూ పాత శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ పీవోహెచ్ నిర్మిస్తే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. కాజీపేటకు ప్రాధాన్యం పెరుగుతుంది. సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారులు ఇక్కడికి వచ్చి ఈ మధ్యనే పరిశీలించారు. స్థలం, రైల్వే స్టాఫ్ పొజీషన్, నీటి సౌకర్యం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకూల అంశాలుగా ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటే..

ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ అంటే (పీవోహెచ్) ఎలక్ట్రిక్ లోకోలను ఒక్కొక్క భాగాలను విడదీసి ఓవరాలింగ్ చేసి కొత్త లోకో ఇంజన్ తయారు చేసే ప్రక్రియ. లోకోషెడ్‌లో మరమ్మతు చేసిన లోకో ఇంజన్లు ఇచ్చిన షెడ్యూల్ ట్రిప్పులు పూర్తయిన తర్వాత లోకోల మోడల్‌ను బట్టి 5,10,15 ఏళ్లకోసారి ఓవరాలింగ్ కోసం పీవోహెచ్ షెడ్‌కు రావల్సిందే. ఈ తతంగమంతా చేసే దానినే ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటారు. ఇలా పీవోహెచ్‌కు వచ్చిన లోకోల మెయింటనెన్స్, ఇన్‌స్పెక్షన్ చేయకముందే బయటకు పంపడం కుదరదు. ఒక విధంగా చెప్పాలంటే లోకోలను పరిశీలించి ఒక్కొక్కభాగాన్ని విడదీసి పనికొచ్చే భాగాలతో కొత్త లోకో తయారు చేయడమన్న మాట. అలాంటి ఎలక్ట్రికల్ పీవోహెచ్‌ను కాజీపేటలో నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాజీపేటలోనే నిర్మించడానికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ ప్రారంభమైంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఉండటం, ఇక్కడే ప్రస్తుతం దాదాపు 200 లోకోలకు మరమ్మతులు చేయడం, కావాల్సినంత స్థలం, నీరు, రవాణా అనుకూలంగా ఉండటమే ప్రధాన అంశం. పైగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌కు మంచి రైల్, రోడ్ కనెక్టివిటీ ఉండడమే కూడా ప్రధానం అంశంగా చెప్పొచ్చు. కాచిగూడ, కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ షెడ్, గుత్తి, గుంతకల్ విజయవాడలో ఉన్న లోకోషెడ్‌లలో మొత్తంగా 1,195 లోకోలు ఉన్నాయి. ఇక్కడ మరమ్మతులు అయిన లోకోలను పీవోహెచ్‌కు తరలించడానికి పంజాబ్‌లోని కపుర్తాలకు, చెన్నైలోని పెరంబదూర్ తరలించి ఓవరాలింగ్ చేయాల్సి వస్తుంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జోన్‌లో 800 లోకోలు ఉంటేనే పీవోహెచ్ నిర్మాంచాలని ఆదేశాలు ఉన్నాయి. మన జోన్‌లో 1,195 లోకోలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాలతో పీవోహెచ్ కాజీపేటలో కనుక నిర్మిస్తే లోకోలను తరలించే వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా రైల్వేకు మంచి లాభం. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో జిల్లా ఎంపీలు పట్టుపడితే కచ్చితంగా కాజీపేటకు వస్తుందని రైల్వేకార్మిక సంఘాలు, ఉద్యోగులు అంటున్నారు. ఎంపీలు చొరవచూపి ఇక్కడే నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు

వరంగల్ చౌరస్తా, జూలై 30: ఆదాయ పన్ను రిటర్న్‌కు బుధవారం ఆఖరి గడువని అధికారులు పేర్కొంటున్నారు. గడువులోపు ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రూ.5వేల పెనాల్టీతో డిసెంబరు 31 వరకు దాఖలు, రూ.వెయ్యి పెనాల్టీతో డిసెంబరు 31 వరకు చేసుకునే అవకాశాన్ని ఆదాయపు పన్ను శాఖ అవకాశమిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఏటా ఆదాయ పన్ను శాఖకు వ్యాపార, వాణిజ్య, ఉత్పత్తి సంస్థలకు చెందిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లించే వారు 87వేల మంది ఉన్నారు. వీరు ప్రతీ ఏటా తమ ఆదాయాన్ని బట్టి తమ ఏడాది లాభ నష్టాలతో కూడిన వివరాల పత్రాలను ఆదాయపన్ను శాఖకు సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1,500 మంది డిఫాల్టర్లు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని సమాచారం. ఆదాయపన్ను శాఖ ప్రతీ ఏటా పన్ను చెల్లింపు ఐటీ రిటర్న్ దాఖలులో 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. వీరికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఉద్యోగులకు, చిన్న తరహా వ్యాపారులకు రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉన్న వారికి 5శాతం పన్ను, రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు 10శాతం, రూ.9లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షల ఆదాయం దాటిన ప్రతీ ఒక్కరు తమ ఆదాయంలో 30శాతాన్ని పన్నును ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు : మహేందర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కొందరు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు దాఖలు పత్రాల్లో తప్పుడు సమాచారంతో మినహాయింపులు డిడెక్షన్లు చూపిస్తున్నారు. రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్‌ను పొందుతున్న విషయం ఆదాయపన్ను శాఖ విభాగం దర్యాప్తులో తేలింది. తప్పుడు రిటర్న్ దాఖలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

మడికొండ వద్ద ఘటన.. విద్యార్థులకు స్వల్పగాయాలు



లారీ ఢీకొని ధ్వంసమైన స్కూల్ బస్సు

మడికొండ, జూలై 30: స్కూల్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలైన ఘటన మడికొండలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సక్సెస్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళుతోంది. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన లారీ వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో వాల్మీకినగర్ వద్దకు రాగానే స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొని, ఎదురుగావస్తున్న కారును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం ధ్వంసమై అద్దం పగిలిపోయింది. దీంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కొద్ది తేడాతో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు.. లారీలు గ్రామంలోకి రావొద్దని ఎన్నిసా ర్లు ఆందోళన చేసినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. లారీల లారీలను గ్రామంలోకి రానివ్వద్దని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బురద మడిలో కుప్పకూలి రైతు మృతి

ఐనవోలు, జూలై 30: బురదమడిలో కుప్పకూలి రైతు మృతిచెందిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. డోబీల సంపత్(54) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రెండు, మూడు రోజుల్లో పొలంలో నాటువేయాల్సి ఉండగా బురదమళ్లలో నీటిని పరిశీలిస్తూ గట్టుపై నుంచి నడుచుకుంటు వెళ్తూ బురదమడిలో బోర్లపడిపోయాడు. కొద్ది దూరంలో ఉన్న రైతులు అటుగా వచ్చి చూసేవరకు బురదమడిలో తల కూరుకుపోయి ఉన్నాడు. వారువచ్చి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కాగా, సంపత్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల

వరంగల్ మెడికల్, జూలై 30: వైద్య, ఆరోగ్యశాఖ నాలుగో జోన్ పరిధిలోని నర్సింగ్ ఆఫీసర్స్ బదిలీ ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. సీనియారిటీ జాబితాలో తప్పుల తడకలు, యూనియన్ ఆఫీస్ బేరర్స్ లేఖలు, ధర్నాలు, రాస్తారోకోలు, కౌన్సెలింగ్ సమయంలో జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు ఎంజీఎంకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ వెళ్లడంతో నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సేవలు అందించారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొనడంతో నాలుగో జోన్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు అందరూ కొత్త పోస్టింగ్ బాట పట్టారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోటు కాకుండా మరో చోటు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, 78మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు స్థానచలనం కల్పించారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు 23 మంది ఎంపిక

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీలో 23 మందిని నెల రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ సెంటర్ నేతృత్వంలో నాలుగు వారాల పాటు 23 మందికి బిల్డింగ్ కెపాసిటీ, ఇంగ్లీష్ గ్రామర్, కంప్యూటర్ స్కిల్స్ ఆఫీస్ ప్రొసీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరిలో క్లర్క్స్ కం టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు తరగతులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఖాతా నుంచి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సెల్ఫ్ కార్యాలయానికి చెల్లించాలని వివరించారు. కేయూ పీఆర్‌వో, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను సమన్వయకుడిగా నియమించారు.

బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధం

ఆర్జేడీకి ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధంగా ఉన్నాయని ఖమ్మం డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి. గాయత్రిదేవి ఆరోపించారు. ఆఫీస్ బేరర్ల అసంబద్ధ లేఖలతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె మంగళవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు వెలువరిచిన తర్వాత యూనియన్ ఆఫీస్ బేరర్‌గా జారీ చేసిన లేఖలు లెక్కా పత్రం లేకుండా ఉన్నాయని విమర్శించారు. లేఖలను అభ్యర్థుల పేరున వ్యక్తిగతంగా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బదిలీల నిబంధనల మేరకు 40 శాతంలో తాను రానప్పటికీ అక్రమ మార్గంలో నలుగురు సహోద్యోగులు టీఎన్‌జీవోస్ ఆఫీస్ బేరర్లుగా లేఖలు సమర్పించడంతో తాను హనుమకొండ నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు యూనియన్ ఆఫీస్ బేరర్లు అయినప్పటికీ స్టేషన్ సీనియారిటీలో ఆరేళ్లంటే వారిని తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని ఉన్నప్పటికీ అధికారులు ఆ నిబంధనను విస్మరించారని ఆరోపించారు. ఇలాంటి పొరపాట్లే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో జరిగితే ఆఫీస్ బేరర్ల లేఖలు సమర్పించిన వారిని నిబంధనల మేరకు బదిలీలు చేశారన్నారు. ఉద్యోగుల బదిలీల నిబంధనలు డిపార్ట్‌మెంట్‌కు ఒక విధంగా ఉంటాయా? అని ఆమె ప్రశ్నించారు. అసంబద్ధంగా, అక్రమ మార్గంలో ఆఫీస్ బేరర్ల లేఖలను తీసుకురావడంతోనే బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె ఆరోపించారు. వైద్యశాఖలో అధికారులు చేపట్టిన చర్యల్లాగా విద్యాశాఖలోనే అలాంటి చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంది. తాను ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో పాటు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానన్నారు.

అయ్యో.. రామా!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్



అయోధ్యకు వెళ్లే ముందు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఫొటో దిగిన నాగరాజు కుటుంబసభ్యులు, గల్లంతైన తేజశ్రీ (ఇన్‌సెట్లో)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి దర్శనానికని సంతోషంగా వెళ్లిన ఆ కుటుంబానికి దేవుడు తీరని శోకాన్ని మిగిల్చాడు. నీటి ప్రవాహం రూపంలో వచ్చిన మృత్యువు కళ్ల ముందే కూతురును బలితీసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నదీస్నానం చేస్తున్న యువతిని సరయూ నది మింగేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య లక్ష్మణ కిలా ఘాట్ వద్ద జరిగింది. లక్ష్మణ ఘాట్‌లో స్నానం చేస్తున్న జనగామకు చెందిన యువతి సరయూ నదిలో గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు ఉపాధి కోసం జనగామలోని సిద్దిపేట రోడ్డులో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులందరితో అయోధ్య, కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. తన భార్య జయసుధ, కూతుళ్ల తేజశ్రీ, తరుణితో పాటు సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లారు. ఆదివారం రాత్రి విమానంలో హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అయోధ్య బాలరాముడి దివ్య దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత కాశీకి వెళ్లేముందు అయోధ్యలోని సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్‌లో నదీస్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఘాట్‌లో స్నానం చేస్తున్న ఐదుగురు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్ స్పందించి నలుగురిని కాపాడింది. నీటిప్రవాహం మరింతగా పెరగడంతో నాగరాజు పెద్దకూతురు తేజశ్రీ(17) నీటిలో కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరగగా మంగళవారం రాత్రి వరకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. సరయూ నదిపై ఉన్న డ్యామ్ గేట్లు ఎత్తడం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కాగా.. తేజశ్రీ జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కన్నీరుమున్నీరుగా..

కళ్లముందే కూతురు గల్లంతు కావడంతో ఆ తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఊరు కాని ఊరులో తమ బిడ్డ ఆచూకీ లభ్యం కావాలని, ప్రాణాలతో బయట పడాలని ఆ అయోధ్య రాముడిని తలచుకుంటూ ఆ కుటుంబ సభ్యులు సరయూ నది ఒడ్డునే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అప్పటిదాకా అందరితో సంతోషంగా, నవ్వుతూ గడిపిన కూతురు గల్లంతు కావడం ఆ తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

యూపీ అధికారులకు బండి సంజయ్ లేఖ

యువతి గల్లంతు విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. యూపీ అధికారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. యువతి ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ అయోధ్య కలెక్టర్ చంద్ర విజయ్‌సింగ్, అయోధ్య ఎస్పీ రాజ్ కరణ్ నాయర్, యూపీ ముఖ్యమంత్రి ఓఎస్డీకి సూచించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

వికలాంగులకు ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలి

వడ్డెపల్లి, జూలై 30: వికలాంగులందరికీ జీవోనంబర్ 56 ప్రకారం ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలని దివ్యాంగుల సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండిస్వరూప, రాష్ట్ర సలహాదారుడు సమ్మెట వేణుగోపాల్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన విధంగానే దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. బ్యాంకులతో నిమిత్తం లేకుండా రూ.10లక్షల రుణాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు రాజ య్య, మహాలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా

బాలసముద్రం, జూలై 30: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలను వరంగల్ 1డిపోలో ముగింపు వేడుకలను వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పాల్గొని ఆర్టీసీ రీజినల్ పరిధిలో 9 డిపోల నుండి ఆర్టీసీ విధులలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇతర సిబ్బందిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బస్సు నడుపుతున్నప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఆర్ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న డ్రైవర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, మాధవరావు, రీజియన్‌లోని 9 డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల అరెస్టు అక్రమం

▸▸ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

రాంనగర్, జూలై 30: తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడానికి సిద్ధమైన ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఒక ప్రకటనలో ఖండించారు. ఆశా వర్కర్లు తమ సమస్యల సాధన కోసం మంగళవారం హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా, ఈ నిరసన కార్యక్రమానికి వరంగల్ నుంచి వెళ్లేందుకు సిద్ధమైన ఆశాలను అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజాపాలన సాగిస్తున్నామని ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆశ వర్కర్లకు శ్రమకు తగిన వేతనం అందడం, వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పద్ధతి మార్చుకోకుంటే ప్రజలు బుద్ధి చెబుతారని వినయభాస్కర్ హెచ్చరించారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

అదనపు డీసీపీ ఎన్. రవికుమార్



సదస్సులో మాట్లాడుతున్న అదనపు డీసీపీ ఎన్. రవికుమార్

సుబేదారి, జూలై 30: మానవ అక్రమ రవాణా సమాజానికి ముప్పుగా పరిణమించిందని, దాన్ని అరికట్టేందుకు సమష్టి కృషి అవసరమని అదనపు డీసీపీ ఎన్.రవికుమార్ అన్నారు. మంగళవారం 'వరల్డ్ డే అగెనెస్టు ట్రాఫికింగ్ ఇన్ పర్సన్' సందర్భంగా ఫ్రాన్సిస్కాన్ మిషనరీస్ ఆఫ్ మేరి సాంఘిక సేవా (ఎఫ్‌ఎంఎస్‌ఎస్‌ఎస్) సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అసుంతా భవన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. మనిషి ఆధునిక పోకడలతో మనిషితనాన్ని మరిచిపోయి మానవీయ విధ్వంసాలకు పాల్పడుతున్నాడని అన్నారు. ప్రధానంగా మానవ అక్రమ రవాణాలో మనిషి మరో మనిషిని మోసం చేసి హ్యూమన్ ట్రాఫికింగ్, ఆర్గాన్ ట్రాఫికింగ్, లేబర్ ట్రాఫికింగ్‌లకు పాల్పడడం బాధాకరమని చెప్పారు. దీనిని సవాల్‌గా తీసుకొని అందరి సమన్వయంతో నివారించేందుకు కృషి చేయాలని కోరారు. మానవ అక్రమ రవాణా నివారణకు పోలీసుశాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. మరిన్ని అవగాహన సదస్సుల ద్వారా మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారి కె. మధురిమ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాతో పాటు మాదక ద్రవ్యాల రవాణా సమస్యగా మారిందని అన్నారు. మానవ అక్రమ రవాణాకు బాలికలు ఎక్కువ మంది గురవుతున్నారని చెప్పారు. యువత మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి పాల్పడడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్స్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు, కె.వసుధ, డాక్టర్ ఎస్.నాగవాణి, ఏసీపీ డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, డెమో అశోక్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి సౌరం ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ బత్తుల కరుణ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, యూత్ అడ్వకేట్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. బాలల రక్షణ, సంరక్షణ కోసం కృషి చేసిన 80 మంది అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను బెకాన్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ - 2024 అవార్డుతో సత్కరించారు.

బల్దియాలో పలువురు అధికారులకు పోస్టింగులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో పనిచేసేందుకు పోస్టింగులు కల్పిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్దియా నుంచి ఇటీవల కొందరు అధికారులు ఉద్యోగ విరమణ పొందగా, మరికొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నలుగురు అధికారులకు పోస్టింగులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌లు పొందిన వారిలో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రాజేందర్‌రెడ్డి బల్దియాకు అడిషనల్ కమిషనర్‌గా బదిలీపై వస్తున్నారు. అదే విధంగా సిద్ధిపేట మునిసిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ -1 మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.ప్రసన్నరాణి గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ పొందారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేస్తున్న ఎ.విజయలక్ష్మి వరంగల్ మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. నర్సంపేట మున్సిపాలిటీ గ్రేడ్-2 కమిషనర్‌గా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌ను గ్రేటర్ వరంగల్ టాక్సేషన్ అధికారిగా బదిలీ చేశారు. బదిలీ, పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు.

ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్టు



చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ఆశ వర్కర్లను అరెస్టు చేసిన పోలీసులు

ధర్మసాగర్, జూలై 30: ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని చలో హైదరాబాద్ పిలుపు మేరకు నిరసనకు వెళ్తున్న ఆశ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా మంగళవారం అరెస్టు చేశారు. తెల్లవారుజాము నుంచి మండలంలోని ఆశ కార్యకర్తల ఇళ్లలోకి పోలీసులు వెళ్లి అరెస్టు చేసి ధర్మసాగర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తిగత పూచీపై విడుదల చేశారు. ఆశ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు.

నిబంధనలను విస్మరిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, జూలై30: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో నడిపిస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపల్లి రవీందర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని ప్రశ్నించినందుకు తమ విద్యార్థి సంఘం తరఫున డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో టీఎన్‌ఎస్‌ఎఫ్, టీడీపీ నాయకులు ఉన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఆగస్టు 16 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో రెండు సెట్ల దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ ధ్రువీకరణతో నామినేషన్లు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

▸▸ మృతుడు ఐనవోలు మండలం సింగారం వాసి



అఖిల్ (ఫైల్)

శంభునిపేట, జూలై 30: లారీ ఢీకొని యువకుడు మరణించిన ఘటన మామునూరులోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. మామునూరు సీఐ రవికుమార్ కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం సింగారం గ్రామానికి చెందిన ఆకులపల్లి అఖిల్ (24) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం స్నేహితులను కలిసేందుకు ఇంటి నుంచి వాగ్దేవి కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్లి, తిరిగి వస్తుండగా మామునూరు శివారులో వరంగల్ నుంచి విశాఖ పట్టణంకు మిర్చీ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణవేణి ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు సైబర్‌క్రైమ్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

బాలసముద్రం, జూలై 30: హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు మంగళవారం సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి సైబర్‌క్రైమ్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపదలో డయల్ 100, మైనర్ డ్రైవింగ్ సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుబేదారి ఎస్‌ఐ గాలిబ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సురేష్

వరంగల్ క్రైం, జూలై 30: మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే నష్టాలపై హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగించారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ బి.సునిత ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ సీఐ సురేష్, ప్రభుత్వ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన జరిగే నష్టాలపై విద్యార్థులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కుమార్, చాంప్లా, కొ మురారెడ్డి, సదానందం, రఘురామ్, హరిప్రసాద్, కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఐనవోలు: విద్యార్థులు చిన్ననాటి నుంచే చెడు వ్యసనాలకు దూరంగా మెదిలి చదువుపై దృష్టిసారిస్తే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎస్సై పస్తం శ్రీనివాస్ సూచించారు. 'డ్రగ్స్ అలవాటు, డ్రగ్స్ అమ్మకం నిర్మూలన' అనే అంశంపై సింగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సును హెచ్‌ఎం అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సై ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తుల జీవితం చిన్నవయస్సులోనే కోల్పోతున్నారన్నారు. గుట్కా, సిగరెట్, అంబర్, పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు క్యాన్సర్ బారిన పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, అలవాట్లను గమనిస్తూ ఉండాలన్నారు. కాగా, దాత చెలుపూరి దేవేందర్‌రెడ్డి పాఠశాలలోని 85 మంది విద్యార్థులకు టై, బెల్టులు, డైరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఖాతా వెంకటమ్మ, రిటైర్డ్ ఎస్సై విజయ్‌పాల్‌రెడ్డి, హరిగోపాల్, ఉపాధ్యాయురాలు ఫాతిమా మేరి, రామకృష్ణరెడ్డి, ప్రశాంత్, మమత, సంజీవరావు, మంజులాల్, రామచంద్రమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై చర్యలకు వినతి

ఐనవోలు, జూలై 30: మైనర్‌లు బైక్‌లు నడపడాన్ని గుర్తించి వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై శ్రీనివాస్‌కు సామాజిక కార్యకర్త రాజారపు రాజ్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. మైనర్లు బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతుండటమే కాకుండా, గంజాయి, పొగాకు ఉత్పత్తులు చెడు వ్యసనాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తల్లిదండ్రులు, మైనర్లకు అవగాహన కల్పించాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో రాయపురం రవికుమార్, మమ్మద్ సైలాన్‌బాబాలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవన నిర్మాణాన్ని సత్వరమే చేపట్టాలని ఏబీవీపీ సెక్రెటేరియేట్ సభ్యులు వినోద్, నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని స్టేట్ టెక్నికల్ బోర్డు సెక్రెటరీ ఎ.పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... శిథిలావస్థకు చేరిన భవన సముదాయంతో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ భవనంలో తరగతుల నిర్వహణ సైతం విద్యార్థులకు అనే ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకొని రూ.25 కోట్లు బడ్జెట్‌ను కేటాయించి కొత్తభవనాన్ని నిర్మించాలన్నారు.

కార్యదర్శి పుల్లయ్య సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు హరితేజ, రాష్ట్ర సభ్యుడు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూతో పాటు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు అందించారు. కార్మికులకు రెయిన్ కోట్స్, పారలు, చీపుర్లు, ఆప్రాన్స్ సకాలంలో అందించాలని వినతి పత్రంలో వెల్లడించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

2వేల మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్

హనుమకొండ కల్చరల్, జూలై 30: అంతర్జాతీయ లయన్స్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని అనేక లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో పది ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహించే హంగర్ రిలీఫ్ కార్యక్రమాన్ని కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంతంలో జిల్లా 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. వీడీజీ 1 చంద్రశేఖర్ ఆర్య, వీడీజీ 2 నరహరి సుధాకర్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, రీజియన్ చైర్మన్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ కోదండపాణి, పెద్ది రేవతి, జన్నపురెడ్డి రాజిరెడ్డి, పరకాల యాదవరెడ్డి, డాక్టర్ సురేశ్ కుమార్‌లతోపాటు జిల్లా నాయకులు రేపూరి రమణారెడ్డి, డాక్టర్ అజిత్, వెంకటరమణ, పద్మజ, నిర్మల సుభాష్ తదితర అనేక మంది నాయకులు పాల్గొన్నారు. నగరంలోని కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్లతోపాటు ఎంజీఎం, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, అనాథ శరణాలయంతోపాటు పది ప్రాంతాల్లో సుమారు 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. నగరంలోని మహిళా లయన్స్ క్లబ్ అభయ, రాణిరుద్రమ, ఝాన్సీరాణి, సాహసిలతోపాటు లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ, థౌజండ్ పిల్లర్స్, ట్రైసిటీ, ఆత్మీయ, స్పోర్ట్స్, వర్ధన్నపేట, ఏకశిలా, కనకదుర్గా తదితర క్లబ్బులు కూడా పాల్గొన్నాయి. లయన్స్ క్లబ్ ఆఫ్ భీమారంకు చెందిన ఆరుట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్రదాన శిబిరం, ట్రైసిటీ ఆధ్వర్యంలో ఉచిత నోట్‌పుస్తకాల పంపిణీ లాంటి కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యుత్‌శాఖ అధికారుల పొలం బాట



రైతులకు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఈ మధుసూదన్‌రావు

హనుమకొండ టౌన్, జూలై 30: పొలాలల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు తెలుసుకునేందుకు విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట పట్టారు. సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ పొలం బాట కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు మంగళవారం తన సిబ్బందితో కలిసి గీసుగొండ మండలం మచ్చాపూర్ సెక్షన్ పరిధిలోని పొలాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా.. విద్యుత్ ప్రమాదాలకు కారణమయ్యే అంశాలు సిబ్బంది దృష్టి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. తమ పరిశీలనలోకి వచ్చిన లూజ్‌వైర్లను సరిచేయడం, వంగిన పోల్స్ సరిచేయడం, కొత్త పోల్స్ వేశామన్నారు. తమ దృష్టికి రాని సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మోటార్స్ దగ్గర ఏర్పాటు చేసే కెపాసిటర్స్ యొక్క ఉపయోగాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఎస్‌ఈ వెంట డీఈ టెక్నికల్ ఆనందం, డీఈ బిక్షపతి, ఏడీఈ నరసింహారావు, ఏఈ సంపత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు

నేడు వీరబ్రహ్మంగారి చరిత్ర



నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

హనుమకొండ కల్చరల్, జూలై 30: హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సురభి నాటికలు నగర వాసులను విశేషంగా అలరింపజేస్తున్నాయి. సాంస్కృతిక శాఖ, జిల్లా యంత్రాంగం, నగరపాలకసంస్థల సహకారంతో నిర్వహిస్తున్న నాటకాల్లో భాగంగా మాయబజార్ నాటకాన్ని ఏసీపీ విజయ్ కుమార్ ప్రారంభించారు. తరువాత భక్త ప్రహ్లాద, పాతాళభైరవి, మాయాబజార్ లాంటి నాటకాలను అద్భుతంగా ప్రదర్శించారు. భానోదయ నాట్య మండలి అధ్యక్షుడు రేకందార్ నాగబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేకంగా విశ్వబ్రాహ్మణుల కోరిక మేరకు శ్రీ పోతులూరి వీరబ్రహ్మం చరిత్ర నాటికాన్ని ప్రదర్శించనున్నట్లు నాగబాబు చెప్పారు. నగర వాసులు నాటక రంగ ప్రియులు నాటకాన్ని ఆసక్తిగా తిలకించి ఆర్థికంగా తమను ఆదుకోవాలని ఆయన కోరారు. సహకరిస్తున్న నగరపాలక సంస్థ అధికారులకు ధన్యవాదాలు చెప్పారు.

ఎమ్మెల్యే నాయినికి క్రెడాయ్ ప్రతినిధుల కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, జూలై 30: అసెంబ్లీలో పెనాలిజేషన్ 25శాతం అంశాన్ని ప్రస్తావించి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి క్రెడాయ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెనాలిజేషన్ 25 కారణంగా బిల్డర్లు, అపార్ట్‌మెంట్‌వాసులు, గృహ యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని క్రెడాయి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. వరంగల్ మహానగర సమస్యలను ప్రస్తావించడంతో పాటు నిధుల కేటాయింపుపై ప్రభుత్వానికి విన్నవించడం అభినందనీయమన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్‌వో ఇనోక్

వరంగల్ కార్పొరేషన్, జూలై 30: నగర పాలక సంస్థ డిస్ట్రిక్ట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్‌గా ఎడవెల్లి ఇనోక్ మంగళవారం ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సుదీర్ఘ కాలం పాటు పని చేసిన వేణుగోపాల్‌ను భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ చేయగా, భద్రాద్రి కొత్తగూడెం వైద్య, ఆరోగ్య శాఖ విభాగంలో పనిచేస్తున్న ఇనోక్‌ను వరంగల్ బల్దియాకు బదిలీ చేశారు. డీఎస్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఇనోక్ ముందుగా బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత బర్త్ అండ్ డెత్ విభాగం సిబ్బంది ఇనోక్‌ను కలిసి పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

ఐనవోలు, జూలై 30: సమస్యల సాధన కోసం సీఐటీయూ పిలుపులో భాగంగా చలో హైదరాబాద్ వెళుతున్న జీపీ కార్మికులు, ఉద్యోగులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని సీపీఎం మండల కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్మికుల సంఘం అధ్యక్షుడు కొత్తూరు ఎనోబు, చంద్రయ్య, పూల, రేణుకబాబు కొమురమ్మతోపాటు 13మందిని పోలీసులు అరెస్టు చేసి పూచికత్తుపై వదిలేశారు.


వర్సిటీ ఇంజనీర్ భవానిప్రసాద్ సేవలు మరువలేనివి

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీర్ జి.భవానిప్రసాద్ సేవలు మరవలేనివని కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భవాని ప్రసాద్ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని సాంకేతిక ఉద్యోగుల సంఘం నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్ నేతృత్వంలో ఉద్యోగులు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వాలే నందయ్య, కోశాధికారి నలుబోల రాము, వై.బాబు, బొక్క మొగిళి, బి.ప్రభాకర్, దామోర ప్రకాశ్, పి.భాస్కర్, సేవ్య జయాకర్, ఎస్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పండ్ల పంపిణీ

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ప్రేరణ ఫౌండేషన్ పండ్లు, ఫలహారాలను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ స్వామి, అలయన్స్ క్లబ్ పక్షాన మనోహర్ స్వామి, కమల, గౌరైరమ, స్రవంతి కనకరాజు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

బాలసముద్రం, జూలై 30: ఇతర ప్రాంతాలనుంచి వచ్చి నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాజ్‌పేయి కాలనీలో సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో 70మంది పోలీసు సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఆధార్‌కార్డు లేకుండా ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు కలిగి ఉన్న మూడు ఆటోలు, 15 బైకులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. పాత నేరాలు చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే రోజు 265 ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు

▸▸ చార్జీలు పెరుగుతాయనే ప్రచారంతో భారీగా రిజిస్ట్రేషన్‌లు

రాంనగర్, జూలై 30: జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం ఒకే రోజు 265 ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. దాదాపు రూ.2కోట్లకు పైగా శాఖకు ఆదాయం ఒకే కార్యాలయం నుంచి వచ్చింది. ఆగస్టు 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయనే ప్రచారంతో క్రయవిక్రయ దారులు ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ప్రతీరోజు స్లాట్స్ కేవలం 72 మాత్రమే బుక్ చేసుకుంటారు. స్లాట్స్ కాకుండా అదనంగా రెండువందల వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగడం విశేషం. రెండు రోజులుగా సెలవులు ఉండటంతో మంగళవారం అయినప్పటికీ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారితో జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం సందడిగా మారింది. వరంగల్ జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. బుధవారం కూడా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది. చాలామంది ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్లు తయారు చేసుకున్నట్లు తెలిసింది. కాగా, చార్జీల పెంపుపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు రాలేదని అధికారులు తెలిపారు. గతంలో ప్రభుత్వం ప్రకటించిన తేదీని దృష్టిలో పెట్టుకుని క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నారని వారు పేర్కొన్నారు. మొత్తంగా రిజిస్ట్రేషన్‌ల ద్వారా శాఖకు భారీగానే ఆదాయం సమకూరడం గమనార్హం.



పారిస్ ఒలింపిక్స్ (జులై 26 - ఆగస్టు 11)





స్వాతంత్ర్యం వచ్చాక ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ప్లేయర్ మను భాకర్. అంతకుముందు బ్రిటిష్ ఇండియన్ నార్మన్ ప్రిచర్డ్ 1900 పారిస్ గేమ్స్ లో రెండు రజతాలు సాధించాడు.

ఎయిర్ పిస్టల్ విభాగంలో తొలి పతకం సాధించిన షూటర్‌గా మను భాకర్	1	ఒలింపిక్స్‌లో తొలి టీమ్ మెడల్ సాధించిన షూటింగ్ జోడీగా మను-సరబ్‌జోత్

'అభిమానులను నిరాశపర్చను'

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధిస్తానని నేనేమాత్రం ఊహించలేదు. ఎవరికైనా ఇక్కడ మెడల్ సాధించాలనే కల ఉంటుంది. కానీ నేను రెండు సాధించాను. అలాగే శుక్రవారం మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అందులోనూ గెలిస్తే అంతకు మించిన ఆనందం ఏముంటుంది? ఇలాగే ప్రజలంతా నాపై ప్రేమను కురిపించాలి. వారిని నిరాశపర్చననే అనుకుంటున్నా. టోక్యోలో ఓటమి తర్వాత ఈ పతకం విలువ తెలిసొచ్చింది. గతాన్ని వదిలేసి ముందుకు కదిలి ఫలితం సాధించాను.

- మను భాకర్

ఒలింపిక్స్‌లో 'ద్వి'పతక వీరులు

అథ్లెట్	విభాగం	పతకం	ఏడాది
సుశీల్ కుమార్	రెజ్లింగ్	కాంస్యం	2008
సుశీల్ కుమార్	రెజ్లింగ్	రజతం	2012
పీవీ సింధు	బ్యాడ్మింటన్	రజతం	2016
పీవీ సింధు	బ్యాడ్మింటన్	కాంస్యం	2021
మను భాకర్	షూటింగ్	కాంస్యం	2024
మను భాకర్	షూటింగ్	కాంస్యం	2024

మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం సాధించిన మను భాకర్, సరబ్‌జోత్‌కు శుభాకాంక్షలు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా నిలిచిన మను చరిత్ర సృష్టించింది. భవిష్యత్‌లో ఇద్దరికీ మరిన్ని విజయాలు లభించాలి.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మన షూటర్లు దేశం గర్వించదగ్గ ప్రదర్శన కొనసాగిస్తూనే ఉన్నారు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం సాధించిన మను, సరబ్‌జోత్‌కు అభినందనలు. ఇద్దరూ అద్భుత నైపుణ్యం, టీమ్ వర్క్‌ను కనబరిచారు. మను అకుంఠిత దీక్ష, అంకితభావంతో రెండో పతకం సాధించింది.

- ప్రధాని నరేంద్ర మోదీ

మనుమాన్వితం

రెండో పతకంతో భాకర్ చరిత్ర

10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మూడో స్థానం

అంచనాలు తప్పలేదు.. మను భాకర్ మళ్లీ సాధించింది.. 2016, 2020 ఒలింపిక్స్‌లో ఎంత మంది షూటర్లు బరిలోకి దిగినా ఒక్క పతకానికీ నోచుకోలేకపోయారు. కానీ ఈసారి రెండు రోజుల వ్యవధిలోనే దేశ ప్రజల సంతోషాన్ని మను 'డబుల్' చేసింది. చరిత్రను తిరగరాస్తూ పాల్గొన్న రెండో ఈవెంట్‌లోనూ కాంస్యం పట్టేసింది. సహచర షూటర్ సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కొరియా అథ్లెట్లకు షాకిస్తూ మూడో స్థానంలో నిలిచింది. తద్వారా స్వతంత్ర్య భారతావనిలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారిణిగా వహ్వా.. అనిపించుకుంది. మరోవైపు షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ దేశానికిదే తొలి పతకం.




సరబ్‌జోత్‌తో కలిసి కాంస్యం కైవసం

పారిస్: కెరీర్‌లో కనీసం ఒక్క ఒలింపిక్ పతకమైనా దక్కించుకోవాలని ప్రతీ అథ్లెట్ తపిస్తుంటాడు. కానీ 22 ఏళ్ల యువ షూటర్ మను భాకర్ అంతకుమించే సాధించింది. రెండు రోజుల వ్యవధిలోనే రెండో కాంస్యంతో ఔరా.. అనిపించింది. నాలుగో రోజు మంగళవారం 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పతక పోరులో మను భాకర్, సరబ్‌జోత్ సింగ్ జోడీ విజేతగా నిలిచింది. ఇది దేశానికి రెండో మెడల్ కాగా.. ఈ రెండింట్లోనూ 22 ఏళ్ల మను భాకర్ పాత్ర ఉండడం విశేషం. ఆదివారం మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను కాంస్యం సాధించిన విషయం తెలిసిందే. మరోవైపు 22 ఏళ్ల సరబ్‌కిది తొలి ఒలింపిక్ మెడల్. ఇక షూటింగ్ విభాగంలో భారత్‌కిది ఆరో పతకం. మరోవైపు ఈ విభాగంలో సెర్బియాకు చెందిన జొరాన అరునోవిచ్-దామిర్ మికెక్ 16-14 తేడాతో తుర్కియే జోడీ సెవ్వాల్ టర్హాన్-యూసుఫ్‌పై గెలిచి స్వర్ణం సాధించింది. ఇదిలావుండగా మను భాకర్ శుక్రవారం జరిగే 25మీ. పిస్టల్ ఈవెంట్‌లోనూ పోటీపడనుంది.

సరబ్‌జోత్ అదుర్స్: కాంస్య పతక ప్లేఆఫ్స్‌లో మను-సరబ్‌జోత్ జోడీ 16-10 తేడాతో కొరియాకు చెందిన ఓహ్ యే జిన్-లీ వొనోహోలను ఓడించింది. ఈ కీలక పోరులో భారత జోడీ సమన్వయంతో ముందుకు సాగింది. ఒకరు వెనుకబడిన వేళ మరొకరు గురి తప్పకుండా పిస్టల్‌ను పేల్చడంతో పతకాన్ని దక్కించుకోగలిగారు. ముఖ్యంగా సరబ్ చివర్లో గురి తప్పని షాట్‌తో అదరగొట్టాడు. ఓపెనింగ్ షాట్‌ను మను 10.2తో దీటుగా ఆరంభించినా, సరబ్‌జోత్ 8.6తో జట్టు 18.8 పాయింట్లతో వెనుకబడింది. అటు కొరియన్స్ 20.5తో దూసుకెళ్లడంతో పాటు 2-0తో వారిదే పైచేయి అయ్యింది. కానీ ఆ తర్వాత పుంజుకున్న సరబ్ 10.5, 10.4, 10 స్కోరు కారణంగా టీమ్ ఆరు పాయింట్లను సొంతం చేసుకోగలిగింది. అటు మను భాకర్ తన తొలి ఏడు షాట్లలో ఇన్నర్ 10ను సాధించి తోడ్పాడునందించింది. వ్యక్తిగత విభాగంలో స్వర్ణం సాధించిన ఓహ్ యే తన నిలకడైన ప్రదర్శనతో తమ జట్టును 2-8 నుంచి 10-14 పాయింట్లకు చేర్చి ఉత్కంఠ పెంచింది. అయితే ఫైనల్ షాట్‌లో యే జిన్ 9, లీ వొనాహో 9.5కి పరిమితమయ్యారు. తీవ్ర ఒత్తిడిలో మను 9.4 స్కోరు చేయగా అటు సరబ్‌జోత్ మాత్రం చక్కటి ఏకాగ్రతతో 10.2 స్కోరుతో కాంస్యాన్ని ఖాయం చేశాడు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో మొదట ఏ జోడీ 16 పాయింట్లు సాధిస్తుందో వారే విజేతలుగా నిలుస్తారు.

నిరాశపరిచిన పృథ్వీరాజ్: పురుషుల ట్రాప్ అర్హత పోటీల్లో పృథ్వీరాజ్ తొండైమాన్ 21వ స్థానంలో నిలిచాడు. రెండు రోజుల పాటు జరిగిన ఐదు రౌండ్స్‌లో తను 118/125 స్కోరు సాధించాడు. ఈ ఈవెంట్‌లో టాప్-6 మాత్రమే ఫైనల్స్‌కు వెళతారు. అలాగే మహిళల ట్రాప్ ఈవెంట్ తొలిరోజు పోటీల్లో రాజేశ్వరి కుమారి 21, శ్రేయాసి సింగ్ 22వ స్థానాల్లో నిలిచారు.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
జపాన్	7	2	4	13
చైనా	6	6	2	14
ఫ్రాన్స్	5	8	4	17
ఆస్ట్రేలియా	5	4	0	9
కొరియా	5	3	3	11
అమెరికా	4	8	10	22
బ్రిటన్	3	5	3	11
ఇటలీ	2	4	3	9
కెనడా	2	2	2	6
హాంకాంగ్	2	0	1	3
భారత్	0	0	2	2

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

అంతులేని నిర్వేదం.. అవధుల్లేని ఆనందం

మూడు రోజుల క్రితమే త్రుటిలో చేజారిన పతకం.. చెదిరిన ఒలింపిక్ స్వప్నం.. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికైనా తీవ్ర నైరాశ్యం ఆవరిస్తుంది. కానీ, రైతుబిడ్డ సరబ్‌జోత్ సింగ్ మాత్రం పడిలేచిన కెరటంలా ఎగిశాడు.. మను భాకర్‌తో కలసి పారిస్ మెగా క్రీడల్లో దేశానికి రెండో పతకాన్ని అందించి సగర్వంగా నిలిచాడు. పాల్గొన్న తొలి ఒలింపిక్స్‌లోనే తొలుత అంతులేని నిర్వేదాన్ని.. ఆనక ప్రపంచాన్నే జయించానన్న సంతోషాన్ని 22 ఏళ్ల వయసులోనే సింగ్ చవిచూశాడు.

ఫుట్‌బాలర్ అవుదామని..: హరియాణాలోని అంబాలా సమీపంలో ధేన్ గ్రామానికి చెందిన జతీందర్ సింగ్, హర్దీప్ కౌర్ దంపతులకు 2001లో సరబ్‌జోత్ జన్మించాడు. తండ్రి చిన్న రైతు. సరబ్..చిన్నప్పుడు ఫుట్‌బాలర్ కావాలనే అనుకొన్నా.. ఏదో గందరగోళంలో ఉండేవాడు. అయితే, 13 ఏళ్ల వయసులో సమ్మర్ క్యాంప్‌లో కొందరు పిల్లలు ఎయిర్ గన్‌తో షూటింగ్ ప్రాక్టీస్ చేయడం చూసి అటువైపు ఆకర్షితుడయ్యాడు. వెంటనే తన తండ్రి వద్దకు వెళ్లి తానూ షూటర్‌నవుతానని చెప్పడంతో ఆయన ఒక్కసారిగా అవాక్కయ్యాడు. పైగా తన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ఏం చేయాలో పాలుపోలేదు. అయితే, సరబ్‌జోత్ పట్టువీడక పోవడంతో కొడుకు కల కోసం ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవాలన్న నిర్ణయానికి వచ్చాడు. అమెరికాలో ఉన్న సరబ్‌జోత్ తాత కూడా ఆర్థిక తోడ్పాటునందించడంతో ఇక వెనుదిరిగి చూడలేదు. 2016లో అంబాలోని అభిషేక్ రాణా అకాడమీలో శిక్షణ కోసం రోజూ 35 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించి వెళ్లేవాడు. కొద్దిరోజుల్లో మెళకువలు నేర్చుకొన్న సింగ్.. జాతీయ షూటింగ్ పోటీల్లో కాంస్యం సాధించాడు. 2019లో జూనియర్ వరల్డ్ కప్‌లో స్వర్ణ పతకంతో అందరి దృష్టినీ ఆకర్షించాడు. కెరీర్‌లో వడివడిగా ఎదిగిన సింగ్.. 2021లో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో పసిడి పతకాలు కొల్లగొట్టాడు. గత ఆసియా క్రీడల్లో టీమ్ స్వర్ణంతోపాటు మిక్స్‌డ్‌లో రజతం సాధించాడు. ఇప్పుడు ఏకంగా ఒలింపిక్ పతకంతో మురిశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సిమోన్ బృందానికి స్వర్ణం



పారిస్: స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణంతో బోణీ కొట్టింది. తనదైన ప్రదర్శనతో అమెరికా జట్టును చాంపియన్‌గా నిలబెట్టింది. బైల్స్, సుని లీ, జోర్డాన్ చిలిస్, జేడ్ క్యారీ, హెజ్లీ రివెరాలతో కూడిన అమెరికా జట్టు మహిళల ఆర్టిస్టిక్ టీమ్ ఆల్‌రౌండ్ విభాగం ఫైనల్లో ఓవరాల్‌గా 171.296 స్కోరు చేసి ప్రథమస్థానంలో నిలిచింది. ప్రిలిమినరీ రౌండ్లో గాయంతోనే బరిలోకి దిగిన బైల్స్.. ఫైనల్స్‌లో మాత్రం పూర్తి ఫిట్‌గా కనిపించింది. తుదిపోరులో వాల్ట్, అన్‌ఈవెన్ బార్స్, బ్యాలెన్స్ బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్లలో పోటీపడి సత్తాచాటింది. ఇటలీకి రజతం, బ్రెజిల్‌కు కాంస్యం దక్కాయి.

పారిస్‌లో నేటి భారతం



షూటింగ్: పురుషుల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫికేషన్స్: ఐశ్వరీ ప్రతాప్‌సింగ్ తోమర్, స్వప్నిల్ కుశాలె (మ. 12.30); మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్స్ రౌండ్ 2- శ్రేయాసి సింగ్, రాజేశ్వరీ కుమారి (మ. 12.30).

బ్యాడ్మింటన్: మహిళల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్: పీవీ సింధు X క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా) (మ. 12.50); పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్‌లు: లక్ష్యసేన్ X జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) (మ. 1.40), ప్రణయ్ X డక్ ఫాట్ లె (వియత్నాం) (రాత్రి 11.00).

టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ రౌండ్ 32: ఆకుల శ్రీజ X జియాన్ జెంగ్ (సింగపూర్) (మ. 2.20).

బాక్సింగ్: మహిళల 75 కిలోల ప్రీక్వార్టర్స్: లవ్లీనా X సున్నివా హాఫ్‌స్టాద్ (నార్వే) (మ. 3.50); పురుషుల 71 కిలోల ప్రీక్వార్టర్స్: నిషాంత్ X జోస్ గాబ్రియెల్ (ఈక్వెడార్) (రా. 12.18).

ఆర్చరీ: మహిళల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్: దీపికా కుమారి X రీనా పర్నాత్ (ఎస్తోనియా) (మ. 3.56); పురుషుల వ్యక్తిగత విభాగం ఎలిమినేషన్ రౌండ్ - తరుణ్‌దీప్ X టామ్ హాల్ (బ్రిటన్) (రా. 9.15).

ఈక్వెస్ట్రియన్: డ్రెస్సేజ్ వ్యక్తిగత గ్రాండ్ ప్రీ: అనూష్ అగర్వాల (మ. 1.30).

అప్పుడు విలన్ అన్నారు: రాణా



శిష్యురాలు మను పతకం సాధించడంతో.. కోచ్ జస్పాల్ రాణా ముఖం ఎనలేని ఆనందంతో వెలిగిపోతోంది. అయితే, టోక్యోలో భాకర్ వైఫల్యానికి తానే కారణమంటూ ఎదురైన దూషణలను గుర్తు చేసుకొని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. అప్పుడు నన్ను విలన్ అన్నవారే.. ఇప్పుడు తన ఇంటర్వ్యూల కోసం ఎగబడుతున్నారని చెప్పాడు. మూడేళ్లుగా జాతీయ రైఫిల్ సంఘం లేదా మరో క్రీడా సంస్థ కానీ తనకు ఒక్క రూపాయి కూడా జీతం చెల్లించలేదన్నాడు. తన పని పూర్తయిందనీ, ఇకపై నెల గడిచేందుకు తాను ఉద్యోగం వెతుక్కోవాల్సి ఉందని తెలిపాడు. 'నేనెవరికీ చెందిన వాడిని కాను. మను నా సాయాన్ని కోరింది. అదే చేశాను. మూడేళ్లు నాకు జీతం అందడం లేదనే విషయం ప్రజలకు తెలియాల'ని రాణా చెప్పాడు.

ఏడు నెలల గర్భంతో బరిలోకి..



ఏడు నెలల గర్భిణి పారిస్ ఒలింపిక్స్‌లో కత్తి చేతబూని పతకం కోసం యుద్ధం చేసింది. ఈజిప్టుకు చెందిన ఫెన్సర్ నడా హఫీజ్ ప్రస్తుతం ఏడు నెలల బిడ్డను కడుపులో మోస్తోంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాలో తెలియజేసింది. 26 ఏళ్ల నడా సోమవారం జరిగిన పోటీల్లో అమెరికా ఫెన్సర్ ఎలిజబెత్ టార్టకోవ్స్కీపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. అయితే ఆ తర్వాతి రౌండ్‌లో పరాజయం పాలైంది. వైద్య విద్యను అభ్యసించిన నడా మాజీ జిమ్నాస్ట్ కూడా. నడా ఇప్పటిదాకా మూడుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొంది.

హాకీలో క్వార్టర్స్ చేరినట్టే!

ఐర్లాండ్‌పై భారత్ విజయం



హర్మన్‌ప్రీత్

టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు పారిస్‌లోనూ పతకం దిశగా దూసుకెళ్తోంది. తమ గ్రూప్-బిలో వరుసగా మూడో మ్యాచ్‌ను ఓటమి లేకుండా ముగించింది. ఆరంభంలో న్యూజిలాండ్‌పై గెలిచి, తర్వాత అర్జెంటీనాతో పోరును డ్రాగా ముగించిన భారత్.. మంగళవారం ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మరోసారి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకోవడంతో భారత్ 2-0తో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. మ్యాచ్‌లో నమోదైన రెండు గోల్స్‌ను హర్మన్‌ప్రీత్ 13వ, 19వ నిమిషాల్లో చేశాడు. ప్రథమార్థం ముగిసేసరికే 2-0తో ముందంజలో నిలిచిన భారత్.. చివరిదాకా ఆధిక్యాన్ని కాపాడుకొని పైచేయి సాధించింది. రెండు విజయాలు, ఓ డ్రాతో మొత్తం 7 పాయింట్లను ఖాతాలో వేసుకున్న భారత్ ప్రస్తుతం గ్రూప్-బి నుంచి టాపర్‌గా కొనసాగుతోంది. ఈ క్రమంలో మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే మిగిలున్న భారత్.. క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకున్నట్టే. ఈ గ్రూప్‌లో వరుసగా మూడో ఓటమితో ఐర్లాండ్ క్వార్టర్స్ రేస్ నుంచి పూర్తిగా నిష్క్రమించగా.. బెల్జియం, ఆస్ట్రేలియా చెరో రెండు విజయాలతో ఆరేసి పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో ఉన్నాయి. రెండు గ్రూప్‌ల నుంచి తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. తదుపరి పోరులో భాగంగా గురువారం బెల్జియంతో ఆడనున్న భారత్.. గ్రూప్‌లో ఆఖరిదైన ఐదో మ్యాచ్‌ను శుక్రవారం ఆస్ట్రేలియాతో తలపడనుంది.

'టాప్' లేపిన సాత్విక్ జోడీ



అశ్విని జంట ఇంటికి..

బ్యాడ్మింటన్ డబుల్స్‌లో హాట్ ఫేవరెట్ హోదాకు న్యాయం చేస్తూ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ వరుస విజయాలతో సత్తా చాటుతోంది. ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించిన ఈ భారత జంట.. గ్రూప్-సిలో టాపర్‌ను నిర్ణయించే కీలకమ్యాచ్‌లోనూ అదరగొట్టింది. మంగళవారం జరిగిన పోరులో మూడోసీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-13, 21-13తో ఇండోనేసియాకు చెందిన మహ్మద్ అర్డియాంటో-ఫజర్ అల్ఫియాన్‌ను ఓడించింది. దీంతో ఓటమన్నదే లేని సాత్విక్ ద్వయం గ్రూప్-సిలో టాపర్‌గా నిలిచింది. తొలి మ్యాచ్‌లో గెలిచిన సాత్విక్ జంట.. సోమవారం ఆడాల్సిన రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థి జోడీ గాయంతో తప్పుకోవడంతో క్వార్టర్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇక మూడో మ్యాచ్‌లోనూ నెగ్గడంతో భారత ద్వయం ఓటమన్నదే లేకుండా తమ గ్రూప్‌లో టాప్ స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్-సి నుంచి ఇండోనేసియా జోడీ రియాన్-ఫజర్ రెండోస్థానంతో క్వార్టర్స్ చేరింది. క్వార్టర్స్‌లో ఎవరితో ఆడతారనేది బుధవారం తేలనుంది. మహిళల డబుల్స్‌లో భారత ద్వయం అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో పోరాటం ముగిసింది. గ్రూప్-సిలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడి నాకౌట్ రేస్ నుంచి నిష్క్రమించింది. గ్రూప్ చివరి మ్యాచ్‌లో అశ్విని జోడీ 15-21, 10-21తో ఆస్ట్రేలియా జంట సెత్యానా-ఏంజెలా చేతిలో ఓటమి పాలైంది.

ప్రియుడితో నైట్ అవుట్.. పోటీల నుంచి గెట్ అవుట్



తన పోటీలకు ముందురోజు ప్రియుడితో కలిసి దొంగచాటుగా బయటికి వెళ్లిన 22 ఏళ్ల బ్రెజిల్ మహిళా స్విమ్మర్‌ను ఇంటికి పంపేశారు. క్రీడాగ్రామం నుంచి బయటకు వెళ్లకూడదనేది క్రీడాకారులందరికి వర్తించే ప్రధాన నియమం. ఆ నియమాన్ని పాటించని బ్రెజిల్ స్విమ్మర్ అనా కరోలినా వియిరాను ఒలింపిక్స్ విలేజ్ నుంచి వెనక్కి పంపించారు. కరోలినా, ఆమె ప్రియుడు గాబ్రియెల్ శాంటోస్‌లిద్దరూ బ్రెజిల్ ఒలింపిక్ స్విమ్మింగ్ రిలే 4X100 మీటర్ల జట్టులోని సభ్యులు. ఈ ఘటనపై ఆమె ప్రియుడు శాంటోస్ క్షమాపణలు కోరడంతో అతడిని మందలింపుతో వదిలేశారు. అయితే కరోలినా మాత్రం అధికారులతో దురుసుగా వ్యవహరించడంతో ఆమెను వెంటనే బ్రెజిల్ విమానం ఎక్కించేశారు. పోటీలకు ముందురోజు నైట్ అవుట్ చేసిన ఈ ఇద్దరూ తెల్లారి జరిగిన తమ ఈవెంట్ల హీట్స్‌లో ఓడారు.

అయితే ఈ ఉదంతంపై కరోలినా తీవ్రంగా స్పందించింది. 'నా వస్తువులు ఇంకా ఒలింపిక్స్ క్రీడా గ్రామంలోనే ఉన్నాయి. నేను మాత్రం విమానాశ్రయానికి చేరుకొని తిరిగి ప్రయాణమవుతున్నా. నాపై జరుగుతున్న వేధింపుల గురించి కమిటీకి ఫిర్యాదు చేశా కానీ, సమస్య పరిష్కారం కాలేదు. నేను నా లాయర్లతో మాట్లాడుతా.. వాళ్లకి అంతా చెబుతా' అని కరోలినా తెలిపింది.

మనికా రికార్డు



ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్‌లో ప్రీక్వార్టర్స్ చేరుకొన్న తొలి భారత ప్లేయర్‌గా మనికా బాత్రా చరిత్ర సృష్టించింది. రౌండ్-32లో బాత్రా 4-0తో 18వ ర్యాంకర్ ప్రీతిక పవాడే (ఫ్రాన్స్)ను ఓడించింది. ఆరంభం నుంచే దూకుడైన ఆటను ప్రదర్శించిన 28వ ర్యాంకర్ మనికా 11-9, 11-6, 11-9, 11-7తో మ్యాచ్‌ను సొంతం చేసుకొంది. కాగా, ఈ మ్యాచ్‌లో ఓడిన 19 ఏళ్ల ప్రీతిక తల్లిదండ్రులది పాండిచ్చేరి.

బల్‌రాజ్‌కు నిరాశ

రోయింగ్ సింగిల్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వర్ పతక అవకాశాన్ని చేజార్చుకొన్నాడు. క్వార్టర్‌ఫైనల్స్ హీట్స్-4లో పన్వర్ 7 నిమిషాల 5.10 సెకన్లతో రేస్‌ను ముగించి నాలుగో స్థానంలో నిలిచాడు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికే మెడల్ రౌండ్‌కు అర్హత లభిస్తుంది. దీంతో సెమీఫైనల్స్ సి/డి కేటగిరీకి పడిపోయిన పన్వర్ 13 నుంచి 24 స్థానాల కోసం పోటీపడనున్నాడు.

పంగల్ అవుట్

ఒలింపిక్స్‌లో భారత బాక్సర్ అమిత్ పంగల్ కథ ముగిసింది. 51 కిలోల ప్రీ క్వార్టర్స్‌లో పంగల్ 1-4తో ప్యాట్రిక్ చిన్‌యంబా (జాంబియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల 57 కిలోల రౌండ్-32లో జాస్మిన్ 0-5తో నెస్తీ పెటక్లో (ఫిలిప్పీన్స్) చేతిలో ఓడింది.

గురి తప్పిన ధీరజ్



భారీ అంచనాలతో బరిలోకి దిగిన తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర తీవ్రంగా నిరాశపరిచాడు. పురుషుల వ్యక్తిగత విభాగంలో ధీరజ్ రెండో రౌండ్‌లోనే అవుటయ్యాడు. మంగళవారం జరిగిన రౌండ్-32లో ధీరజ్ 5-6తో ఎరిక్ పీటర్స్ చేతిలో ఓడాడు. కాగా, మహిళల ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్న తొలి భారత ప్లేయర్‌గా భజన్ కౌర్ రికార్డులకెక్కింది. రౌండ్-32లో కౌర్ 6-0తో వియోలెటా(పోలెండ్)పై నెగ్గింది. అంకిత 4-6తో మిస్సోర్ చేతిలో ఓడింది.

భారత్‌కు 'సూపర్' విజయం

- 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్
- స్వల్ప ఛేదనలో లంక తడబాటు



ట్రోఫీతో సూర్య

పల్లెకెలె: నామమాత్రపు మ్యాచే అయినా.. సిరీస్‌లో ఆఖరి పోరు అభిమానులను ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు చేసిందే 137 పరుగులు. ఈ స్వల్ప ఛేదనలో ఆపసోపాలు పడిన శ్రీలంక చివరి రెండు ఓవర్లలో 9 పరుగులు చేయలేక మ్యాచ్‌ను టై చేసుకుంది. 19వ ఓవర్‌లో రింకూ, 20వ ఓవర్‌లో సూర్య రెండేసి వికెట్లతో అబ్బురపరిచారు. ఇక సూపర్ ఓవర్‌లో మరీ దారుణంగా లంక మూడు బంతులే ఆడి 2/2తో భారత్‌కు బ్యాటింగ్‌ను అప్పగించింది. అటు తొలి బంతినే ఫోర్‌గా మలిచిన సూర్య మ్యాచ్‌ను ముగించాడు. అలాగే సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 137 పరుగులు చేసింది. లంక స్పిన్నర్ల ధాటికి 48/5 స్కోరుతో ఇబ్బందిపడిన వేళ.. గిల్ (39), పరాగ్ (26) ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. చివర్లో సుందర్ (25) వేగంగా ఆడాడు. తీక్షణకు మూడు, హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో లంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 137 పరుగులే చేసింది. కుశాల్ పెరీర (46), కుశాల్ మెండిస్ (43) మాత్రమే రాణించారు. సుందర్, బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వాషింగ్టన్ సుందర్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా సూర్యకుమార్ నిలిచారు.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 137/9 (గిల్ 39, పరాగ్ 26, సుందర్ 25; తీక్షణ 3/28, హసరంగ 2/29).

శ్రీలంక: 20 ఓవర్లలో 137/8. (పెరీర 46, కుశాల్ మెండిస్ 43; సుందర్ 2/23, బిష్ణోయ్ 2/38).

రికార్డుస్థాయిలో ఎల్జీబీటీక్యూప్లస్ అథ్లెట్లు

ఈ ఒలింపిక్స్‌లో ఎల్జీబీటీక్యూప్లస్ (లెస్బియెన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్) అథ్లెట్లు రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. ఒలింపిక్స్ చరిత్రలోనే అత్యధికంగా ఈసారి 193 మంది ఎల్జీబీటీక్యూప్లస్ అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. టోక్యో ఒలింపిక్స్‌లో వీరి సంఖ్య 186 కాగా, ఈసారి మరో ఏడుగురు పెరిగారు. సిడ్నీ (2000) ఒలింపిక్స్‌లో వీరి సంఖ్య కేవలం ఐదు మాత్రమే.

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం.... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r063nDrలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

SCHOLARSHIP ALERT

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Mohan T Advani Centennial Scholarship

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engineering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineering. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Short Url: www.b4s.in/aj/BSFS2

HOPE Engineering Scholarship

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000

Last Date to Apply: 15-08-2024

Short Url: www.b4s.in/aj/SIHE15

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

మమ్మల్ని సంప్రదించకుండానే చర్యలు తీసుకుంటారా?

నిర్మాతల మండలిపై నడిగర్ సంఘం ఆగ్రహం


వివిధ అంశాలపై తమిళ నిర్మాతల మండలి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందంటూ 'నడిగర్ సంఘం' ఆగ్రహం వ్యక్తం చేసింది. తమను సంప్రదించకుండా చర్యలు ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమిళ నిర్మాతల మండలి సోమవారం సమావేశమై పలు తీర్మానాలు ఆమోదించిన విషయం తెలిసిందే. నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలు క్రమబద్ధీకరించాలని, ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ చేపట్టకూడదని, నవంబరు ఒకటి నుంచి సినిమా షూటింగ్‌లు నిలిపివేయాలని.. ఇలా ఆరు తీర్మానాలు ఆమోదించింది. ఇలా ఏకపక్షంగా తమిళ నిర్మాత మండలి నిర్ణయాలను తీసుకోవడాన్ని నడిగర్ సంఘం తీవ్రంగా ఖండించింది. . సినీ రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా షూటింగులు నిలిపివేస్తామని తీర్మానం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పారితోషికాలు సహా ఇతర సమస్యలపై నడిగర్ సంఘం సహా మిగిలిన సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. అలాగే ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ వ్యవహారంపై తదుపరి చేపట్టాల్సిన చర్యలపై తమ సంఘం కార్యనిర్వాహకుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రకటించింది.

> హీరో ధనుష్‌పై తీర్మానం చేయడం సమంజసం కాదని, ఆయనపై నడిగర్ సంఘానికి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్పష్టం చేసింది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

పురస్కారాలకు పరిష్కారం దొరికేనా?

అసంతృప్తో, ఆగ్రహమో... 'గద్దర్ పేరుతో సినీ పురస్కారాలు ఇస్తామంటే ముందుకు రారా...' అంటూ ముఖ్యమంత్రి బహిరంగ వేదికపై నుంచి అన్న ఒక్క మాట తెలుగు చలన చిత్ర పరిశ్రమను ఉలిక్కిపడేలా చేసింది. చిత్ర పరిశ్రమలోని సంఘాలు ఆయన ఆహ్వానాన్ని పక్కనపెట్టే ధైర్యం చేశాయా? ఏమీ తెలియనట్లే ఉంటూ తలెగరేసే సాహసం సినీ పెద్దలు చేయగలరా? ముఖ్యమంత్రి మాటల్లోని మర్మం ఏమిటి? అనేదే ఇప్పుడు నడుస్తున్న చర్చ.



సినిమావాళ్ల ప్రభుత్వాలకు చేసుకునే వినతులలో భాగంగానే ఇన్నాళ్లూ నంది పురస్కారాల అంశం వార్తల్లో నిలుస్తూ వస్తోంది. అయితే ఇప్పుడు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో వార్తల్లో నిలవడమే ఆసక్తిని కలిగిస్తోంది. నేడో రేపు ఫిల్మ్ అవార్డ్స్ గురించి నోటిఫికేషన్ వస్తుందని అందరూ ఎదురుచూస్తున్న తరుణంలో సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరో పక్క ఈ అవార్డుల గురించి చర్చించేందుకు మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రయత్నించాం, కానీ వీలు కాలేదు అనే మాట కొంతమంది సినిమా పెద్దల చెబుతున్నారు.

సినిమా పండుగలా పురస్కారాల వేడుక

నంది పురస్కారాలను చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంది. ప్రతి ఏటా ఉగాది నాడు నంది పురస్కారాల ప్రదానోత్సవం ఆనవాయితీగా వస్తోంది. ఆ వేడుకను ఇండస్ట్రీ మొత్తం పండుగలా జరుపుకునేది. అయితే 2014లో తెలంగాణ ఏర్పడ్డాక అప్పటి ప్రభుత్వం నంది పురస్కారాల స్థానే 'సింహ' పేరుతో కొత్తగా పురస్కారాలను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నామినేషన్లను సైతం స్వీకరించింది. కానీ దశాబ్ద కాలంలో సినీ ప్రముఖులు ఎన్ని విన్నపాలు చేసినా అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకనో సినీ పురస్కారాలపై ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నంది పురస్కారాలను ఇచ్చే సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించాలంటూ పలు వేదికలపై నుంచి చిత్ర పరిశ్రమ తరపున సినీ సంఘాలు, కొంతమంది సినీ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొంత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు. జనవరిలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలో 'గద్దర్ అవార్డ్స్' పేరుతో సినీ పురస్కారాలను ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీని అమలుపై అభిప్రాయాలు, సలహాలు అందించాలని చిత్ర పరిశ్రమ పెద్దలను కోరారు. సినీ ప్రముఖులు సైతం ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అభినందించి, మద్దతు తెలిపారు. తర్వాత మాత్రం ఎలాంటి కదలికా లేదు. కానీ మంగళవారం నాడు ముఖ్యమంత్రి వ్యాఖ్యలతో నంది పురస్కారాల అంశం అనూహ్యంగా తెరపైకి వచ్చింది.

గద్దర్ పేరుతో అవార్డులు ఇష్టం లేదా?

ఏకంగా ముఖ్యమంత్రే బహిరంగంగా అసంతృప్తిని వ్యక్తం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే చిత్ర పరిశ్రమలోని సంఘాలు, సినీ ప్రముఖులు ఏం చేసుంటారు అనే చర్చ జరుగుతోంది. సినిమావాళ్లు బయటపడలేదు గానీ గద్దర్ పేరుతో పురస్కారాలను స్వీకరించడం ఇష్టంలేదనే చర్చ అప్పట్లోనే బహిరంగంగా నడిచింది. ఆ కారణంతోనే సినీ ప్రముఖులు సీఎంను కలసి పురస్కారాల విషయంపై సంప్రదింపులు జరపలేదనే మాట వినిపిస్తోంది. పరిశ్రమ నుంచి ఒక కమిటీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేయకపోవడం అలాంటి అభిప్రాయాలకు ఊతమిచ్చింది. 'సినిమా వాళ్లే రాలేదు' అని సీఎం అంటే 'ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ దొరకలేదనేది సినీ పెద్దలు మాట. జరిగిందేదో జరిగిపోయింది, సినీ ప్రముఖులు, ముఖ్యమంత్రి కలసి పురస్కారాల అంశాన్ని ఓ కొలిక్కితేవాలనేదే ఇప్పుడు పరిశ్రమ ఆకాంక్ష.

స్వయంగా పిలిచినా స్పందించలేదు



నంది పురస్కారాలకు మల్లే తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వాలనుకుంటోంది. నా అంతట నేనే అడిగినా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇది సరికాదు. పురస్కారాల విషయంలో సినీ పరిశ్రమ మౌనంగా ఉంటోంది. గద్దర్ జయంతి సందర్భంగా డిసెంబర్ 9న సినీ పురస్కారాలను ఇవ్వడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలో చెప్పాను. ఈ విషయాన్ని మరోసారి తెలుగు పరిశ్రమకు గుర్తు చేస్తున్నాను. మీ విజ్ఞప్తి కంటే ముందే ఒక అడుగు ముందుకేసి ప్రకటన చేశాను. ప్రతిపాదనతో రావాలని పరిశ్రమ వర్గాలను కోరాను. కారణాలేమిటో తెలియదు కానీ సినీ ప్రముఖులు ఇప్పటివరకూ ప్రభుత్వాన్ని సంప్రదించలేదు. తెలుగు చిత్ర పరిశ్రమ కృషి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా పరిశ్రమ పెద్దలు ముందుకు వస్తే అందరం కలసి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్దాం.

- ఏ. రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రి


ఆ బాధ్యత ఫిలిం ఛాంబర్ తీసుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరించే నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా, ప్రతి ఏటా 'గద్దర్ అవార్డ్స్' తెలంగాణ ప్రభుత్వం తరపున ఇస్తామని వారు ప్రకటించారు. తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలి.

- చిరంజీవి

గద్దర్ అవార్డ్స్‌పై అభ్యంతరం లేదు



మేం ముఖ్యమంత్రిని కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించాం. కానీ సీఎంఓ నుంచి మాకు పిలుపు రాలేదు. అందువల్లే ముఖ్యమంత్రిని కలవలేకపోయాం. గద్దర్ పేరుతో అవార్డ్స్ తీసుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. సీఎం ఎప్పుడు పిలిచినా వెళ్లి కలుస్తాం.

- నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

సీఎంను కలిసిన సినీ నటుడు అర్జున్



సీఎం రేవంత్‌రెడ్డిని సినీ నటుడు అర్జున్ మంగళవారంనాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. సంత్ శ్రీరామ్‌రావ్ జయంతి సందర్భంగా బుధవారంనాడు నిర్వహిస్తున్న మహా హోమంకు రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోరారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

రాణీగా గర్వపడుతున్నాను




విభిన్నమైన పాత్రలతో కథానాయికగా తనదైన పంథాలో కొనసాగుతున్నారు తాప్సీ. 'ఫిర్ ఆయా హసీన్ దిల్‌రుబా' చిత్రంతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. గతంలో వచ్చిన 'హసీన్ దిల్‌రుబా' చిత్రానికి ఇది కొనసాగింపు. అందులో ఆమె రాణి అనే గృహిణి పాత్రలో కనిపించారు. ఇప్పుడు రెండో భాగంలోనూ అదే పాత్రలో కనిపించనున్నారు. 'ప్రతి నాయక ఛాయలున్న పాత్ర కావడం వల్ల కొంతమందికి నచ్చలేదు. నాకు బాగా నచ్చింది. ఇలాంటి పాత్రను పోషించినందుకు గర్వపడుతున్నాను' అని తాప్సీ పేర్కొన్నారు. ఆగస్టు 9న ఈ చిత్రం ఓటీటీలో విడుదలవుతోంది.

ప్రొడ్యూసర్ టాక్

ప్రతి శుక్రవారం కొన్ని సినిమాలను విడుదల చేయడం తెలుగు చిత్రపరిశ్రమలో ఒక ఆనవాయితీ. ఆ ఒక్కరోజుతోనే చాలా మంది సినిమావాళ్ల జాతకాలు మారిపోతుంటాయి. అందుకే శుక్రవారం కోసం చిత్ర ప్రముఖులతో పాటు ప్రేక్షకులూ ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ శుక్రవారం కూడా అశ్విన్‌బాబు హీరోగా నటించిన 'శివం భజే' చిత్రం గురువారం, రాజ్ తరుణ్ హీరో పాత్ర పోషించిన 'తిరగబడరా సామీ' సినిమా శుక్రవారం విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల నిర్మాతలు మల్కాపురం శివకుమార్, మహేశ్వరరెడ్డి మూలి మీడియాతో ముచ్చటించారు.

'తిరగబడరా సామీ'లో కంటెంట్ బాగుంటుంది



భార్యాభర్తలు మూడు ముళ్ల బంధానికి ఎలా కట్టుబడి ఉండాలో సినిమాలో చూపించామనీ, కంటెంట్ బాగుంటుందనీ నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

- సైలెంట్‌గా ఉన్న వ్యక్తిని వైలెంట్‌గా మార్చేవి పరిస్థితులే. ఈ కథలో అలాంటి పరిస్థితులే ఉంటాయి. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రాబల్యంతో ఎలా మారాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. రాజ్ తరుణ్ అద్భుతంగా నటించాడు.
- ప్రతి సినిమాతో కొత్త వారిని పరిచయం చేయాలన్నది నా ఉద్దేశం. గత సినిమాల్లో లాగానే ఈ చిత్రంతో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

> సినిమా అంటే ప్రేమతో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. కానీ ఇక్కడ సంపాదించింది ఏమీ లేదు. కాకపోతే మనం బతుకుతూ పదిమందిని బతికించే ఏకైక పరిశ్రమ ఇది. సినిమా సక్సెస్ అయితే దాని మీద ఆధారపడిన ఎన్నో జీవితాలు బాగుంటాయి.

- మన్నారా చోప్రా ఇందులో నెగెటివ్ ఫీమేల్ లీడ్ చేసింది. ఆ పాత్రకు ఆమె యాప్ట్. సినిమా అంతా ఉంటుంది.
- ఈ సినిమా షూటింగ్ దాదాపుగా జహీరాబాద్‌లో చేశాం. అది మా నేటివ్ ప్లేస్. చాలా సరదాగా వర్క్ జరిగింది.
- దర్శకుడు రవికుమార్ చౌదరి చాలా హార్డ్ వర్క్ చేశారు. చెప్పినదానికంటే అద్భుతంగా తీశారు. వెరీగుడ్ డైరెక్టర్.
- జీడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య , సీరత్‌కపూర్‌తో ఓ సినిమా జరుగుతోంది. శ్రవణ్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నా. అలాగే రాహు కేతు అనే వెబ్ సిరీస్ కూడా చేస్తున్నాం.

ట్రైలర్ చూసి వెంకటేశ్ మెచ్చుకున్నారు



హీరో అశ్విన్‌బాబు, తన పుట్టినరోజు ఆగస్టు ఒకటిన కావడం వల్ల అదే రోజు సినిమా విడుదల చేయడం లేదనీ, అన్ని రకాలుగా అనుకూలంగా ఉండడం వల్ల ఆ రోజు విడుదల చేస్తున్నామనీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. ఆయన చెప్పిన వివరాలు ఇవి.

- మున్ముందు పెద్ద సినిమాలు రాబోతున్నాయి. అందుకే ఈ వారం విడుదల చేయడమే కరెక్ట్ అని నిర్మాతగానే కాకుండా డిస్ట్రిబ్యూటర్‌గా కూడా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను.

> కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఐదారు జానర్లు కలిపినట్టు ఉంటుంది. అందరినీ ఆకట్టుకొనే అంశాలు చాలా ఉన్నాయి. క్వాలిటీ, కంటెంట్ కోసం అనుకున్న దానికంటే ఎక్కువే ఖర్చు పెట్టాను.

- విక్టరీ వెంకటేశ్ మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఆయనకి, అశ్విన్‌కు క్రికెట్ పరంగా మంచి రిలేషన్ ఉంది. ట్రైలర్ చూసి బాగుందని ఆయన మెచ్చుకున్నారు.
- ఈ సినిమాకు సంగీత దర్శకుడు వికాసే హీరో. 'హిడింబ' చిత్రం చూసి ఆయన్ని తీసుకున్నాం. మంచి పాటలు, అద్భుతమైన ఆర్ఆర్ ఇచ్చారు.
- 'శివం భజే' హిట్ అయితే తమిళంలో రీమేక్ చేస్తాం. ఐవీ కృష్ణమూర్తి టీమ్‌తో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నా. కార్తికేయతో కూడా చిత్రం చేయాలనుకుంటున్నాం.

నేను మంత్రినైనా.. నా తల్లిదండ్రులు రోజూ అడవికి వెళ్లి పనిచేసుకుంటారు

- వారికి అటవీ హక్కు చట్టం కింద పోడు భూమి పట్టా వచ్చింది
- అది దానం కాదు.. హక్కు: సీతక్క
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యకు కౌంటర్
- ఒకే రోజు 19 పద్దులపై చర్చా?: కేటీఆర్

హైదరాబాద్/ములుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'పోడు భూములకు హక్కుల కోసం పోరాడిన నా తండ్రి జైలుకు పోయొచ్చిండు.. నేను ఎమ్మెల్యేనైనా.. ఇప్పుడు మంత్రిగా ఉన్నా.. నా తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడుతరు.. ఇప్పటికీ నా తండ్రి అడవినే నమ్ముకొని రోజూ పనిచేస్తడు.' అని ములుగు ఎమ్మెల్యే, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సీతక్క తండ్రికి గత ప్రభుత్వం పోడు పట్టా ఇచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో ప్రస్తావించగా ఆమె స్పందించారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హత ఉన్నందుకే తన తండ్రి పేరిట ఎకరం 17 గుంటల భూమికి హక్కు పట్టా వచ్చిందని, తన కుటుంబానికి ఎవరూ దానం ఇవ్వలేదని బదులిచ్చారు. అడవే ఆధారంగా బతికే కుటుంబాలు తమవని చెప్పారు. తాను ఆదివాసీ అయినందుకే తన తల్లిదండ్రుల పోడు భూమి పట్టాపై బీఆర్ఎస్ నేతలు పదే పదే ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతోమంది ప్రజాప్రతినిధులు రైతుబంధు తీసుకున్నారన్నారు. 2006లో కాంగ్రెస్ సర్కారు తెచ్చిన పోడు భూముల చట్టంతో ఎస్టీలకు లబ్ధి చేకూరిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఎస్టీలకు ఎన్ని ఉద్యోగాలు, ఎంతమందికి ఇళ్లు ఇచ్చిందో చెప్పాలన్నారు. 2018లో తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలవగా ఆ ఐదేళ్లూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా నియోకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వలేదని, ఆవేదనతో కోర్టును ఆశ్రయించానని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల్లో ఉత్తర తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, నిధులన్నీ ఖమ్మం, నల్లగొండ జిల్లాలకే వెళుతున్నాయన్నారు.




ఒకే రోజు 19 పద్దులపై చర్చా?: కేటీఆర్

ఒకే రోజు 19 పద్దులను చర్చకు పెట్టి, వాటి ఆమోదానికి మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు అసెంబ్లీ నిర్వహించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఈసారి సభలో 57 మంది కొత్త ఎమ్మెల్యేలు అడుగుపెట్టారని, వారందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వాలంటే సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించాలన్నారు. వచ్చే బడ్జెట్‌లో రోజుకు రెండు మూడు పద్దులు మాత్రమే పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. సభ సజావుగా జరిగేందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు.

ఒకే రోజు 17.20 గంటల పాటు సభ

- రికార్డు బద్దలు కొట్టిన తెలంగాణ అసెంబ్లీ



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ రికార్డులు బద్దలు కొట్టింది. ఒకే రోజు 17 గంటల 20 నిమిషాల పాటు అసెంబ్లీలో చర్చ జరిగింది. బడ్జెట్ పద్దులపై చర్చ జరిగే క్రమంలో.. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. 19 పద్దులపై చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడారు. వాయిదాలు, వాకౌట్‌లు, నిరసనలు లేకుండా సభ నిరవధికంగా జరిగింది. సోమవారం ఉదయం మొదలైన సభ.. మంగళవారం తెల్లవారు జామున 3.20 గంటల వరకూ కొనసాగింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యధికంగా 12 గంటల పాటు సభ జరిగింది.

'రైతుబంధు'లో 25 కోట్లు దుర్వినియోగం: భట్టి

పోడు భూములకు పట్టాలివ్వాలని పదేళ్లుగా పోరాటం చేస్తుంటే పోడు రైతులకు రైతుబంధు ఇచ్చామని చెప్పడం సభను తప్పుదోవపట్టించడమేనని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మండిపడ్డారు. బడ్జెట్‌పై మంగళవారం శాసనసభలో చర్చ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు పల్లారాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఒక పంట వేసే పోడు రైతులకు ఎస్సీ, ఎస్టీలకు గతంలో తమ ప్రభుత్వం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చిందన్నారు. రాళ్లు రప్పలు, గుట్టలు, పుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు సైతం రైతుబంధు ఇచ్చి రూ.25వేల కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగమైనట్టు తేలిందనే విషయాన్ని భట్టి గుర్తుచేస్తూ.. సభను తప్పుదోవ పట్టించేలా పల్లా మాట్లాడుతున్నారని అన్నారు. పల్లా జోక్యం చేసుకుంటూ అత్యధిక శాతం చిన్న సన్నకారు రైతులకు సాయం అందిందన్నారు. నిధుల దుర్వినియోగంపై మాట్లాడితే అప్పటి క్యాబినెట్‌లో పనిచేసిన ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు బాధ్యత ఉందన్నారు. తుమ్మల స్పందిస్తూ అప్పట్లో రైతుబంధు చైర్మన్‌గా పల్లాను నియమించడమే సరికాదన్నారు. యూనివర్సిటీ వీసీగానో.. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఉంటే బాగుండేదన్నారు.

అది బీఆర్ఎస్ పాలకుల పాపం: శ్రీధర్‌బాబు

బీఆర్ఎస్ హయాంలో సమయానికి నిధులు అందక, చేసిన పనులకు బిల్లులు రాక ఎందరో సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అది బీఆర్ఎస్ పాలకులు చేసిన పాపమని, వారు చేసిన పాపాలను తాము మోయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కచ్చితంగా బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు.

రుణమాఫీ 44 లక్షల మంది రైతులకేనా?: ఏలేటి

రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులుంటే 44 లక్షల మందికే రుణమాఫీ చేశారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. వ్యవసాయ పథకాల కింద రైతులకు సాయం అందించేందుకు రూ.49 వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.33 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు సరిపోవన్న విమర్శపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున 8మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు.

అందుకే మేం ఇక్కడ కూర్చున్నాం: కొత్త

రాష్ట్రంలో పంచాయతీలకు సరిపడా నిధులు ఇవ్వడంలేదని, దాంతో పల్లెలు ఏడుస్తున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు నిధులు ఇవ్వకుండా, కొన్నింటికే ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులన్నీ నాలుగు నియోజకవర్గాలకే వెళ్లాయన్నారు. ప్రభాకర్‌రెడ్డి స్పందిస్తూ అప్పుడు తాము అలా చేశాం కాబట్టే ఇప్పుడు ఇక్కడ(ప్రతిపక్షంలో) కూర్చున్నామన్నారు. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆయనవైపు చూశారు.

నియోజకవర్గాల్లో కార్పొరేట్ పాఠశాలలు, ఆస్పత్రులు పెట్టాలి: కూనంనేని

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలు, ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభలో వివిధ శాఖల డిమాండ్లపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి పరిశ్రమ హోదా కల్పించాలని, నియోజకవర్గాల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గిరిజనుల భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అందుకే త్వరితగతిన పోడు భూముల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?: కోవ లక్ష్మి

'కల్యాణలక్ష్మి'లో తులం బంగారం ఎప్పుడిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'అభయహస్తం'లో అర్హులైన మహిళలకు రూ.2,500 సాయం, అంగన్‌వాడీలు, ఆశాలకు జీతాలు పెంచుతామన్న హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో రూ.500 గ్యాస్ సిలిండర్లు అందడం లేదన్నారు.

హోం శాఖ ఇప్పిస్తారా..? కాంగ్రెస్‌లో చేరతా

- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాజీ మంత్రి మల్లారెడ్డి

'ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. నా లెవల్ వేరే ఉండేది. నేనే హోంమంత్రి అయ్యేవాడిని' అని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో మల్లారెడ్డి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఈసారి మా పార్టీ అధికారంలోకి వస్తే.. ఏడాదికి నాలుగు సినిమాలు తీసేవాడినని. ఓ శాటిలైట్ ఛానల్ కూడా పెట్టేవాడిని. కాంగ్రెస్ సర్కారులో హోంశాఖ మంత్రి పదవి సీఎం దగ్గరే ఉంది. కాంగ్రెస్ వాళ్లతో మీరు మాట్లాడతారా..? నాకు హోంమంత్రిత్వ శాఖను ఇప్పిస్తారా..?' అంటూ మీడియా ప్రతినిధులతో మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీలోని డిప్యూటీ సీఎం ఛాంబర్‌కు వెళ్లిన మల్లారెడ్డి.. ఆయనతో చాలాసేపు మాట్లాడినట్లు తెలుస్తోంది.


ధాన్యం కొనుగోలులో కుంభకోణం: గంగుల

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగాయని పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు తాము పిలిచిన గ్లోబల్ టెండర్లను రద్దు చేసి.. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేవలం నలుగురు కాంట్రాక్టర్లకే అప్పగించారన్నారు. టెండరు రేటు క్వింటాలుకు రూ.2,007 అయితే మిల్లర్ల నుంచి రూ.2,223 చొప్పున రూ.216 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. దీని వెనక రూ.750 కోట్ల కుంభకోణం ఉందని, వెంటనే విచారణ జరిపించాలని, సభాసంఘం వేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రజలకు ఆశ కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

సాగర్‌కు బిరబిరా

శ్రీశైలంలో తెరుచుకున్న 10 గేట్లు.. నాగార్జునసాగర్ దిశగా 2.79 లక్షల క్యూసెక్కులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



కృష్ణమ్మ జలసిరులకు ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టును నిండు కుండలా చేసిన నదీమతల్లి నాగార్జునసాగర్ వైపు బిరబిరా పరుగులిడుతోంది. కృష్ణవేణి ప్రవాహ ధాటికి శ్రీశైలం గేట్లు మరిన్ని తెరుచుకున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో సోమవారం మూడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా.. మంగళవారం పది గేట్ల ద్వారా 2.79 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 4.13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 144.22 టీఎంసీల నీరు ఉంది. కృష్ణమ్మ ప్రవాహం ధాటికి సాగర్‌లో నీటి మట్టం ఒక్కరోజులోనే ఆరు అడుగులు పెరిగింది. ఈ ప్రవాహ ఉధృతి మరో 10 రోజులు ఇలాగే కొనసాగితే నాగార్జునసాగర్ నిండు కుండలా మారనుంది. కృష్ణా పరిధిలో ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల నుంచీ ప్రవాహం ఉధృతంగానే కొనసాగుతోంది. ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండటం, కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం భారీగా ఉంది. అక్కడ 11.44 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తోంది. మేడిగడ్డ, సమ్మక్క, సీతమ్మ బ్యారేజీల్లోకి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదలుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి మళ్లీ పెరిగింది. సోమవారం రాత్రి 8 గంటలకు 42.8 అడుగులుగా ఉన్న నీటి మట్టం మంగళవారం సాయంత్రానికి 43.6 అడుగులకు చేరింది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఏజెన్సీ కొత్తగూడ, గంగారం, మండలాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంగారంలో 12 సెం.మీ, కొత్తగూడలో 10.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉమ్మడి ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో అక్కడక్కడా వర్షం పడింది.

గేట్లు మూసినా.. నీరు ఆగట్లే!

కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేసి నెల రోజులు కూడా గడవకముందే మూడు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. రూ.9 కోట్లతో గేట్ల మరమ్మతులతో పాటు సీసీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగంలో పనులు పూర్తిచేశారు. ఇటీవల ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చినప్పుడు 4 గేట్లను ఎత్తి నీటిని వదిలిన అధికారులు.. రెండు రోజులుగా ఇన్‌ఫ్లో తగ్గడంతో గేట్లను మూసివేశారు. కానీ, 13, 14, 15వ నంబర్ గేట్ల ద్వారా నీరు లీకవుతోంది. కాగా, గేట్లకు ఎలాంటి ఇబ్బందీ లేదని ప్రాజెక్టు ఈఈ రాథోడ్ విఠల్ చెప్పారు. గేట్లు దింపే సమయంలో ఏదైనా చెత్త అడ్డుగా వస్తే నీళ్లు లీకవుతాయని తెలిపారు.

ప్రాజెక్టు	సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	70.22	301000	300000
నారాయణపూర్	37.64	27.48	285000	277869
తుంగభద్ర	100.86	101.66	70296	32387
జూరాల	9.66	8.43	295000	285434
శ్రీశైలం	215.81	207.41	413178	279986
నాగార్జునసాగర్	312.05	144.22	155716	6744
సింగూరు	29.91	14.56	1433	391
శ్రీరాంసాగర్	80.5	35.78	12785	664
కడెం	7.6	6.47	4199	908
ఎల్లంపల్లి	20.18	17.37	11173	16081
మేడిగడ్డ	16.17	6.07	771580	771580
సమ్మక్క	6.94	6.94	915560	915560
సీతమ్మ	36.57	0.2	964919	964919

ఆగస్టు 2న ఎడమకాల్వకు నీరు

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చిచేరుతుండటంతో ఖరీఫ్‌లో సాగుకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 2వ తేదీన సాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నారు. శాసనసభ సమావేశాలు ముగియగానే మంత్రి ఉత్తమ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు నీటి విడుదల కార్యక్రమానికి హాజరుకానున్నారు.

ఇక సమయం ఇవ్వం.. కౌంటర్ దాఖలు చేయండి

- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్య కేసులో ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ వట్టె జానయ్య వేసిన పిటిషన్‌పై వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ పోలీసులు తనపై అక్రమంగా ఒకేసారి అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీ కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో జానయ్య పేర్కొన్నారు. ఆ పిటిషన్ పై జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారించింది. గత విచారణ సందర్భంగా పిటిషనర్‌ను అరెస్టు చేయొద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది దేవీనా సైగల్ హాజరై ఒక పిటిషన్‌కు కౌంటరు దాఖలు చేశామని, ఇతర పిటిషన్లకు మరికాస్త సమయం కావాలని కోరారు. ఇప్పటికే రెండుసార్లు సమయం ఇచ్చామని, ఇక సమయం ఇవ్వబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే.. కేసులు ఎక్కువగా ఉన్నాయని, ప్రతి కేసు విచారణకు వచ్చినప్పుడు దానిపై నేరుగా వాదనలు విని పిస్తామని న్యాయవాది అభ్యర్థించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. విచారణను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. తదుపరి విచారణ తేదీని తర్వాత వెల్లడిస్తామని స్పష్టం చేసింది.

ఈవోడబ్ల్యూకు జీఎస్టీ స్కాం కేసు

- డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం
- సోమేశ్‌కుమార్ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో చోటుచేసుకున్న రూ.1,400 కోట్ల వస్తు సేవల పన్ను(జీఎస్టీ) కుంభకోణం కేసు దర్యాప్తును సీఐడీలోని ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) చేపట్టనుంది. రేవంత్ సర్కారు ఏర్పడ్డ తర్వాత సీఐడీకి అప్పగించిన మొదటి కేసు కావడంతో అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తుపై దృష్టి సారించారు. ఎస్పీ పర్యవేక్షణలో డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి కేసు బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిసింది. సీఐడీ చీఫ్ శిఖాగోయల్ ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. అక్కడి నుంచి ఆమె అధికారులకు అవసరమైన మౌఖిక ఆదేశాలను జారీ చేస్తున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే కేసు దర్యాప్తునకు అధికారులు, బృందాలను రంగంలోకి దింపనున్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట హైదరాబాద్ సీసీఎస్ పోలీస్‌లు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత, ఇతర రాష్ట్రాలతో లింకులు ఉండటంతో సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వం సీఐడీని రంగంలోకి దింపింది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక ఇతర రాష్ట్రాల్లోని పలు కంపెనీలకు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఇప్పటికే వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.! ఢిల్లీ పర్యటన నుంచి సీఐడీ చీఫ్ వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి, న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నారు. మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్‌తోపాటు.. వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీవిశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్ శివరామ్ ప్రసాద్ ఇతరులకు నోటీస్‌లు జారీ చేసి, విచారించనున్నారు. వాణిజ్య పన్నుల విభాగం అంతర్గత విచారణ, సీసీఎస్ ప్రాథమిక విచారణలోనే స్కాం జరిగినట్లు తేలిన నేపథ్యంలో సీఐడీ విచారణలో మాజీ సీఎస్‌కు ఉచ్చు బిగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గంజాయితో పట్టుబడ్డ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్

- వికారాబాద్‌లో అరెస్టు, 62 గ్రాముల గంజాయి స్వాధీనం
- మరో ఘటనలో 50 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

వికారాబాద్, మహేశ్వరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఓ ప్రముఖ టీవీ కార్యక్రమంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న ఓ యువకుడు గంజాయి కేసులో వికారాబాద్‌లో అరెస్ట్ అయ్యాడు. పోలీసులు అతని వద్ద 62 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వికారాబాద్‌లోని పలు కూడళ్ల వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక బీజేఆర్ చౌరస్తా సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని గమనించి తనిఖీ చేశారు. వినోద్‌కుమార్ అలియాస్ అలెక్స్ అనే యువకుడి వద్ద గంజాయి లభ్యమవ్వడంతో ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన అలెక్స్ ఓ టీవీలో ప్రసారమయ్యే డ్యాన్స్ కార్యక్రమంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడని



ఎక్సైజ్ పోలీసుల అదుపులో అలెక్స్

పోలీసులు పేర్కొన్నారు. కాగా, అలెక్స్ పలువురు స్నేహితులతో (అమ్మాయిలు కూడా ఉన్నారు) కలిసి హైదరాబాద్ నుంచి వికారాబాద్ వచ్చి సోమవారం నుంచి ఓ లాడ్జిలో బస చేసినట్టు పోలీసులు గుర్తించారు. మరో ఘటనలో శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మహేశ్వరం గేటు సమీపంలో చేసిన తనిఖీల్లో 50 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మహేశ్వరం గేటు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఏపీకి చెందిన అనిల్, వెంకటలక్ష్మిని పోలీసులు సోమవారం తనిఖీ చేశారు. వారి వద్ద సుమారు రూ.13 లక్షల విలువైన 50 కిలోల గంజాయి దొరకడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసిన నిందితులు హైదరాబాద్‌లో అమ్మేందుకు వెళుతూ పోలీసులకు చిక్కారు.

గంజాయి రవాణా.. ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, జూలై 30 : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య.. ట్రాక్టర్‌లో గంజాయిని రవాణా చేస్తూ 2021 జూలై7న డోర్నకల్‌లో పట్టుబడ్డారు. వీరి వద్ద రూ.30 లక్షలు విలువ చేసే మూడు క్వింటాళ్ల గంజాయి దొరికింది. ఈ కేసులో విచారణ అధికారి, అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ సాక్ష్యాన్ని తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్ నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.



వేములవాడ దేవస్థానంలో చీరను అందిస్తున్న విజయ్

రాజన్నకు అగ్గిపెట్టెలో అమరే శాలువా, చీర

- సిరిసిల్ల నేత కళాకారుడు విజయ్ ప్రతిభ



సిరిసిల్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామికి అగ్గిపెట్టెలో అమరే ఇక్కత్ డిజైన్లతో నేసిన పట్టుచీర, పట్టు శాలువాను జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ మంగళవారం సమర్పించాడు. విభిన్నంగా వస్త్రాలను తయారు చేసే విజయ్.. ఇక్కత్ డిజైన్‌తో 5.50 మీటర్లు, 48 ఇంచులు ఉండే పట్టుచీర, రెండు మీటర్లు, 32 ఇంచుల వెడల్పుతో ఉండే పట్టు శాలువాను అగ్గిపెట్టెలో అమరే విధంగా చేనేత మగ్గంపై తయారుచేశాడు. వంద గ్రాములు ఉండే పట్టుచీర ఖరీదు రూ.12 వేల వరకు ఉంటుందని విజయ్ తెలిపారు. గతంలో కూడా విజయ్ అగ్గిపెట్టెలో అమరే పట్టుచీరలు, శాలువాలు, కుట్టు లేకుండా వస్త్రాలు నేశాడు. బంగారు జరీ, వెండి జరీతో త్రీడీ కలర్స్‌తో పట్టుచీరను నేసి శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం రామయ్యకు అందించాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

టేకులపల్లి, జూలై 30: అప్పుల బాధ తాళలేక భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన జాల ఉపేందర్(33) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. నాలుగేళ్ల క్రితం అప్పుచేసి మరో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. దిగుబడులు రాకపోవడంతో ఇంకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చలేక ఉపేందర్ సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

రూ.40 కోట్లు కొల్లగొట్టారు!

- సినీ నిర్మాత బషీద్, బ్యాంకు మేనేజర్ కలిసి ఘరానా మోసం
- 'ఆదిత్య బిర్లా' ఖాతాల నుంచి సొమ్ములు కొల్లగొట్టిన వైనం
- బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఒక సినీ నిర్మాతతో కలిసి బ్యాంకు మేనేజర్, మరో ఉద్యోగి కుమ్మక్కై మోసపూరిత లావాదేవీలతో రూ.40 కోట్లు కొల్లగొట్టారు. సైబరాబాద్ పోలీసులు మంగళవారం వారిని అరెస్టు చేశారు. ఇండస్ ఇండ్ బ్యాంకు శంషాబాద్ జోన్‌లో బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్న రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్ అక్రమ లావాదేవీలు జరిపి బ్యాంకుకు రూ.40 కోట్లు నష్టం చేశారని బ్యాంకు జోనల్ హెడ్ మణికందన్ రామనాథన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రామస్వామి, రాజేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. వ్యాపారి, సినీ నిర్మాత అయిన షేక్ బషీద్ ప్రోద్బలంతో ఈ మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. మొదటి నుంచి ఆర్థిక నేరాలకు పాల్పడే బషీద్‌కు బ్యాంకు మేనేజర్‌తో పరిచయమైంది. సులభంగా రూ.కోట్లలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఉన్న బషీద్.. బ్యాంకు మేనేజర్‌కు సలహా ఇచ్చాడు. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థకు చెందిన ఖాతాలన్నీ ఇండస్ ఇండ్ బ్యాంకులోనే ఉండడంతో అనధికారికంగా ఆ ఖాతాల్లోని డబ్బులు వేరే ఖాతాల్లోకి మళ్లించి రూ.కోట్లు కొల్లగొట్టొచ్చని చెప్పాడు. రూ.వేల కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థ కావడంతో కొట్టేసిన సొమ్మును గుర్తించడానికి చాలా సమయం పడుతుందని తెలిపాడు. మోసపూరిత లావాదేవీలకు ప్రతిఫలంగా ఫార్చ్యూనర్ కార్లు బహుమతిగా ఇస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన మేనేజర్ రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్‌తో కలిసి మోసపూరిత లావాదేవీలు జరిపి రూ.40 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు తేల్చారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 2006లో ఎస్‌బీకే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించిన బషీద్.. పలు చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆర్థిక మోసాల్లో ఆరితేరిన బషీద్‌పై పలుస్టేషన్లలో 10కి పైగా కేసులున్నట్లు గుర్తించారు.


వయనాడ్‌లో ఇళ్ల మధ్యలో నేలను కోసుకుంటూ బురద ప్రవాహం


దుంగల సాయంతో బురద ప్రవాహాన్ని దాటుతున్న రెస్క్యూ బృందాలు

మృత్యు విలయం


మృతదేహాన్ని తరలిస్తున్న సహాయ సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. వారం రోజులపాటు నాలుగు జిల్లాల్లోని విద్యా సంస్థలకు సెలవులను ప్రకటించింది. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలను, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. మరో వైపు భారత వాతావరణ శాఖ మరో రెండ్రోజులపాటు 8జిల్లాలకు రెడ్‌అలెర్ట్ జారీ చేసింది. భారీ నుంచి అతి భారీ వర్షాలుంటాయని హెచ్చరించింది.

అర్ధరాత్రి విరుచుకుపడ్డ కొండచరియలు

కేరళ వ్యాప్తంగా గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వయనాడ్ ప్రాంతానికి.. ముఖ్యంగా చాలియార్ నదికి వరద ఉధృతి పెరిగింది. సోమవారం అర్ధరాత్రి సరిగ్గా 1.30 సమయంలో వరద బీభత్సానికి కొండ చరియలు విరిగిపడ్డాయి. ముండక్కై గ్రామాన్ని తుడిచిపెట్టేశాయి. ఆ గ్రామంలో 65 కుటుంబాలు నివసిస్తుండగా.. ఆ ఇళ్లలో నివసిస్తున్న వందల మంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ప్రభుత్వం వెంటనే పోలీసులను రంగంలోకి దింపింది. వర్షం, వరద, దట్టమైన పొగమంచు కారణంగా.. సహాయక బృందాలు ఆ ప్రాంతానికి చేరుకోవడంలో ఆటంకాలేర్పడ్డాయి. "మంగళవారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌తోపాటు.. త్రివిధ దళాలు రంగంలోకి దిగాయి. వైమానిక దళం హెలికాప్టర్లతో చిక్కుకుపోయిన వారిని గుర్తించి, రక్షించే ప్రయత్నం చేశాయి. కేరళలో స్థానిక యువకులతో ఏర్పాటు చేసిన 'సివిల్ డిఫెన్స్ ఫోర్స్' కూడా చురుగ్గా సహాయక చర్యల్లో పాల్గొంటోంది" అని కేరళ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ వి.సాంబశివరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వయనాడ్ ఘటన నేపథ్యంలో కేరళ సర్కారు తెలుగువాడైన సాంబశివరావును స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. కాగా.. నౌకాదళం గజ ఈతగాళ్లను రంగంలోకి దింపగా.. ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు ఆర్మీ, టెరిటోరియల్ ఆర్మీ జవాన్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం శిథిలాలను తొలగించడం ప్రారంభించాక.. నిమిష నిమిషానికి.. గంట గంటకూ మృతదేహాలు బయటపడ్డాయి. మంగళవారం రాత్రి కడపటి వార్తలందేసరికి 133 మంది మృతిచెందినట్లు అధికారులు ప్రకటించారు. మరో 250 మంది వరకు శిథిలాల కిందే ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు.. ముండక్కై గ్రామానికి ఆనుకుని ఉన్న చాలియార్ నదిలో 31 మృతదేహాలు కొట్టుకుని పోయాయి.

సహాయక శిబిరంపైనా బండరాళ్లు

తొలుత తెల్లవారుజామున 3 గంటల సమయంలో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ముండక్కైలోని కొందరు స్థానికులను ఓ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి తరలించారు. అయితే.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ పాఠశాలపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ స్కూల్ పరిసరాల్లోని ఇళ్లు, దుకాణాలు సైతం బురదలో కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సహాయక చర్యలకు ఆటంకాలేర్పడుతున్నాయని, మంగళవారం మధ్యాహ్నం మరోమారు కొండచరియలు విరిగిపడ్డాయని చెప్పారు. ముండక్కై, మెప్పాడిలో వరదలో కొట్టుకుపోయిన వారిని గుర్తించేందుకు వైమానిక దళానికి చెందిన డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ఆర్మీ, పోలీసులు శిథిలాల కింద జాగిలాలతో గాలింపు చేపట్టారు.

తాత్కాలిక ఆస్పత్రులు..

విపత్తు వేళ క్షతగాత్రులకు వైద్యం అందించడానికి అధికారులు చూరాల్‌కొండలోని మదర్సాలు, మసీదుల్లో తాత్కాలిక క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వయనాడ్ పాలిటెక్నిక్ కాలేజీలో కూడా తాత్కాలిక ఆస్పత్రి కొనసాగుతోందని అధికారులు చెప్పారు. వయనాడ్, కోళిక్కోడ్ ఫోరెన్సిక్ నిపుణులతో మెప్పాడి, నీలంబూర్‌లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కడపటి వార్తలందేసరికి 104 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయినట్లు ప్రకటించారు.

శవాల దిబ్బగా చురుల్‌మల?

ముండక్కైలో కొండచరియలు బీభత్సం సృష్టించగా.. ఉప్పొంగుతున్న చాలియార్ నది ఒకవైపు.. వరద మూడువైపులా కలిపి.. చురుల్‌మల గ్రామాన్ని నీళ్లు చుట్టేశాయి. త్రివిధ దళాలు మంగళవారం సాయంత్రానికి గానీ అక్కడకు చేరుకోలేకపోయాయి. ఉదయం నుంచే హెలికాప్టర్లు, డ్రోన్లతో గాలింపు చేపట్టినా.. చురుల్‌మల ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా సహాయక చర్యలు సాధ్యపడలేదు. నౌకాదళానికి చెందిన రివర్ క్రాసింగ్ టీమ్ రంగంలోకి దిగి.. మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకుంది. అధికారిక వర్గాల ప్రకారం చురుల్‌మలలో ఎక్కడ చూసినా మృతదేహాలే కనిపించాయని తెలిసింది.

రెడ్ అలెర్ట్

రానున్న రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయంటూ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) కేరళలోని ఎనిమిది జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ జాబితాలో ఇడుక్కి నుంచి కాసర్గోడ్ మధ్యలో అన్ని జిల్లాలు ఉన్నాయి. శబరిమల ఉన్న పథనంతిట్ట, అలప్పుళ, కోటాయం, ఎర్నాకుళం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, తిరువనంతపురం, కొల్లాం జిల్లాలకు యెల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈదురు గాలుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో పైకప్పులు బలంగా లేని ఇళ్లలో ఉండకూడదని పేర్కొన్నాయి. ప్రమాద బాధితుల కోసం కేరళ సర్కారు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. 1077, 1070 టోల్‌ఫ్రీ నంబర్లు, 9497900402, 0471-2721566 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించాలని అధికారులు కోరారు. రాత్రి కడపటి వార్తలందేసరికి త్రివిధ దళాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు 481 మందిని కాపాడినట్లు వివరించారు.

600 మంది గల్లంతు!

వయనాడ్ ముండక్కై ప్రాంతంలో ఉన్న తేయాకు, కాఫీ, యాలకుల తోటల్లో పనిచేసేందుకు వచ్చిన పశ్చిమబెంగాల్, అసోం కార్మికుల జాడ తెలియడం లేదని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి హారిసన్ మలయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్‌లో 600 మంది పశ్చిమబెంగాల్, అసోం కార్మికులు పనిచేస్తున్నారని, వారి యోగక్షేమాలు తెలియడం లేదని ఆ కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ అన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న ట్రీవ్యాలీ రిసార్ట్‌లో సుమారు 100 మంది చిక్కుకుపోయారు.

ఎన్నడూ చూడని ఘోర విషాదం: పినరయి

కేరళలో ఎన్నడూ చూడనంతలా ఘోరమైన విషాదాన్ని వయనాడ్‌లో చూశామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వీలైనంత ఎక్కువ మంది ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. "వయనాడ్ జిల్లాలో యుద్ధప్రాతిపదికన 45 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశాం. అక్కడ 3,096 మందికి వసతి కల్పించాం. కేంద్రాల్లో ఆహారం, 20 వేల లీటర్ల తాగునీటిని అందుబాటులో పెట్టాం" అని వెల్లడించారు. "ప్రాణాలు కోల్పోయినవారికి నివాళులర్పిస్తున్నాను. ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ, అమిత్‌షా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ నాకు ఫోన్ చేసి, సాయాన్ని ప్రకటించారు" అని వ్యాఖ్యానించారు. ప్రజలు కూడా సీఎం సహాయ నిధికి విరాళాలు ఇచ్చి, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కేరళకు చెందిన ఓ బ్యాంకు రూ.50 లక్షలు, తమిళనాడు సీఎం రూ.5 కోట్లు, సియాల్ రూ.2కోట్ల చొప్పున సాయం ప్రకటించాయన్నారు.

ప్రధాని మోదీ దిగ్ర్భాంతి

వయనాడ్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫోన్ చేసి, పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ పిలుపు

విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ దుర్ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన.. క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో పాల్గొనాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. విజయన్‌తో, జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి.. వయనాడ్‌కు అన్ని విధాలా సాయమందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వయనాడ్ ఘటనపై లోక్‌సభలో అత్యవసర తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

సాయానికి క్యూ



వరద బాధితులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు.. దాతలు బ్లడ్ బ్యాంకుల వద్ద బారులు తీరారు. మెప్పాడి విమ్స్ వైద్య కళాశాల, బతేరీ తాలూకా ఆస్పత్రి, కాల్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి.. అన్ని చోట్లా ఇవే దృశ్యాలు కనిపించాయి. రక్తదానం ఒక్కటే కాదు.. ఆహారం, తాగునీరు, దుస్తులు అందించడం ద్వారా ఈ సంక్షోభ సమయంలో బాధితులకు కేరళ ప్రజలు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు.

శవాల నది

- 25 కిలోమీటర్ల మేర చలియార్ నదిలో కొట్టుకుపోయిన 31 మృతదేహాలు
- ప్రవాహం ధాటికి తెగిపడ్డ అవయవాలు

మలప్పురం: తీరం పొడవునా ఆహ్లాదకరమైన ప్రకృతి సౌందర్యంతో.. చల్లటి నీటితో అలరారే చలియార్ నది వయనాడ్ విలయం నేపథ్యంలో కన్నీటి కాసారంగా మారింది! ఈ ఉత్పాతంలో ముండక్కై ప్రాంతంలో చనిపోయిన 31 మంది మృతదేహాలు.. చలియార్ నదిలో 25 కిలోమీటర్ల మేర కొట్టుకుపోయి మలప్పురం జిల్లా నీలంబూర్‌కు సమీపంలోని పోతుకల్లు వద్దకు చేరుకున్నాయి. అక్కడ రెస్క్యూ టీములు ఆ మృతదేహాలను వెలికితీశాయి. అయితే.. ప్రవాహ ఉధృతికి మృతదేహాల శరీరభాగాలు ముక్కలుముక్కలుగా ఊడిపోయాయి! వరదనీటి ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో.. మరిన్ని మృతదేహాలు చలియార్ నదిలో కొట్టుకొచ్చే ప్రమాదం ఉందని రెస్క్యూటీములు అంచనా వేస్తున్నాయి. నదిలో నీటి స్థాయిలు క్రమక్రమంగా పెరుగుతుండడంతో.. స్థానిక ప్రజలు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో సోమవారం ఉదయం నుంచి నదిలో నీటిమట్టంపై ఒక కన్ను వేసి బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటాక.. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో వయనాడ్ వైపు నుంచి చలియార్ నదిలో గ్యాస్ సిలిండర్లు, చెక్కదుంగలు కొట్టుకురావడం గమనించారు. వెంటనే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. మంగళవారం ఉదయం నుంచి నదిలో గాలించడం మొదలుపెట్టగా 26 మృతదేహాలు, వాటితాలూకా శరీర భాగాలు దొరికాయి.

ప్లీజ్ మమ్మల్ని కాపాడండి..

శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్

చిమ్మచీకట్లో కొండచరియలు విరిగిపడి.. నీరు, బురద కలిసి ప్రవాహమై విరుచుకుపడడంతో ఆ ధాటికి చాలా ఇళ్లు కూలిపోయాయి! చాలామంది బాధితులు శిథిలాల కింద చిక్కుకుపోయి.. బయటకు వచ్చే మార్గం లేక.. తమ ఆత్మీయులకు ఫోన్లు చేసి ప్రాణాలు కాపాడాలంటూ ప్రాధేయపడ్డారు. ఇలాంటి ఫోన్ సంభాషణలను స్థానిక టీవీలు ప్రసారం చేస్తున్నాయి. చూరాల్మాలా ప్రాంతంలోని ఓ మహిళ తమ వారికి ఫోన్ చేసి ఇల్లు మొత్తం కూలిపోయిందని.. తాము శిథిలాల్లో ఉన్నామని.. తమను బయటకు తీయాలని, తమ ప్రాణాలు కాపాడాలని కోరుతున్న ఆడియో వైరల్ అవుతోంది. ఈ విషాద ఘటనలో గాయపడిన ఓ వృద్ధుడు తన భార్య ఆమూకీ గల్లంతైందని ఆందోళన వ్యక్తంచేశాడు. "మేం మా ఇంట్లో నిద్రిస్తుండగా.. తెల్లవారుజామున పెద్ద శబ్దం వినిపించింది. పెద్ద పెద్ద కొండరాళ్లు, చెట్లు విరిగి మా ఇంటి పైకప్పుపై పడ్డాయి. వరదనీరు మా ప్రాంగణంలోకి ప్రవేశించింది" అని ఆ వ్యక్తి వాపోయాడు.

హిమాచల్‌ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు

- కొట్టుకుపోయిన పాదచారుల వంతెన, షెడ్లు

షిమ్లా, జూలై 30 : హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో మంగళవారం ఉదయం మేఘ విస్ఫోటంతో వచ్చిన ఆకస్మిక వరదలతో ఒక పాదచారుల వంతెన, మూడు తాత్కాలిక షెడ్లు కొట్టుకుపోయాయి. కులు జిల్లా తోష్‌నాలాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. ప్రజలు నదులు, కాలువలకు దూరంగా ఉండాలని కులు డిప్యూటీ కమిషనర్ తొరల్ ఎస్. రవీష్ సూచించారు. అలాగే కాలువల పక్కన తాత్కాలిక నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. వర్షాకాలంలో ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టకూడదని, దీన్ని ఉల్లంఘించినవారిపై చర్యలు తప్పవన్నారు. బుధ, గురువారాల్లో ఈ రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం హెచ్చరించింది. రానున్న నాలుగైదు రోజులు రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు బాగా కురుస్తాయని తెలిపింది. కులు, సోలన్, సిర్మార్, షిమ్లా, కినార్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడడంతో పాటు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 27 నుంచి రుతుపవనాలతో వర్షాలు మొదలయ్యాక జరిగిన పలు ఘటనల్లో 62 మంది మృత్యువాత పడ్డారని అధికారిక సమాచారం.


వృద్ధురాలిని కాపాడుతున్న దృశ్యం


తాడు సహాయంతో బాధితుల తరలింపు

కేరళ పాలిట చీకటి మాసాలు

- జూలై, ఆగస్టు నెలల్లో అతి పెద్ద విపత్తులు

తిరువనంతపురం: జూలై-ఆగస్టు నెలలు కేరళ పాలిట చీకటిమాసాలనే పేరు ఉంది. ఎందుకంటే.. ఆ రాష్ట్రంలో నమోదైన విపత్తుల్లో అతి పెద్దవి ఈ రెండు నెలల్లో సంభవించినవే. ఇటీవలి ఉదాహరణలే తీసుకుంటే.. 2020 ఆగస్టు 6న ఇడుక్కిజిల్లాలోని పెట్టిముడిలో ఇదే తరహాలో భారీవర్షాలకు కొండచరియలు విరిగిపడి 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు.. 2019 ఆగస్టు 8న మలప్పురం, వయనాడ్, కోళికోడ్ జిల్లాల్లోని కవలప్పర, పుదుమాల, విలంగాడ్ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 76 మంది చనిపోయారు. వారిలో 16 మంది మృతదేహాలు ఇప్పటికీ దొరకలేదు. 2021లో ఇడుక్కి జిల్లాలో రెండు చోట్ల కొండచరియలు విరిగిపడి 21 మంది చనిపోయారు. ఇక.. 2018 ఆగస్టులో కేరళను తీవ్ర విషాదంలో ముంచెత్తిన వరదలపై ఒక సినిమా కూడా వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వరదల్లో 483 మంది చనిపోయారు. 15 మంది మృతదేహాలు దొరకలేదు. ఆ వరదల దెబ్బకు.. 14 జిల్లాల పరిధిలో పది లక్షల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆ ఏడాది వర్షపాతం సాధారణం కంటే 23% అధికంగా ఉండడంతో రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి! దీంతో కేరళలోని 54 డ్యాముల్లో 35 డ్యాములను తెరిచి నీటిని వదిలేశారు. ఒకేసారి అన్ని డ్యాములను తెరవడం ఆ రాష్ట్ర చరిత్రలోనే అది మొదటిసారి. ఆ సమయంలో కేరళలో దాదాపు 5000 చిన్న, పెద్ద కొండ చరియలు విరిగిపడినట్టు ఒక అంచనా. కేరళలో ఏడుపదులు దాటిన వృద్ధులంతా కథలు కథలుగా చెప్పేది.. 1974 విలయం గురించే! ఆ ఏడాది జూలై 26ను ఒక భయానక రాత్రిగా వారు అభివర్ణిస్తుంటారు. ఆ రోజు మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉండడంతో కొండచరియలు విరిగిపడి 33 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ ప్రణాళిక 2016 ప్రకారం.. ఆ రాష్ట్రంలో 1961-2016 నడుమ కొండచరియలు విరిగిపడి మరణించిన వారి సంఖ్య 295. కాగా.. అడవుల నిర్మూలన, పర్యావరణ మార్పు, పెరుగుతున్న భూతాపం, అరేబియా ఉపరితల జలాలు వేడెక్కడం వంటివాటివల్లే 2018, ఆ తర్వాత సంవత్సరాల్లో కేరళలో ప్రకృతి విపత్తులు ఎక్కువగా సంభవిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కేరళలో మొత్తం 14 జిల్లాలు ఉండగా.. వాటిలో ఒక్క అలప్పుజ తప్ప మిగతా 13 జిల్లాలూ వరదలు, కొండచరియలు విరిగిపడే ముప్పును ఎదుర్కొంటున్నవేనని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.


శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు ప్రయత్నిస్తూ...

అరేబియా సముద్రం వేడెక్కుతుండడంతో.. కేరళలోని పలు ప్రాంతాల్లో డీప్ క్లౌడ్ సిస్టమ్స్ ఏర్పడి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయని.. కొండ చరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని కొచ్చిన్ వర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ రాడార్ రిసెర్చ్ డైరెక్టర్ అభిలాష్ తెలిపారు.

బురద ప్రవాహంలో 5 గంటలు



పెద్ద పెద్ద రాళ్లను, బురదను తోసుకుంటూ.. దూసుకుంటూ.. ప్రళయంలా ముంచెత్తుతున్న వరద ప్రవాహం! ఆ వెల్లువ ధాటికి తట్టుకుని నిలబడడం చాలా కష్టం!! కానీ.. వయనాడులో ప్రకృతి విలయానికి కేంద్రస్థానమైన ముండక్కైలో ఒక వ్యక్తి మాత్రం నడుములోతు బురదనీటిలో కూరుకుపోయి.. బండరాళ్ల మధ్య ఇరుక్కుని.. బయటపడే దారి లేక.. ఐదు గంటలపాటు ప్రాణాలు అరచేతపట్టుకుని అక్కడే ఉండిపోయాడు! అక్కడికి వచ్చిన సహాయక సిబ్బందిని చూసి.. చేతులు ఊపుతూ తన ప్రాణాలు కాపాడాలంటూ పెద్దగా కేకలు పెట్టాడు. సహాయ సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి అతణ్ని ఎట్టకేలకు కాపాడి బురదనీటిలోంచి బయటకు తీసుకొచ్చారు. అయితే.. ముండక్కై ప్రాంతాన్ని మిగతా ప్రాంతాలతో కలిపే బ్రిడ్జి కొట్టుకుపోవడంతో అతడిని అక్కణ్నుంచీ మెప్పాడిలోని ఆస్పత్రికి తరలించలేకపోయారు.

కొండ చరియల ప్రమాదాన్నీ పసిగట్టవచ్చు


- నేల రకం, నేలలో తేమ, కొండవాలు సమాచారాన్ని క్రోడీకరిస్తే సాధ్యమే
- ప్రభుత్వాలకు శాస్త్రవేత్తల సూచన





న్యూఢిల్లీ, జూలై 30: దేశంలో భారీ వర్షాలను ముందుగానే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలు ఉన్నట్లే కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని కూడా ముందుగానే గుర్తించి హెచ్చరించే వ్యవస్థలను రూపొందించాలని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ మాట్లాడుతూ, "ప్రతీ భారీ వర్షం కొండచరియలు విరిగిపడే పరిస్థితికి దారి తీయదు. కొండ చరియలు విరిగిపడే విపత్తును గుర్తించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం. కష్టమే కానీ సాధ్యమే" అన్నారు. కొండ చరియలు విరిగిపడే ఘటనల్లో నేలరకం, నేలలో తేమ, వాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వీటికి సంబంధించి మనకు తెలిసిన సమాచారం మొత్తాన్ని ఒక వ్యవస్థలో కూర్చడం ద్వారా ఎలాంటి పరిస్థితుల్లో కొండ చరియలు విరిగిపడతాయో ముందుగానే గుర్తించి ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. కేరళ విపత్తు నిర్వహణ నిపుణుడు శ్రీకుమార్ మాట్లాడుతూ, "120 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం 2-3 రోజులపాటు విడవకుండా కురిస్తే కేరళలోని కొండ వాలుల్లో చరియలు విరిగిపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి" అన్నారు. వయనాడులో కొండచరియలు విరిగి పడే అవకాశమున్న ప్రాంతాలు ఎక్కువని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరించడం మినహా మనం చేయగలిగింది ఏమీ లేదన్నారు. అలాంటి ప్రాంతాల్లో వర్షాకాలంలో తాత్కాలికంగా ఉండటానికి సురక్షిత షెల్టర్లు నిర్మించాలని సూచించారు. కేరళలోని కొండల్లో సగానికి పైగా ఇరవై డిగ్రీలకు మించిన వాలు కలిగి ఉన్నాయని, భారీ వర్షాలు వచ్చినపుడు ఇవన్నీ ప్రమాద భరితమేనని పర్యావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ కోల్ చెప్పారు.

లోకం తీరు



రేపు స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన

కందుకూరు/మహేశ్వరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ శంకుస్థాపనకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా తీసుకున్న ఈ వర్సిటీకి ఆగస్టు 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ వర్సిటీ కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట రెవెన్యూ పంజగూడ గ్రామ పంచాయతీ పరిధిలో 57 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం.. నిర్మాణానికి సుమారు రూ.వంద కోట్లు ఖర్చు చేయనుంది. మీర్ఖాన్‌పేటలో శంకుస్థాపన ఏర్పాట్లను మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పరిశీలించారు.

లంబాడ వర్గానికి మంత్రిపదవి ఇవ్వండి

» కేసీ వేణుగోపాల్‌కు జేఏసీ నేతల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో తమ సామాజికవర్గానికి మంత్రిపదవి ఇవ్వాలని కాంగ్రెస్‌కు లంబాడీ సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీతో భేటీ అయ్యారు. పార్టీలో తమ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు నలుగురు ఉన్నారని, వారిలో ఒక్కరికి మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కార్పొరేషన్ పదవుల పంపకంలో తమ వర్గానికి న్యాయం చేయాలని కోరారు. లకపతి, శివ రాథోడ్, అశోక్, బాబురాం నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రూ.1000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 26 ఏళ్ల కాల పరిమితి 7.31 శాతం వార్షిక వడ్డీతో ఈ అప్పు తీసుకున్నది. తెలంగాణ సహా దేశంలోని 10 రాష్ట్రాలు మొత్తం రూ.29,500 కోట్ల మేర అప్పులు తీసుకున్నాయి.

వంద శాతం నీళ్లు అబద్ధం!

» మిషన్ భగీరథ అందని ఇళ్లు 7.5 లక్షలు

» సీఎం చేతికి ఇంటింటి సర్వే నివేదిక

హైదరాబాద్, జూలై30 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ఎంతమందికి అందిందనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. 7.50 లక్షల ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదని తేలింది. ఈ మేరకు పూర్తి స్థాయి నివేదిక ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డికి అందింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద వంద శాతం కుటుంబాలకు తాగునీరు ఇస్తున్నట్లు కేంద్ర విభాగాలకు సమాచారం అందించింది. దీంతో జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు అందలేదనే ఆరోపణ ఉంది. తాజా సర్వేలో ఇంకా ఏడున్నర లక్షల ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పించాలని తేలడంతో మిషన్ భగీరథను కేంద ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్‌తో అనుసంధానించి, కేంద్రం నిధులు రాబట్టేందుకు అవకాశం ఏర్పడింది. తాజా నివేదిక ప్రకారం.. 12,769 పంచాయతీల పరిధిలో 55 లక్షల ఇళ్లు ఉన్నాయి. అందులో 7.50 లక్షల ఇళ్లకు భగీరథ అందడం లేదు. 4.50 లక్షల ఇళ్లకు అసలు నల్లా కనెక్షన్లే లేవు. 3 లక్షల ఇళ్లకు స్థానిక నీటి వనరుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ కింద చాలా మంది పలుకుబడి ఉపయోగించుకొని ఇంటికి రెండు, మూడు నల్లా కనెక్షన్లు తీసుకున్నట్లు గుర్తించారు.

23 మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

రాష్ట్రవ్యాప్తంగా 23 మంది మునిసిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. గవర్నర్ దగ్గర సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్న రఘుప్రసాద్‌ను జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా, పురపాలక శాఖ సంచాలకుల కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్ పి.శ్రీధర్‌ను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో 12 మంది జీహెచ్ఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారే కావడం గమనార్హం.

ప్రణాళిక శాఖలో నలుగురు అధికారుల బదిలీ

రాష్ట్ర ప్రణాళిక శాఖలో నలుగురు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులను జారీ చేశారు. సచివాలయంలో ప్రణాళిక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న కె.రవీందర్‌ను మహబూబ్‌నగర్ ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)గా, మహబూబ్‌నగర్ సీపీవో పి.దశరథ్‌ను సిద్దిపేట సీపీవోగా బదిలీ చేశారు. అలాగే సచివాలయంలో ఈ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వి.శేఖర్‌ను మేడ్చల్-మల్కాజిగిరి సీపీవోగా, అక్కడి సీపీవో ఎం.మోహన్‌రావును సచివాలయంలో ప్రణాళిక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

జీఎస్టీ స్కాం కేసును సీబీఐకి బదలాయించండి

» కేంద్ర హోంమంత్రికి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ

వాణిజ్య పన్నులశాఖలో వస్తుసేవల పన్ను (జీఎస్టీ) కుంభకోణం కేసును సీఐడీ నుంచి సీబీఐకి బదలాయించేందుకు జోక్యం చేసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు. ఈ శాఖలో వెయ్యికోట్లకు పైగా కుంభకోణం జరిగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, కేసును సీఐడీకి అప్పగించిందని తెలిపారు. కేసు తీవ్రత దృష్ట్యా సీబీఐ దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర హోంమంత్రికి ఆయన లేఖ రాశారు.

కేంద్రం మద్దతుతోనే తెలంగాణ నడుస్తోంది

» బడ్జెట్‌పై రాష్ట్ర సర్కారు ఆరోపణలు సరికాదు

» బీఆర్ఎస్ వల్ల ఖజానా ఖాళీ: విశ్వేశ్వర్ రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రం మద్దతుతోనే ప్రస్తుతం తెలంగాణ నడుస్తోందని లోక్‌సభలో బీజేపీ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం కాకుండా కేంద్రం ఇచ్చిన రూ.9 వేల కోట్లతోనే రాష్ట్రంలో విద్యుత్, తాగునీరు, ఆర్టీసీకి డీజిల్ సమకూరుతున్నాయని వివరించారు. తెలంగాణ ఆదాయం రూ.1.35 లక్షల కోట్లు అని.. అందులో రూ.55 వేల కోట్లు జీతాలు, రూ.80 వేల కోట్లు రుణాల వడ్డీలకే పోతుందని తెలిపారు. ఫలితంగా రాష్ట్ర ఖజానా ఖాళీగా మిగులుతుందని.. దీనికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఆరోపణలు సరికాదన్నారు. మంగళవారం లోక్‌సభలో విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో రైల్వే కోసం కేంద్రం రూ.వేల కోట్ల నిధులు కేటాయించిందని, ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్టీపీసీ ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు అనుమతి ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేకపోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల కోసం రూ.5 కోట్లు కేటాయించారని విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు.

జనవరిలో సీడీపీవో, ఈవో పోస్టుల పరీక్షలు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(సీడీపీవో), ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఈవో) పోస్టుల భర్తీకి పరీక్షల తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఇవి కంప్యూటర్ ఆధారిత ఎంపిక పరీక్షల(సీబీఆర్‌టీ)ని తెలిపింది. 23 సీడీపీవో పోస్టుల భర్తీకి 2022 సంవత్సరం సెప్టెంబరు 2న, 181 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2022 ఆగస్టు 27న టీజీపీఎస్సీ నోటిఫికేషన్లను జారీ చేసింది. ఈ పరీక్షలను వచ్చే సంవత్సరం జనవరి 3 నుంచి ప్రారంభించనున్నామని తెలిపింది. సీడీపీవో పోస్టులకు 2025 సంవత్సరం జనవరి 3న పేపర్-1 పరీక్ష, జనవరి 4న పేపర్-2 పరీక్ష కంప్యూటర్ ఆధారితంగా ఉంటాయని వివరించింది. ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి 2025 జనవరి 6న పేపర్-1 పరీక్ష, జనవరి 7న పేపర్-2 పరీక్ష ఉంటాయని, ఇవి కూడా కంప్యూటర్ ఆధారితంగానే ఉంటాయని తెలిపింది.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి!

» కొనుగోలుదారు ఆధార్ తప్పనిసరి : వ్యవసాయ శాఖ

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎరువుల అమ్మకం కచ్చితంగా ఈ- పాస్ ద్వారానే జరగాలని, అది కూడా కొనుగోలుదారు ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎరువుల సరఫరాకు సంబంధించి మంగళవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రతీ జిల్లాలో 5 వేల మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్ తప్పనిసరిగా బఫర్ స్టాక్ ఉంచాలని ఆదేశించారు. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, ఏఆర్‌కేఎస్‌లు, మ్యాక్స్‌లను రిటైలర్లుగా పరిగణిస్తామని, ఈ సంస్థలు ఎరువులను రైతులకు మాత్రమే విక్రయించాలన్నారు. మరో డీలర్‌కు అమ్మకూడదని పేర్కొన్నారు. యూరియా రేక్‌లో కనీసం 60 శాతం మార్క్‌ఫెడ్‌కు కేటాయించేలా డీఏవో చర్యలు తీసుకోవాలన్నారు. ఇక 'పీక్ సీజన్'లో నిర్దిష్ట డీలర్‌కు రోజుకు 2 ట్రక్కులకు మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు.

మూడో విడత రుణమాఫీ.. రెండు దఫాల్లో..!

రూ. 2 లక్షల వరకు బకాయిలు ఒకేసారి మాఫీ.. అంతకుమించి అప్పున్న వారికి మరో దఫాలో

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షలు, ఆపైన రుణాలున్న రైతులను రెండు విభాగాలుగా విభజించి రుణమాఫీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.లక్ష, లక్షన్నర రుణాలను రెండు విడతల్లో మాఫీ చేసిన సర్కారు.. రూ.2 లక్షలు, అంతకంటే ఎక్కువగా అప్పులున్న రైతులకు రెండు దఫాలుగా రుణమాఫీ చేయనుంది. రూ.2 లక్షల వరకు అప్పున్న రైతులను ఒక విభాగంలో, రూ.2 లక్షల కంటే ఎక్కువగా బకాయిలున్న రైతులను మరో విభాగంలో తీసుకోనుంది. అంటే.. మూడో విడత రుణమాఫీని రెండు దఫాలుగా అమలు చేయనుంది. ఈ మేరకు వ్యవసాయ, ఆర్థిక శాఖ అధికారులు రైతుల రుణ సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం.. రూ.2 లక్షల కంటే ఎక్కువ బాకీ ఉన్న రైతులకు కూడా రూ.2 లక్షలు మాఫీ చేస్తారు. అంటే ఒక రైతుకు 3 లక్షల పంట రుణం ఉంటే.. అందులో రూ.2 లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తుంది. ఆగస్టులో మూడో విడత మాఫీ పూర్తయిన తర్వాత.. ఇలాంటి రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తవడానికి మరింత సమయం పట్టనుంది.

ముందు రైతులు.. ఆ తర్వాత ప్రభుత్వం

రూ.2 లక్షల కంటే ఎక్కువ అప్పున్న రైతులకు రుణ మాఫీ చేయడానికి ప్రభుత్వం ఒక షరతు పెట్టింది. 2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని రైతులు ముందుగా బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తుంది. ఉదాహరణకు ఒక రైతుకు రూ. 2.50 లక్షల పంట రుణం ఉంటే.. తొలుత ఆ రైతు రూ.50 వేలు బ్యాంకులో చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం 2 లక్షలను మాఫీ చేసి, రైతు రుణ ఖాతాను జీరో చేస్తుంది. అయితే రెండు లక్షలకు మించి ఉన్న సొమ్మును చెల్లించడానికి రైతులు ఎక్కువ సమయం తీసుకునే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభం కావడం, పెట్టుబడి ఖర్చులు ఉండడంతో 2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లించడం రైతులకు ఇబ్బందికరంగా మారనుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేసుకోవడానికి, అదేక్రమంలో రైతులకు బకాయిలు ఉండకుండా ఏకకాలంలో పంట రుణ ఖాతాను జీరో చేయడానికే ఈ నిబంధనను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాలను గుర్తించడానికి మూడో విడత తర్వాత సర్వే చేయనున్నారు.

రెండు విభాగాలకు రూ.15 వేల కోట్లు

మూడో విడతలో 2 లక్షల రుణమాఫీకి రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి, రెండో విడత రుణమాఫీకి కూడా రూ.6 వేల కోట్ల చొప్పున నిధులు వెచ్చించారు. రూ.2 లక్షలకు మించి అప్పున్న రైతులకు మాఫీ చేయడానికి రూ.9 వేల కోట్ల మేర అవసరమవుతున్నట్లు అంచనాలున్నాయి. అంటే 2 లక్షలు, ఆపై రుణం ఉన్న రైతులకు మాఫీ చేయడానికి 15 వేల కోట్ల నిధులు అవసరమవుతాయి. అయితే సీఎం రేవంత్ మంగళవారం కూడా రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. రైతుల నుంచి వచ్చే అర్జీలు, తప్పొప్పులు, సవరణలు.. వాటి పరిష్కారంతో మరో రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన 3 విడతల మాఫీకి 31 వేల కోట్లు వెచ్చించనున్నారు.

ఎన్నికలు లేకున్నా.. రుణమాఫీ!

(మొదటిపేజీ తరువాయి)



రెండో విడత రుణమాఫీ సందర్భంగా సీఎం రేవంత్ పక్కన మహిళ రైతు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు బీజేపీ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు నెలలో పరాయి దేశ పీడన నుంచి దేశ ప్రజలు ఎలా స్వాతంత్ర్యం పొందారో.. ఈ ఆగస్టులో బ్యాంకు రుణాల నుంచి రాష్ట్ర రైతులను విముక్తులను చేసి స్వేచ్ఛా జీవులను చేయాలన్నదే తమ ఆలోచన అని చెప్పారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గవిగా మిగిలిపోతాయన్నారు.

గత ప్రభుత్వం తప్పించుకుంది..

గత ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రుణ మాఫీ కింద రూ.25 వేల కోట్లు చెల్లించలేకపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మొదటి దఫా రుణమాఫీని నాలుగు విడతల్లో అమలు చేస్తే.. అది వడ్డీలకే సరిపోయి, అసలు మిగిలిపోయిందన్నారు. రెండో దఫా 2018లోనూ రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.19 వేల కోట్లు అంచనా వేసి.. నాలుగు విడతల్లో కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. రైతులపై రూ.7 వేల కోట్ల బకాయి వేసి బాధ్యతల నుంచి తప్పించుకుందని ఆరోపించారు. కానీ, ఈ నెల 18న రూ.లక్ష వరకు రైతు రుణాలను మాఫీ చేసిన తమ ప్రభుత్వం.. నెల ముగియక ముందే రూ.1.50 లక్షల వరకు మాఫీ చేసిందని తెలిపారు. ఆగస్టులో రూ.2 లక్షల వరకూ రుణాన్ని మాఫీ చేసి.. రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ రూ.31 వేల కోట్ల రుణాన్ని మాఫీ చేయలేదని, రైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ రికార్డును సాధించిందని అన్నారు. "కార్పొరేట్ కంపెనీల అప్పులు మొండి బకాయిలుగా మారితే.. వన్ టైం సెటిల్‌మెంట్ కింద.. రూ.10 లక్షల అప్పును రూ.3 లక్షలకు కుదించుకుని బ్యాంకులు వసూలు చేసుకుంటుంటాయి. అయితే మేం రైతుల ఆత్మగౌరవం దెబ్బతినకూడదన్న ఆలోచనతో బ్యాంకులకు ఫుల్ టైం సెటిల్‌మెంట్ చేసినం. ఒక్క పైసా కూడా తగ్గకుండా ఖాతాలో వేసినం" అంటూ బ్యాంకర్లకు సీఎం చురకలు వేశారు.

సోనియా, రాహుల్ ఇచ్చిన మాట మేరకు..

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ.. తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల ఇళ్లలో జరుగుతున్న ఈ పండుగలో భాగస్వాములం కావడంతో తమ జన్మ ధన్యమైందని భావిస్తున్నామన్నారు. రాజకీయ ప్రయోజనం కంటే.. రైతు ప్రయోజనమే ముఖ్యమన్న విజ్ఞతను పాటించి.. మలి విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. కాగా, ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న రాష్ట్రం.. రూ.31 వేల కోట్ల మేరకు రుణాన్ని ఏ విధంగా మాఫీ చేస్తుందంటూ చాలా మంది మాట్లాడారని, కొందరైతే శాపనార్థాలూ పెట్టారని తెలిపారు. అయినా.. ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ చేయాల్సిందేనని కూర్చుని ప్రణాళికలు రచించి.. అన్ని రకాలుగా నిధుల సమీకరణ చేశామని పేర్కొన్నారు. తొలి దఫాలో రూ.6,098 కోట్లు, మలి దఫాలో రూ.6198 కోట్ల మేరకు మాఫీ చేశామని, రెండు దఫాల్లో సుమారు 18 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. ఇది తమ పాలనా దక్షతకు, నిబద్ధతకు నిదర్శనమని, తమ చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరని అన్నారు.

భేష్.. భట్టీ!

గత ప్రభుత్వం రాష్ట్రంపై రూ.7 లక్షల కోట్ల భారం మోపి వెళితే.. ఆ అప్పులకు ఈ ఆరు నెలల్లో ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క, రూ.43 వేల కోట్ల మేరకు వడ్డీ కట్టారని సీఎం రేవంత్ అన్నారు. ఈ ఆరు నెలలుగా ఐదు గ్యారెంటీలను అమలు చేస్తూ, ప్రతి నెలా మొదటి తారీకున ఉద్యోగులకు జీతం, పెన్షనర్లకు పెన్షన్ ఇస్తూ.. ఏ కార్యక్రమమూ ఆగకుండా చూస్తూ కూడా రైతుల రుణమాఫీ కోసం 12 రోజుల్లో పన్నెండున్నర వేల కోట్ల రూపాయలు చెల్లించి తమ ప్రభుత్వ నిబద్ధతను నిరూపించారని కితాబునిచ్చారు. ఇందుకుగాను భట్టివిక్రమార్కను, ఆర్థిక శాఖ సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. రైతాంగం ఆత్మగౌరవంతో తలెత్తుకునే ఈ కార్యక్రమం.. జీవిత కాలం గుర్తుండి పోయే తీపి జ్ఞాపకమన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మీదిగడ్డ తండాకు చెందిన మూడావత్ కోలిమి అనే మహిళా రైతు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆమెతో మాట్లాడుతూ రుణమాఫీ ఎంత అయిందని ప్రశ్నించగా.. రూ.లక్షా ఇరవై వేలు మాఫీ అయిందని చెప్పారు.

బ్యాంకర్లు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలి..

బ్యాంకింగ్ చరిత్రలోనే ఒకేసారి రూ.31 వేల కోట్ల రైతు రుణాల మాఫీ గతంలో ఎప్పుడూ జరగలేదని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాంకర్లు పంట రుణాలకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని సూచించారు. ప్రభుత్వం కేవలం రుణమాఫీకే పరిమితం కాలేదని, రైతు బీమా కింద 42 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.1580 కోట్ల ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. పంటల బీమా పథకానికి కూడా రూ.1350 కోట్ల ప్రీమియంను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతు భరోసా విధివిధానాలను కొద్ది రోజుల్లోనే ప్రకటించనున్నట్లు తెలిపారు. వీటిపై శాసనసభలో చర్చించి ఆమోదం తీసుకుంటామన్నారు. రుణమాఫీ తొలి విడతలో చిన్న చిన్న పొరపాట్ల కారణంగా 17 వేల ఖాతాలకు సంబంధించి రుణమాఫీ చెల్లింపులు జరగలేదని, నెల రోజుల్లో ఆ పొరపాట్లను సరిచేసి చెల్లించే బాధ్యత తనదేనని చెప్పారు. బ్యాంక్ అకౌంట్లు, ఆధార్‌లలో చిన్న చిన్న పొరపాట్లు జరిగి ఈ ఖాతాల్లో జమ కాలేదన్నారు. ఇందులో 8 వేల ఖాతాల్లో పొరపాట్లను సరిచేశామని, వాటికి రుణ మాఫీ చెల్లింపులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్రంలో మంచి అవకాశం ఉందని, రైతులు ముందుకు రావాలని కోరారు.

ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి యూటర్న్

తిరిగి బీఆర్ఎస్‌లోకి గద్వాల శాసనసభ్యుడు.. కేటీఆర్‌ను కలిసి.. ఘర్ వాపసీ ప్రకటన

» బండ్ల బాటలోనే మరికొందరు ఎమ్మెల్యేలు?

హైదరాబాద్/మహబూబ్‌నగర్/చేవెళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. యూటర్న్ తీసుకున్నారు. తాను తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అసెంబ్లీలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కలిశారు. తాను మళ్లీ సొంత పార్టీలోనే కొనసాగుతానని ఆయనకు చెప్పారు. దీంతో కృష్ణమోహన్‌రెడ్డి తీసుకున్న ఘర్ వాపసీ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. 64 స్థానాలతో బొటాబొటి మెజారిటీ మాత్రమే సాధించడం, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు 39 సీట్లు దక్కడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ 'ఆపరేషన్ ఆకర్ష్'కు తెరతీయగా.. బీఆర్ఎస్ నుంచి ఒకరి తరువాత ఒకరుగా 10 మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరుకున్నారు. దీంతో వీరిపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ నాయకత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే మూడింట రెండొంతుల మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం ద్వారా వారిపై అనర్హత వేటు పడకుండా చూసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో త్వరలోనే మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జరుగుతుండగా.. గద్వాల ఎమ్మెల్యే సొంత గూటికి చేరుకొని అందరికీ షాకిచ్చారు. దీంతో కాంగ్రెస్‌లో మరో తొమ్మిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మిగిలారు. వీరిలో ముగ్గురు ఎమ్మెల్యేలు సొంత పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం..

బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తిరిగి సొంత పార్టీలోకి వెళతారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ముఖ్య నేత కనిపిస్తే మాట్లాడానని, దానికే పార్టీ మారుతున్నట్లు ప్రచారం చేయడం సరికాదని వెంకట్రావు అన్నారు. తాను మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. మరోవైపు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ప్రకటించారు. తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం యాదయ్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బండ్లకు స్థానిక నేతలతో పొసగనందునే..!

గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్‌కు జైకొట్టడానికి ప్రధాన కారణం.. స్థానిక కాంగ్రెస్ నేతలతో పొసగకపోవడమేనని తెలుస్తోంది. వాస్తవానికి కృష్ణమోహన్‌రెడ్డి రాకను కాంగ్రెస్ తరఫున ఆయనపై పోటీ చేసిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, ఆమె వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే పార్టీ నాయకత్వం వారిని ఒప్పించి కృష్ణమోహన్‌రెడ్డిని చేర్చుకుంది. అయితే.. కాంగ్రెస్‌లో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని కృష్ణమోహన్‌రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. పైగా కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ కోర్టులో ఆమె కేసు వేశారు. కేటీఆర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. తనపై సరితతోపాటు బీజేపీ ఎంపీ డీకే అరుణ కోర్టులో పిటిషన్ వేశారని తెలిపారు. ఈ కేసులో తన తరఫున కోర్టులో వాదించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్.. ఇటీవలే తొలగించిందన్నారు. తిరిగి న్యాయవాదిని ఏర్పాటు చేయాలని కేటీఆర్‌ను కోరగా.. సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు.

చాంబర్‌కు వెళితే పార్టీ మారినట్లు కాదు..!

» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కృష్ణమోహన్‌రెడ్డి.. కేటీఆర్ చాంబర్‌కు వెళ్లినంత మాత్రాన పార్టీ మారినట్టా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్ కూడా తన చైర్ వద్దకు వచ్చి మాట్లాడారని, ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరినట్టేనా? అని అన్నారు. కాగా, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముగ్గురూ కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించలేకపోయారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పుడు వారిని చూసుకోవడానికి రేవంత్ అవసరం లేదని, తాను చాలునని అన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేలు ఎవరూ ఎక్కడికీ వెళ్లరని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేటీఆర్‌తో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి భేటీపై పొంగులేటి మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ స్పందించారు. తమ వద్ద రాజకీయం.. ప్రేమతో ఉంటుందని, తమ దగ్గరికి వచ్చిన వారెవరూ ఇబ్బంది పడరని చెప్పారు. బీఆర్ఎస్ వద్ద ఏముందని మళ్లీ అక్కడికి వెళతారని ప్రశ్నించారు. కేటీఆర్‌ను పాత పరిచయంతోనే కలిసి ఉంటారని వ్యాఖ్యానించారు.

కృష్ణమోహన్‌రెడ్డికి ఓపిక లేదు:యెన్నం

గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి విషయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. మంత్రుల అభిప్రాయాలకు భిన్నంగా స్పందించారు. కృష్ణమోహన్‌రెడ్డికి ఓపిక లేదని వ్యాఖ్యానించారు. గద్వాలలో ఆయన మాటకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇచ్చిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన మనుషులకు అవకాశం ఇచ్చేందుకూ అంగీకరించామని తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్‌ను అధికారిక కార్యక్రమాలకు పిలవద్దంటే మాత్రం.. అది సరికాదని చెప్పామన్నారు.

'దానం' పార్టీ మారినట్లు బహిరంగ సాక్ష్యం ఉంది


» వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించండి

» హైకోర్టును కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్‌లోకి మారిన దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దానం పార్టీ మారినట్లు బహిరంగ సాక్ష్యం ఉందని తెలిపారు. ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం, కడియం, తెల్లంలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, దానంపై అనర్హత వేటు వేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌లపై మంగళవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, జే రామచంద్రరావు వాదనలు కొనసాగిస్తూ అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పీకర్‌కు సమయం నిర్దేశించిందని చెప్పారు. దానం ఇతర పార్టీ టికెట్‌పై పోటీ చేయడం ద్వారా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొన్నారు.

విద్యుత్ విచారణ కమిషన్ సారథిగా జస్టిస్ లోకూర్

» నివేదిక ఇవ్వడానికి 3 నెలల గడువు



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్ భీంరావు లోకూర్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం(29వ తేదీ) ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం, నామినేషన్ ప్రాతిపదికన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంపై విచారణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి మూడు నెలల్లో నివేదిక అందించాలని ప్రభుత్వం లోకూర్ కమిషన్‌కు నిర్దేశించింది. జస్టిస్ లోకూర్ గతంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా పని చేశారు. ముక్కుసూటి మనిషిగా పేరుంది. ఆయన విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్‌గా రికార్డులన్నీ పరిశీలించి, అవసరమైతే నోటీసులు/సమన్లు జారీ చేస్తారు. ఇదే అంశంపై విచారణ కోసం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ వేసిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా ఆయన దాదాపు 28 మందికి లేఖలు రాశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయా తప్పిదాలకు మాజీ సీఎం కేసీఆరే కారకుడని విద్యుత్ నిపుణులు కంచర్ల రఘు, ఎం.తిమ్మారెడ్డి, ఎం.వేణుగోపాల్‌రావు, గోపాలకృష్ణన్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్‌లు కమిషన్‌కు ఫిర్యాదు చేయగా... ఆ ఫిర్యాదుల్లోని అంశాలు వాస్తవాలా? కాదా? అనే విషయమై ఫిర్యాదు చేసిన వారిని క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి అవకాశం ఇస్తూ గత జూన్‌లో కేసీఆర్‌కు కమిషన్ లేఖ రాసింది. విచారణ పూర్తి కాకుండానే మీడియాకు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి వివరాలు వెల్లడించారని తప్పు పడుతూ 12 పేజీలతో కమిషన్‌కు కేసీఆర్ లేఖ రాశారు. తర్వాత కమిషన్ విచారణను సవాలుచేస్తూ తొలుత హైకోర్టులో కేసు వేశారు. అక్కడ ఫలితం దక్కలేదు. సుప్రీంకోర్టులో కేసు వేయగా... విచారణ నుంచి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వం ఆయన స్థానంలో జస్టిస్ మదన్ భీంరావు లోకూర్‌ను నియమించింది.

జస్టిస్ లోకూర్ నేపథ్యం

- 1977లో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభం. సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుల్లో ప్రాక్టీస్. 1981లో సుప్రీంకోర్టులోఅడ్వకేట్ ఆన్ రికార్డుగా నమోదు.
- 1999-2010 మధ్యకాలంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా, తాత్కాలిక సీజేగా, 2010-2011 మధ్యకాలంలో గుహహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2011-2012 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.
- ముస్లింలు, ఇతర మైనార్టీలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఆయన తీర్పుతో కొట్టివేశారు.
- ఎన్నికల్లో మతం, కులం, భాషపై ఆధారంగా మాట్లాడేవారిని అనర్హులుగా ప్రకటించాలని వంటి సంచలన తీర్పులు ఇచ్చారు.

కదులుతున్న ప్రైవేటు బస్సులో మహిళపై అత్యాచారం!

- హైదరాబాద్‌లో ఘోరం.. నిందితుడు ఆ బస్సు అదనపు డ్రైవరే
- నిర్మల్ నుంచి 35 మందితో ప్రకాశం జిల్లాకు బస్సు
- నిర్మల్‌లో 9 ఏళ్ల కూతురుతో కలిసి బస్సెక్కిన మహిళ
- వెనుక సీట్లో తల్లీకూతుళ్లకు సౌకర్యంగా ఉంటుందని సూచన
- అదే సీట్లో పాపతో కలిసి నిద్రించిన మహిళ
- అర్ధరాత్రి ఆమె నోట్లో బెడ్‌షీట్ కుక్కి అత్యాచారం
- ప్రయాణికుల సాయంతో పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



అత్యాచార సంఘటన జరిగిన ప్రైవేట్ ట్రావెల్ బస్సును సీజ్ చేసిన ఓయూ పోలీసులు

తార్నాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్భయ ఘటనను తలపించేలా హైదరాబాద్‌లో దారుణం జరిగింది. కదులుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మహిళపై ఆ వాహన డ్రైవర్లలో ఒకడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఓయూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర వెల్లడించిన వివరాల ప్రకారం.. హరిక్రిష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు 35 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి హైదరాబాద్ మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు బయలుదేరింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు సిద్ధయ్య, కృష్ణ (40) ఉన్నారు. నిర్మల్ నుంచి వాహనాన్ని సిద్ధయ్య నడిపాడు. అక్కడ తొమ్మిదేళ్ల కూతురుతో కలిసి 27 ఏళ్ల మహిళ బస్సెక్కింది. అప్పుడే ఆమెపై అదనపు డ్రైవర్ కృష్ణ కన్నేశాడు. ఆమె తనకు మాత్రమే టికెట్ తీసుకోవడం, కూతురుకు తీసుకోకపోవడాన్ని గమనించి మాటల్లో పెట్టాడు. మధ్య సీట్లలో కాకుండా బస్సు చివరి సీట్లోకి వెళ్లి కూర్చుంటే పాపను పడుకోబెట్టడానికి ఇబ్బంది ఉండదంటూ సలహా ఇచ్చాడు. అతడు చెప్పినట్లే పాపతో కలిసి ఆమె చివరి సీట్లోకి వెళ్లి పడుకుంది. అర్ధరాత్రి 12:15 గంటలకు బస్సు హైదరాబాద్ సమీపంలోకి చేరుకుంది. బస్సులో ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఆ సమయంలో అదనపు డ్రైవర్ కృష్ణ, వెనుక సీట్లోకి వెళ్లాడు. అక్కడ బాలికతో కలిసి నిద్రిస్తున్న మహిళపై అత్యాచారానికి యత్నించాడు. నిద్రలోంచి లేచిన ఆమె.. షాక్‌లోంచి తేరుకునేలోపే నోట్లో బెడ్‌షీట్‌ను కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం.. ఏమీ ఎరగనట్లు బస్సు నడుపుతున్న సిద్ధయ్య వద్దకొచ్చి పక్కసీట్లో కూర్చున్నాడు. కొద్దిసేపటికి దిగ్భ్రాంతి నుంచి తేరుకున్న బాధితురాలు.. తన పట్ల జరిగిన ఘోరాన్ని తోటి ప్రయాణికులతో చెప్పుకొని, వారి సాయంతో డయల్-100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమిచ్చింది. అప్రమత్తమైన పోలీసులు ఆ బస్సును ఛేజ్ చేసి తార్నాక మెట్రో స్టేషన్ వద్ద పట్టుకున్నారు. అప్పటికే నిందితుడు కృష్ణ మెట్టుగూడ చౌరాస్తాలో బస్సులో నుంచి దూకి పారిపోయాడని ప్రయాణికులు చెప్పారు. బస్సు నడుపుతున్న సిద్ధయ్యను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఓయూ పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కృష్ణను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం అతడిని మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుంది.

ఒక్క రోజే 4 అత్యాచారాలు సిగ్గుచేటు: హరీశ్

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క రోజే నాలుగు అత్యాచార ఘటనలు వెలుగుచూడడం బాధాకరమని, సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. వనస్థలిపుర పీఎస్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై సామూహిక అత్యాచారం, ఓయూ పీఎస్ పరిధిలో ప్రయాణికురాలిపై బస్సు డ్రైవర్ అఘాయిత్యం, నల్లగొండ జిల్లాలో దివ్యాంగ మహిళపై అత్యాచారం, నిర్మల్ నుంచి ప్రకాశం వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో మహిళపై డ్రైవర్ అత్యాచారం ఘటనలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగటం ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగం వచ్చిందని పార్టీ ఇచ్చిన టెకీపై అత్యాచారం

- యువతిపై బాల్యస్నేహితుడి అఘాయిత్యం
- మద్యం తాగించి అపస్మారక స్థితిలో ఉండగా అత్యాచారం
- ఆపై అతని స్నేహితుడిని పిలిపించి కిరాతకం
- ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు



వనస్థలిపురం, జూలై 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సామూహిక అత్యాచారానికి గురైంది. ఉద్యోగం వచ్చింది కదా.. పార్టీ ఇవ్వు అని బాల్య స్నేహితుడు అడిగితే.. సరే అని అనడమే ఆమె చేసిన తప్పయింది. కీచకుడిగా మారిన ఆ బాల్య స్నేహితుడు.. తనని నమ్మి వచ్చిన స్నేహితురాలితో బలవంతంగా మద్యం తాగించి ఆమె అపస్మారక స్థితిలో ఉండగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై, తన స్నేహితుడిని పిలిపించి మరీ అత్యాచారం చేయించి ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. వనస్థలిపురం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి(24)కి ఓ ఐటీ కంపెనీలో ఇటీవల ఉద్యోగం వచ్చింది. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆమెతో కలిసి చదువుకున్న హయాత్‌నగర్‌కు చెందిన ఎడ్ల గౌతమ్ రెడ్డి(24) ఈ విషయం తెలిసి ఆమెకు శుభాకాంక్షలు చెప్పి పార్టీ అడిగాడు. ఇందుకు ఆ యువతి అంగీకరించగా.. సోమవారం రాత్రి ఇరువురు కలిసి సాగర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ గౌతమ్ రెడ్డి బలవంతంగా మద్యం తాగించగా ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో ఆ రెస్టారెంట్ భవనంలో ఉన్న హోటల్‌లో గది అద్దెకు తీసుకున్న గౌతమ్ రెడ్డి ఆ యువతిని గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడు, చౌటుప్పల్‌కు చెందిన మునగాల శివాజీ రెడ్డి అలియాస్ చింటు రెడ్డి(30)కి ఫోన్ చేసి అక్కడికి పిలిపించాడు. ఇద్దరూ కలిసి గదిలోకి వెళ్లగా చింటు రెడ్డి కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో స్పృహలోకి వచ్చిన బాధిత యువతి కేకలు వేయడంతో గౌతమ్ రెడ్డి, చింటు రెడ్డి అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం బాధితురాలు మరో స్నేహితుడికి ఫోన్ చేసి సాయం కోరింది. ఘటనా స్థలికి చేరుకున్న ఆ స్నేహితుడు ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి, ఆమె సోదరునికి సమాచారం ఇచ్చాడు. బాధిత యువతి సోదరుడు చేసిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గౌతమ్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న చింటురెడ్డి కోసం గాలిస్తున్నారు. బీబీఏ పూర్తి చేసి ఖాళీగా ఉన్న గౌతమ్ రెడ్డి త్వరలో విదేశాలకు వెళ్లే ప్రణాళికల్లో ఉన్నాడు.

గ్రామీణ వైద్యులకు బంపర్ ఆఫర్

(మొదటిపేజీ తరువాయి)

వైద్య ఆరోగ్యశాఖలో 50 శాతానికిపైగా వైద్యులు గ్రామీణ ప్రాంతాల్లోనే పనిచేస్తున్నారు. అయితే వేతనాలు తక్కువగా ఉండటం వల్ల చాలామంది పల్లె ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తిచూపట్లేదు. గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో 636, పట్టణ ప్రాంతాల్లో 232 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో పల్లె ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో సుమారు 400 ఎంబీబీఎస్ రెగ్యులర్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీలను భర్తీ చేయాలంటే వేతనపెంపు ఒక్కటే మార్గమని సర్కారు భావిస్తోంది. పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులకు ప్రస్తుతం మూలవేతనం రూ.58,850 వేలుగా ఉంది. దీన్ని 70 శాతం మేర పెంచి ఈ సమస్యను పరిష్కరించాలని అభిప్రాయపడుతోంది. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కూడా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. వారి వేతనాలను కూడా ఇదేస్థాయిలో పెంచే అవకాశాలున్నాయి. ఇక.. మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రుల్లో పనిచేసే అధ్యాపకుల వేతనపెంపు ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉంది. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి మూలవేతనంపై 50 శాతం, మిగతా ప్రాంతాల్లో అయితే 30 శాతం పెంచాలన్న ప్రతిపాదనలున్నాయి. ఇందులో హైదరాబాద్‌ను మినహాయించారు. దీనిపై కూడా త్వరలోనే స్పష్టత వస్తుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో ఆస్పత్రుల ఏర్పాటు ప్రస్తుతానికి ఒక దశదిశ లేకుండా ఉంది. గతంలో రాజకీయ పలుకుబడి ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రాలు(సీహెచ్‌సీ) ప్రాంతీయ ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. ఇవన్నీ భారతీయ ప్రజారోగ్య ప్రమాణాలకు అనుగుణంగా లేవు. ఒకచోట ఈ ఆస్పత్రులు దగ్గరదగ్గరగా ఉంటే.. మరోచోట కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రుల మధ్య కనీస దూరం తగ్గించే చర్యలను ప్రభుత్వం తీసుకోబోతుంది. సుమారు ప్రతి 15 కిలోమీటర్లకూ ఒక పీహెచ్‌సీ, దానికి 15 కిలోమీటర్ల దూరంలో సీహెచ్‌సీలు, ఆ తర్వాత ఏరియా ఆస్పత్రులుండేలా చర్యలు తీసుకోబోతోంది. అలాగే జనాభా ప్రాతిపదికతో పాటు ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ఆధారంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల సంఖ్యను పెంచబోతుంది.



క్యాన్సర్‌పై పోరు..

రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల సంఖ్య ఏటా పెరుగుతోంది. క్యాన్సర్ నిర్ధారణ సరిగా జరగక.. చాలా కేసుల్లో చివరిదశలో గుర్తించడం వల్ల జరగకూడని నష్టం జరుగుతోంది. అందుకే క్యాన్సర్ పరీక్షలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలోనే పూర్తిస్థాయి రోగ నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో.. కొత్తగా నాలుగు మొబైల్ క్యాన్సర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. సంగారెడ్డి, నిజామాబాద్‌లతో పాటు మరో రెండు చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. అలాగే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకయ్యే వ్యయాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల నుంచి వెచ్చించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

స్థిరవేతనాల హామీ అమలు చేయాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్

కుటుంబ సంక్షేమశాఖ కమిషనరేట్ ముందు మహాధర్నా

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థిర వేతనాలు ఇవ్వాలని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పథకంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ధర్నాలో ఆశావర్కర్లు, సెకండ్ ఏఎన్ఎమ్‌లతోపాటు వేల మంది ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. కోఠిలోని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా... కాంట్రాక్టు ఉద్యోగులకు క్యాడర్‌ను నిర్ణయించి, కనీస వేతనాన్ని(బేసిక్ పే) అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 78 రకాల క్యాడర్లలో సుమారు 17 వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని, అందరికి స్థిర వేతనాలిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అనేక సందర్భాలలో ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశామని, ధర్నాలు కూడా చేశామని, అయినా వారిలో చలనం కలగలేదన్నారు. అందుకే మహాధర్నా చేపట్టామన్నారు. ప్రభుత్వం, అధికారులు తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. కమిషనర్ కర్ణన్.. కొంతమంది నేతలను కలిసి, వారి నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు.

సరయూలో జనగామ బాలిక గల్లంతు

- ఘాట్ వద్ద స్నానం చేస్తుండగా పెరిగిన నదీ ప్రవాహం
- కొట్టుకుపోతున్న నలుగురిని ఒడ్డుకు చేర్చిన సహాయక సిబ్బంది
- 17 ఏళ్ల బాలిక గల్లంతు.. రెండ్రోజులైనా దొరకని ఆచూకీ
- యూపీ అధికారులకు లేఖ రాసిన కేంద్రమంత్రి బండి


తేజశ్రీ (ఫైల్)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక యాత్ర ఆ కుటుంబానికి పెను విషాదం మిగిల్చింది. అయోధ్యలోని సరయూ నదిలో స్నానం చేస్తుండగా నదీ ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఆ ఉధృతికి 17 ఏళ్ల బాలిక గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు జిల్లా కేంద్రంలో వాటర్ ప్లాంటు నడుపుతున్నాడు. నాగరాజు, ఆయన సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబసభ్యులు, 12 మంది కలిసి యూపీలోని అయోధ్య కాశీ యాత్ర చేయాలని సంకల్పించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి విమానంలో అయోధ్య చేరుకున్నారు. సోమవారం అయోధ్యలో బాలరాముడిని దర్శించుకొని.. సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నాగరాజు కూతుళ్లు తేజశ్రీ (17), తరుణి, భార్య జయసుధ, నాగరాజు అక్క, వదిన కలిసి ఘాట్ లోపలికి దిగారు. వారు స్నానం చేస్తుండగా ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఐదుగురూ ప్రవాహంలో కొట్టుకుపోతూ హాహాకారాలు చేశారు. అక్కడే ఉన్న సహాయక బృందం నలుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. తేజశ్రీ ఆచూకీ మాత్రం దొరకలేదు. మంగళవారం రాత్రి దాకా తేజశ్రీ ఆచూకీ లభ్యం కాలేదు. కాగా బాలిక ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అయోధ్య కలెక్టర్, ఎస్పీ నాయక్‌కు సూచించారు.

అత్యాచార నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల టౌన్/ ఖమ్మం లీగల్, జూలై 30: బాలికలపై అత్యాచారానికి పాల్పడిన రెండు వేర్వేరు కేసులను విచారించిన జగిత్యాల, ఖమ్మం జిల్లాల కోర్టులు నిందితులకు 20 ఏళ్ల జైలు శిక్షను విధించాయి. జగిత్యాల జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై 2020లో అదే గ్రామానికి చెందిన కండ్లె రమేశ్ బాబు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అతడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ముద్దాయి రమేశ్‌కు కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఈ నెల 24న తీర్పును వెలువరించింది. మరో ఉదంతంలో ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన గంగిశెట్టి రాకేశ్ (20) అనే యువకుడు 2022 నవంబర్ 26న ఓ పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువుకావడంతో ఖమ్మం జిల్లా కోర్టు అతడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించింది.

సాయం కాదు... ఆంధ్ర, బిహార్‌లకు మోసం

- బడ్జెట్‌లో పెట్టిన నిధులు ఇప్పట్లో ఇవ్వరు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూలై 30: కేంద్ర బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌లకు కేటాయించిన నిధులను కొన్నేళ్ల వరకు మోదీ ప్రభుత్వం ఇవ్వదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కేవలం నిధుల ప్రకటన చేసి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు రాష్ట్రాల్లోని ఎన్డీయే మిత్రపక్షాలను మోసగించారని మంగళవారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ కేటాయింపులు పతనమయ్యే బ్యాంకు ఇచ్చే పోస్ట్ డేటెడ్ చెక్కుల వంటివని ఎద్దేవాచేశారు. ఈ రెండు రాష్ట్రాలకు ఇచ్చిన ఆర్థిక ప్యాకేజీలతో కేంద్రానికి 20-30 వేల కోట్ల భారం పడుతుందని మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని ఆయన షేర్ చేశారు. బడ్జెట్‌లో మిత్రపక్షాలను నిర్మల మోసం చేశారన్నారు.

కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి

న్యూఢిల్లీ, జూలై 30: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్ పిలుపు మేరకు కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు నేతలు మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారాల్లోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోందని, రాజిందర్‌నగర్‌లో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మరణానికి ఇదే కారణమని విమర్శించారు. హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు.

ప్యాంగాంగ్ సరసు వద్ద చైనా బ్రిడ్జి పూర్తి

న్యూఢిల్లీ, జూలై 30: భారత సరిహద్దులోని ప్యాంగాంగ్ సరస్సు వద్ద చైనా సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేసింది! ప్యాంగాంగ్ సరస్సు ఉత్తర, దక్షిణ ఒడ్డులను కలిపే వంతెనను పూర్తిచేసిన చైనా దాన్ని వినియోగంలోకి కూడా తీసుకొచ్చింది. సరిహద్దులో బలగాలను, సామగ్రిని త్వరగా తరలించడానికి అనువైన ఈ వంతెనతోపాటు దానికి అనుబంధంగా ఉన్న రోడ్లు కూడా వాడుకలో ఉన్నాయని అమెరికాకు చెందిన బ్లాక్ స్కై అనే సంస్థ తీసిన ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేశాయి. ఈ కొత్త వంతెన అందుబాటులోకి రావడం వలన ప్యాంగాగ్ నది ఉత్తర, దక్షిణ ఒడ్డులను కలిపే దూరం 50 నుంచి 100 కిలోమీటర్ల మేర తగ్గనుంది.

కులమేదో తెలియని వ్యక్తి కులగణన అంటున్నారు!

న్యూఢిల్లీ, జూలై 30: బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కులగణన అంశం మంగళవారం లోక్‌సభలో తీవ్ర వాదోపవాదాలకు దారి తీసింది. చివరకు అది వ్యక్తిగత దూషణల స్థాయికి వెళ్లింది. బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీల మధ్య పెద్ద వివాదమే నెలకొంది. తొలుత అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ "తన కులమేదో తెలియని వ్యక్తి కూడా కులగణన గురించి మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. ఇందుకు రాహుల్ గాంధీ తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. "ఆదివాసీలు, దళితులు, వెనకబడిన వర్గాల వారి సమస్యలను లేవనెత్తేవారిని దూషిస్తారు. ఈ తిట్లను సంతోషంగా భరిస్తా. మీరు ఎంతగానైనా అవమానపరచండి. కానీ కులగణనపై పార్లమెంటు ఆమోదం పొంది తీరుతాం" అని చెప్పారు. అయితే తర్వాత, "కులాల గురించి ఏమీ తెలియని వారే కులగణనపై మాట్లాడుతున్నారని అన్నాను" అని అనురాగ్ వివరణ ఇచ్చారు.

హౌరా-ముంబై రైలు పట్టాలు తప్పి ఇద్దరి మృతి

రాంచీ, కోల్‌కతా, జూలై 30: ఝార్ఖండ్‌లో మంగళవారం రైలు ప్రమాదం సంభవించింది. హౌరా- ముంబై మెయిల్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో 22 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో చక్రధర్‌పూర్ డివిజన్‌లో జరిగింది. 18 బోగీలు పట్టాలు తప్పాయని రైల్వే అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్ర గాయాలపాలైన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.1 చొప్పున రైల్వే ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఘటనా స్థలానికి దగ్గర్లోనే ఓ గూడ్స్ రైలు కూడా పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు.

పంచాయతీ స్థాయిలో రోజువారీ వాతావరణ సూచనలు!

న్యూఢిల్లీ, జూలై 30: గ్రామ పంచాయతీ స్థాయిలో రోజువారీ వాతావరణ సూచనలు అందించే నూతన గ్రామీణ ప్రాజెక్టుకు కేంద్రం శ్రీకారం చుట్టనుంది. భారత వాతావరణ విభాగం, ఎన్జీవో కిసాన్ సంచార్‌తో కలిసి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వీటిని ప్రారంభించనుంది. బ్లాక్ స్థాయి నుంచి గ్రామపంచాయతీ స్థాయి వరకు రోజు వారీ వాతావరణ వివరాలను అందించే ఏర్పాటు చేయనున్నారు. ఈ సమాచారాన్ని అందించే బాధ్యతలను 2.69 లక్షల స్థానిక సంస్థలకు అప్పగించనున్నట్టు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ వర్గాలు తెలిపాయి. తద్వారా రైతులకు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ పరిస్థితులు తెలుస్తాయని, దీంతో వారికి సాగు విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలోనే భారత వాతావరణ విభాగం 'పంచాయతీ మౌసమ్ సేవ' పోర్టల్‌ను ప్రారంభించింది. బ్లాక్(మండల) స్థాయిలో వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అందిస్తోంది. దీనిని మరింత విస్తరించడం ద్వారా దేశవ్యాప్తంగా 6లక్షలకు పైగా గ్రామాల్లో రైతులకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తోంది.

కుక్కల దాడిలో 30లక్షల మందికి గాయాలు

న్యూఢిల్లీ, జూలై 30: దేశంలో గతేడాది 30.5 లక్షల మంది వీధి కుక్కల దాడికి గురైనట్టు కేంద్రం వెల్లడించింది. వీరిలో 286 మంది మరణించినట్టు తెలిపింది. సమగ్ర వ్యాధి నిఘా కార్యక్రమం కింద ఈ వివరాలను సేకరించినట్టు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపారు. 46.54 లక్షల మందికి యాంటీ రాబీస్ టీకాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. పశువ్యాధుల నివారణకు కేంద్రం అన్ని రాష్ట్రాలకు నిధులు అందజేస్తోందని, వీటిని రాబిస్ వ్యాధి నివారణకు కూడా ఉపయోగించుకోవచ్చన్నారు.

అణుశక్తి స్వావలంబన!

కీలక దశలోకి కల్పక్కం 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్'.. ఇంధనం నింపి పరీక్షించటానికి అనుమతి

- విజయవంతమైతే రష్యా తర్వాత మన దేశంలోనే ఈ తరహా రియాక్టర్

న్యూఢిల్లీ, జూలై 30: దేశంలోనే అత్యాధునిక, అత్యంత సంక్లిష్టమైన 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' (పీఎఫ్‌బీఆర్) సాకారం దిశగా మరో ముందంజ పడింది. తమిళనాడులోని కల్పక్కంలో నిర్మిస్తున్న ఈ అణుకేంద్రంలో అణు ఇంధనాన్ని నింపి, నియంత్రిత శృంఖల చర్యను ప్రారంభించటానికి అణుశక్తి నియంత్రణ బోర్డు అనుమతి మంజూరు చేసింది. దేశ స్వయంసమృద్ధ అణుశక్తి కార్యక్రమంలో ఇదొక మైలురాయి అని ఈ సందర్భంగా బోర్డు ఛైర్మన్ దినేశ్ శుక్లా పేర్కొన్నారు. పీఎఫ్‌బీఆర్ పూర్తయితే ప్రపంచంలోనే ఈ తరహా అణుశక్తి కేంద్రం ఉన్న రెండోదేశంగా భారత్ నిలుస్తుంది. ప్రస్తుతం రష్యా వద్ద మాత్రమే ఇటువంటి న్యూక్లియర్ రియాక్టర్ ఉంది. పీఎఫ్‌బీఆర్ నిర్మాణం వెనుక 20 ఏళ్లకుపైగా కృషి ఉంది. ఈ అణుకేంద్రాన్ని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'భారతీయ నభికీయ విద్యుత్ నిగమ్ లిమిటెడ్' (భవనీ) అనే సంస్థను 2003లో ఏర్పాటు చేసింది. నాటి నుంచీ పీఎఫ్‌బీఆర్ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో 200కుపైగా దేశీయ పరిశ్రమలు పాలుపంచుకున్నాయి. ఈ ఏడాది మార్చి 4వ తేదీన ప్రధాని మోదీ పీఎఫ్‌బీఆర్‌ను సందర్శించారు.


మార్చి 4న పీఎఫ్‌బీర్‌ను పరిశీలిస్తున్న మోదీ

థోరియంను వాడగలిగితే తిరుగుండదు

పీఎఫ్‌బీఆర్.. 500 మెగావాట్ల శీతల ద్రవ సోడియం రియాక్టర్. నిర్మాణం పూర్తయిన తర్వాత దీంట్లో విద్యుదుత్పత్తి కోసం తొలుత యురేనియం-ప్లుటోనియం సమ్మిళిత ఆక్సైడ్ ఇంధనాన్ని వినియోగిస్తారు. తర్వాత థోరియం ద్వారా యురేనియం-233ని సృష్టించి ఇంధనంగా వాడాలన్నది ప్రణాళిక. మన దేశంలో యురేనియం నిల్వలు పరిమితంగా ఉన్నాయి. ప్లుటోనియం ప్రకృతిలో దొరకదు. ఇక, థోరియం విషయానికొస్తే, దేశంలో థోరియం నిల్వలు విస్తారంగా ఉన్నాయి. థోరియంను అణు ఇంధనంగా ఉపయోగించుకోగలిగితే, విద్యుదుత్పత్తికి సంబంధించి దేశం పూర్తి స్వావలంబనను సాధించగలుగుతుంది. అందుకే థోరియంను 'ఇంధన అక్షయపాత్ర'గా మన శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో హై ఎనర్జీ ఫాస్ట్ న్యూట్రాన్లను వినియోగిస్తారు. అందుకే, వీటికి ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లనే పేరు వచ్చింది. పీఎఫ్‌బీఆర్‌లో ఇంధనాన్ని నింపటం ద్వారా భారత్, అణుశక్తి కార్యక్రమం రెండో దశలోకి ప్రవేశించినట్లవుతుంది. థోరియం నిల్వలను ఉపయోగించుకోగలిగితే మూడో దశ మొదలవుతుంది.

అణువ్యర్థాలను తగ్గించే అత్యాధునిక రియాక్టర్

పీఎఫ్‌బీఆర్ అత్యాధునిక అణు రియాక్టర్. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఇది దానంతట అదే నిలిచిపోతుంది. దేశంలోని ఇతర అణుకేంద్రాల్లో తొలిదశలో ఉపయోగించిన ఇంధనాన్ని దీంట్లో తిరిగి వాడవచ్చు. తద్వారా అణువ్యర్థాలను గణనీయంగా తగ్గించవచ్చు. అణువ్యర్థాలను ఎలా వదిలించుకోవాలన్న సంక్లిష్ట సమస్యను కూడా ఈ మేరకు పరిష్కరించవచ్చు. పీఎఫ్‌బీఆర్ విజయవంతమైతే కల్పక్కంలోనే మరో రెండు ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను నిర్మించాలన్న యోచనతో కేంద్రం ఉంది.

రాష్ట్రం పేరు ప్రస్తావించకుంటే నిధులివ్వనట్లేనా?



- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకే వేల కోట్లు కేటాయించాం: నిర్మల

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్ ప్రసంగంలో ఏదైనా రాష్ట్రం పేరు ప్రస్తావించనంత మాత్రాన ఆ రాష్ట్రానికి కేటాయింపులు జరపనట్లు కాదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో రెండు రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చారని, మిగిలిన రాష్ట్రాల పేర్లు బడ్జెట్ ప్రసంగంలోనే లేవని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆమె తిప్పికొట్టారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో ఆమె సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని విపక్ష 'ఇండియా కూటమి' తీరు సరికాదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాల పేర్లను ప్రస్తావించారా అని నిలదీశారు. 2004-05 నుంచి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదని గుర్తుచేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారన్న విపక్ష సభ్యుల విమర్శలను తప్పుబట్టారు. తెలంగాణ సహా దేశంలోని అనేక రాష్ట్రాలకు వేలకోట్ల రూపాయలు ఇచ్చామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మోటుమర్రి-విష్ణుపురం సెక్షన్‌లో రైల్వే డబ్లింగ్ పనులకు నిధులు కేటాయించామన్నారు. భద్రాచలం, డోర్నకల్ సెక్షన్‌లో రూ.770 కోట్లతో రైల్వే ప్రాజెక్టులకు నిధులు ఇచ్చాం... మొత్తంగా ఏపీ, తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.1596 కోట్లు కేటాయించామన్నారు. కేరళలో జాతీయ రహదారుల ప్రాజెక్టులకు రూ.9,667 కోట్లు కేటాయించాం. జాతీయ స్థాయిలో శాఖల వారీగా వేలకోట్ల నిధులు ప్రతిపాదిస్తామన్నారు. బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు నిధులు కేటాయించామని, ఏ రాష్ట్రానికి వంచన జరగలేదని పేర్కొన్నారు. అలాగే బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా నిర్వహించే హల్వా కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి సమర్థించారు. అది సుదీర్ఘకాలంగా వస్తోన్న సంప్రదాయమని గుర్తుచేశారు. 2013-14లో యూపీఏ హయాంలోనూ ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అప్పుడెందుకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేయలేదని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు.

మత మార్పిడి జరిపితే 20 ఏళ్లు జైలు



- ఒక్కోసారి జీవితఖైదు కూడా విధించొచ్చు
- నేరం రుజువైతే 10 లక్షల వరకు జరిమానా
- యూపీలో మత మార్పిడి నిషేధ చట్టానికి కోరలు.. సవరణ బిల్లు తెచ్చిన యోగి సర్కార్

లఖ్‌నవూ, జూలై 30: మత మార్పిడి నిషేధ చట్టాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. మత మార్పిడికి పాల్పడిన నిందితుడికి భారీగా జరిమానా, బెయిల్ దొరకడం కష్టతరం, జీవిత ఖైదు విధించేలా చట్టసవరణను మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపాదించింది. ఇప్పటివరకు బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదు మేరకు మత మార్పిడి నిరోధక చట్టాన్ని పోలీసులు ప్రయోగిస్తున్నారు. అయితే, యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ ఆమోదం పొందితే మత మార్పిడికి సంబంధించి ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. మతం మారకపోతే ప్రాణాలు తీస్తామనే పద్ధతిలో తీవ్ర బెదిరింపులకు పాల్పడిన సందర్భంలో నిందితుడికి యావజ్జీవం కూడా విధించే అవకాశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో (ఉత్తరప్రదేశ్ చట్టవ్యతిరేక మత మార్పిళ్ల నిషేధ బిల్లు- 2024(సవరణ) ఉంది. అలాగే, జరిమానాను రూ.10 లక్షల వరకు విధించవచ్చు. బెయిల్ పొందటం గతంతో పోల్చితే చాలా కష్టంగా ఉంటుంది. ఇప్పుడున్న చట్టం ప్రకారం, చిన్నపిల్లలను, దివ్యాంగులను, మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను, మహిళలను, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారి మత మార్పిడికి ప్రయత్నించిన వ్యక్తి శిక్షార్హుడు. అలాంటి వ్యక్తికి ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు జరిమానా, జైలుశిక్ష కనిష్ఠంగా ఐదేళ్లు, గరిష్ఠంగా 14 ఏళ్లు విధిస్తున్నారు. చట్ట సవరణ బిల్లు ప్రకారం, గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్షను కూడా విధించవచ్చు. మత మార్పిడి అవసరాల కోసం విదేశీ సంస్థలు లేక నిషేధించిన సంఘాల నుంచి నిధులు అందుకున్నట్టు రుజువైతే, 14 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. కోర్టు తన విచక్షణాధికారం ఉపయోగించి బాధితులకు 5లక్షల వరకు పరిహారం కూడా ఇప్పించవచ్చునని చట్ట సవరణ బిల్లులో స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 31 జూలై 2024
diksuchi@andhrajyothy.com

'క్యాట్'కు వేళాయె!



మేనేజ్‌మెంట్ కోర్సు చదవాలి అనుకునే ప్రతి ఒక్కరూ పేరొందిన కాలేజీల్లో చదవాలనుకుంటారు. అలాంటి మేనేజ్‌మెంట్ కోర్సుల అడ్మిషన్ల తొలి అంచెకు ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో మంచి పర్సంటైల్ సాధించిన అభ్యర్థులు ఆయా అడ్మిషన్లలో ముందు వరుసలో ఉంటారు.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)-2024 నోటిఫికేషన్ వెలువడింది. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో నవంబరు 24న పరీక్షను నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: అహ్మదాబాద్, ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. గతంలో నిర్వహించిన క్యాట్ పరీక్షల ప్రకారం... మొత్తం 198 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ విభాగాల నుంచి మొత్తం 66 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తాయి.

2023 క్యాట్ పరీక్షను పరిశీలిస్తే... సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు కింది విధంగా ఉన్నాయి

సెక్షన్	ఎంసీక్యూస్	నాన్ ఎంసీక్యూస్	ప్రశ్నలు	సమయం
వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)	21	3	24	40ని
డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఅండ్ఎల్ఆర్)	14	6	20	40ని
క్వాంటిటేటివ్ ఎబిలిటీ(క్యూఏ)	14	8	22	40ని
మొత్తం	**49**	**17**	**66**	**120ని**

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

ముఖ్య సమాచారం:

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తేదీలు:** ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 13 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** నవంబరు 5 నుంచి
- **పరీక్ష తేదీ:** నవంబరు 24
- **ఫలితాల ప్రకటన:** జనవరి 2025
- **వెబ్‌సైట్:** https://iimcat.ac.in/

సిలబస్

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఇందులో న్యూమరికల్ బేస్డ్ ప్రశ్నలు ఉంటాయి. బేసిక్ అర్థమెటిక్, నంబర్ సిస్టమ్, ఆల్జీబ్రా, జామెట్రీ అండ్ మెన్సురేషన్, మోడర్న్ మేథ్స్ ప్రధాన టాపిక్‌లు.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ): అభ్యర్థికున్న ఆంగ్ల భాష పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. సెంటెన్స్ కరెక్షన్ అండ్ కంప్లీషన్, ప్యారా జంబల్స్, సమ్మరీ బేస్డ్, వెర్బల్ ఎబిలిటీ ముఖ్యమైన అంశాలు.

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఅండ్ఎల్ఆర్): అభ్యర్థులు ఇచ్చిన డేటాను అవగాహన చేసుకుని దాని నుంచి మూల్యాంకనాన్ని రాబట్టే సామర్థ్యాన్ని ఈ విభాగం ద్వారా పరీక్షిస్తారు. మల్టిపుల్ గ్రాఫ్స్ టేబుల్, డయాగ్రమ్స్, క్లాక్స్ అండ్ క్యాలెండర్, అరేంజ్‌మెంట్స్ ఇందులోని ముఖ్యమైన అంశాలు.

ఇవి గుర్తుంచుకోండి..

ఇన్ని మార్కులు వస్తే చాలు అనే భావన వద్దు: క్యాట్ మిగతా అన్ని పోటీ పరీక్షల కంటే భిన్నమైనది. కనీస మార్కులు సంపాదిస్తే చాలు అనే భావన సరి కాదు. ఎందుకంటే లక్షలాది మంది రాసే ఈ పరీక్షలో మీ దృష్టి అంతా కనీస మార్కులు, పర్సంటైల్ మీద కంటే అత్యధిక స్కోరు సాధించడంపైనే ఉండాలి. ఎందుకంటే పేపర్ సులువుగా వస్తే కనీస మార్కులే మిమ్మల్ని గట్టెక్కిస్తాయి, కానీ ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లయితే పరీక్షలో మీరు ఒత్తిడికిలోనై చదివింది కూడా మర్చిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి మీ లక్ష్యం ఎక్కువ మార్కులు సంపాదించుకోవడమే అయి ఉండాలి.

సెక్షనల్ కటాఫ్ మాయలో పడొద్దు: చాలామంది అభ్యర్థులు పరీక్షకు ముందు గతేడాది కటాఫ్ మార్కులను పరిగణనలోకి తీసుకొంటారు. ఏ సెక్షన్‌లో ఎన్ని కటాఫ్ మార్కులున్నాయో పరిశీలించి ఆ మేరకు తమ అధ్యయనాన్ని కొనసాగిస్తారు. కానీ ఇది సరైన విధానం కాదు. ఎందుకంటే పరీక్ష పూర్తయిన తర్వాతే నిర్వాహకులు ఏ సెక్షన్‌కు ఎన్ని కటాఫ్ మార్కులు ఇవ్వాలనేది నిర్ణయిస్తారు తప్ప నోటిఫికేషన్ సమయంలో గానీ, పరీక్ష నిర్వహణ సమయంలో గానీ కాదు.

రుణాత్మక మార్కులు తగ్గించుకోవాలి: గత క్యాట్ ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ఈసారి కూడా TITA(Type in the Answer) లేదా నాన్-ఎంసీక్యూ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నప్పటికీ అవి ఎంత శాతం వరకు ఉంటాయనేది ఊహించడం కష్టం. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే TITA ప్రశ్నలకు ఎలాంటి రుణాత్మక మార్కులు ఉండవు. కానీ ఎంసిక్యూలకు మాత్రం తప్పుడు సమాధానానికి మార్కులు కట్ చేస్తారు. కాబట్టి అభ్యర్థులు పరీక్షను రాసేటప్పుడు రుణాత్మక మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి. వీలైనంత వరకు అలాంటి ప్రశ్నలకు కచ్చితంగా సమాధానం తెలిస్తే తప్ప వదిలివేయడమే మంచిది. ఎన్ని రుణాత్మక మార్కులు తగ్గించుకొంటే విజయావకాశాలు అంత మెరుగవుతాయి.

TITA ప్రశ్నలపై అధిక సమయం: నెగెటివ్ మార్కుల ప్రమాదం లేనప్పటికీ ఎక్కువ మంది అభ్యర్థులు తమ సమయాన్నంతా ఈ ప్రశ్నలకే వెచ్చిస్తుంటారు. కాబట్టి ఈ ప్రశ్నలకు కచ్చితమైన టైమును నిర్దేశించుకోవాలి. మార్కులు, సమయం విషయంలో సమతుల్యతను పాటించాలి

కచ్చితత్వం కోసం ఎక్కువ సమయం తీసుకోవద్దు: నెగెటివ్ మార్కింగ్ ఉంది కాబట్టి కచ్చితమైన సమాధానాలను గుర్తిస్తే తమ విజయావకాశాలు మెరుగవుతాయని ఎక్కువ మంది విద్యార్థులు భావిస్తారు. కాబట్టి ఇక్కడ అభ్యర్థులు గుర్తించాల్సింది ఏమిటంటే తెలియని ప్రశ్నకు కచ్చితత్వాన్ని కనుక్కోవడంలో ఎక్కువ సమయం వృథా చేసుకోవద్దు. కచ్చితమైన సమాధానాన్ని గుర్తించాల్సిందే, అదే సమయంలో మనచేతిలో టైమ్‌ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రశ్నను చదివి అర్థం చేసుకోగానే ఠక్కున సమాధానం గుర్తుకొస్తే పరవాలేదు, అలా కాకుండా 70 నుంచి 80 శాతం ఆ ప్రశ్న మీకు కఠినంగా ఉందని అనిపించినప్పుడు వదిలివేయడం ఉత్తమం.

సెక్షన్‌ను స్కాన్ చేయండి: పరీక్ష ప్రారంభం కాగానే సంబంధిత సెక్షన్‌ను స్కానింగ్ చేయడాన్ని ఎక్కువ మంది అభ్యర్థులు విస్మరిస్తుంటారు. ఇది సరైన విధానం కాదు. స్కానింగ్ చేయడం అంటే ప్రశ్న పత్రాన్ని మొత్తం చదవడమన్నమాట. అప్పుడే సులువైన, కఠినమైన ప్రశ్నలపై ఒక అవగాహన కలుగుతుంది. క్యాట్ ఆన్‌లైన్ పరీక్ష కాబట్టి కంప్యూటర్ స్క్రీన్‌పైన కుడివైపున సంబంధిత ప్రశ్న పత్రం సెక్షన్ మొత్తం కనిపిస్తుంది. దాని ద్వారా డబుల్ సెట్స్ ప్యాసేజెస్, ప్రశ్నలను ఎంపిక చేసుకోవచ్చు. అయితే ఈ ప్రక్రియను పరీక్ష ప్రారంభంలోనే పూర్తి చేయాలి.

ఎన్ఐఈపీఐడీలో డిప్లొమా

సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి 1200 గంటలు చొప్పున మొత్తం 2400 గంటల బోధన ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్, ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రాంతీయ భాషల్లో కూడా వివరణ ఇస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్/హిందీ భాషలో ప్రావీణ్యం తప్పనిసరి. సాధారణ స్థాయిలో వినికిడి సామర్థ్యం ఉండాలి.

ఉద్యోగావకాశాలు: ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌గా చేరవచ్చు. మూగ-చెవిటి పిల్లలకు, సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్స్‌కు ఇన్‌స్ట్రక్టర్లుగా అవకాశాలు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** ఏడాదికి రూ.14,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.200(దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు దరఖాస్తు ఫీజు లేదు)
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** ఆగస్టు 26
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ఇన్‌ఛార్జ్-అకడమిక్స్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ), మనోవికాస్‌నగర్, సికింద్రాబాద్-500009.
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in



Muskaan Scholarship Program

Description: A CSR initiative by Valvoline Cummins to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/ HMV), mechanics and individuals from the Economically Weaker Section (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students studying in Classes 9 to 12 from the southern, eastern, and north-eastern states (Assam, Manipur, Nagaland, Mizoram, Tripura, Arunachal Pradesh, Sikkim, Odisha, Bihar, Puducherry, Chhattisgarh, Kerala, Telangana, Andhra Pradesh, Jharkhand, Karnataka, Meghalaya, Tamil Nadu, and West Bengal) are eligible to apply. The scholarship is available to children of commercial drivers (LMV/ HMV), mechanics and children from the Economically Weaker Section (EWS) category. Applicants must have scored 60% or above in their previous class to be eligible. The total family income from all sources should not exceed INR 8 lakh per annum.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date to Apply: 03-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/MKSP1

SCHOLARSHIP ALERT

Mohan T Advani Centennial Scholarship Programme

Description: Blue Star Foundation aims at supporting and empowering underprivileged undergraduate and diploma students enrolled in Architecture and Engineering programmes at select private or government colleges across India through their flagship initiative, i.e. Mohan T Advani Centennial Scholarship Programme.

Eligibility: First and second-year students enrolled in a degree programme in architecture and engineering, such as Electronics Engi neering, Mechanical Engineering, Information Technology (IT), Computer Science (CS), and related STEM fields, excluding Civil Engineer ing. Applicants must have scored a minimum of 80% in Class 10 and Class 12 for first-year students, and at least 80% in Class 12 and 75% in the 1st year for second-year students. Students enrolled in specified colleges* will be eligible to apply. Applicants' annual family income from all sources must be less than INR 6 lakh. Recipients should not be beneficiaries of any other scholarship.

Prizes & Rewards: For engineering and architecture students: INR 75,000 or 50% of the annual fees (whichever is less)

For Diploma Students: INR 30,000 or 75% of the annual fees (whichever is less)

Last Date to Apply: 20-08-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/BSFS2



HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 *Last Date to Apply:* 15-08-2024

Application mode: Online only *Short Url:* www.b4s.in/aj/SIHE15

buddy4study.com

లిటిల్స్

కష్టానికి గుర్తింపు

ఒక ఊరిలో గోపయ్య అనే వడ్రంగి ఉండేవాడు. అతనికి ఏ పని అప్పజెప్పినా, ఎంతో శ్రద్ధగా నిజాయితీగా అంకితభావంతో చేస్తాడని మంచి పేరుండేది. ఒక రోజు ఆ ఊరి జమీందారు తన పడవకు రంగులు వేయమని గోపయ్యను పిలిపించాడు. జమీందారు ఇచ్చిన రంగులు తీసుకుని, పడవ దగ్గరికి వెళ్లిన గోపయ్యకు ఆ పడవకు రంధ్రం కనిపించింది. దాన్ని పూడ్చకుండా రంగులు వేయడం వల్ల ఉపయోగం లేదనుకున్న గోపయ్య ముందు ఆ చిల్లును పూడ్చి ఆ తర్వాత రంగులు వేసాడు. జమీందారు ఆ మర్నాడు గోపయ్యను వచ్చి డబ్బు తీసుకెళ్లమని చెప్పి పంపేసాడు. ఆ రోజు జమీందారు



ఒక ఊరికి, అతని కుటుంబ సభ్యులు మరో ఊరికి వెళ్లవలసి వచ్చింది. సాయంత్రం జమీందారు పొరుగూరినుండి తిరిగి వచ్చేసరికి తనత కుటుంబం కొత్తగా రంగులు వేసిన పడవలో నది అవతల ఊరికి వెళ్లారని తెలిసి, జమీందారు ఎంతో కంగారుగా నది వద్దకు పరిగెత్తుకుని వచ్చి పడవకు పడిన రంధ్రం గురించి అడిగాడు. అది చక్కగా మూసివేసిఉండటం గమనించి, గోపయ్యను పిలాచాఅడగగా, గోపయ్య తానే ఆ రంధ్రాన్ని మూసివేసి, ఆ తరువాతే పడవకు రంగులు వేసానని చెప్పాడు, అదివిన్న జమీందారు 'నేను చెప్పిన పనితో పాటు చెప్పని పని కూడా చేసిపెట్టి, ఈ రోజు నాకుటుంబ సభ్యుల ప్రాణాలు కాపాడావు గోపయ్యా' అని మెచ్చుకొని, ముందు మాట ఇచ్చిన దానికంటే ఎక్కువ డబ్బు గోపయ్యకు ఇచ్చి 'ఇది నీ మంచిమనసుకు, పడిన కష్టానికి గుర్తింపు అనుకో' అని చెప్పాడు.


10 తేడాలను గుర్తించండి?




సరైన నీడ ఏది?



ఎన్ని పక్షులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 371

					7	6		
	7		1	3		5	2	
			2	5	6			9
		7	8			4	3	1
3		4				7		5
6	5	1			4	8		
4			7	1	3			
	2	5		8	9		4	
		8	5					

సుడోకు - 370 సమాధానం

1	5	6	2
3	4	2	6
2	1	5	3
4	6	3	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.